epaper.samayamdaily.net

APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

SAMAYAM



విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131



సంపుటి: 19 | సంచిక: 70 | ఎడిటర్ : విక్రం కుమార్ | బుధవారం 24 డిసెంబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |




## ఫోన్ ట్యాపింగ్ కేసులో బిగ్ ట్విస్ట్

కేసీఆర్, హరీష్‌రావు సైతం నోటీసులు?

ఫోన్ ట్యాపింగ్ కేసులో సజ్జనార్ త్వరలో మాజీ సీఎం కేసీఆర్ తో పాటు ఇద్దరు మంత్రులకు సిట్ నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మాజీ సీఎం కేసీఆర్ తో పాటు మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులకు నోటీసులు ఇచ్చేందుకు అధికారులు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

## శ్రీహరికోటలో బ్లూబర్డ్ బ్లాక్-2 మిషన్ కౌంట్‌డౌన్ ప్రారంభం



అమెరికా కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూబర్డ్-6ను మోసుకెళ్లనున్న ఎల్‌వీఎం3-ఎం6

శ్రీహరికోటలో 24 గంటల కౌంట్‌డౌన్ ప్రారంభం

ఉదయం 8.54 గంటలకు నింగిలోకి ఎగరనున్న రాకెట్

5



# ముందుకెళ్తున్నాం

## తెలంగాణకు స్పష్టమైన విజన్ తెలంగాణ రైజింగ్

- అన్ని శాఖలకు సంబంధించి పాలసీ
- క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి అభివృద్ధికి ప్రణాళికలు
- ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట ఉద్యోగుల వివరాలు ఇవ్వండి
- అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు తరలించండి
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ సూచనలు

**హైదరాబాద్, డిసెంబర్ 23:** ప్రజాప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయింది. ఈ రెండేళ్లలో కొన్ని విజయాలు సాధించాం. కొన్ని ప్రణాళికలు రూపొందించుకున్నాం అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో ఎనర్జీ, ఎడ్యుకేషన్, ఇరిగేషన్, హెల్త్ లాంటి వివిధ శాఖలకు సంబంధించి ఒక పాలసీ లేకపోవడంతో కొన్ని సమస్యలు వచ్చాయన్నారు. అందుకే ముఖ్యమైన విభాగాలకు ఒక పాలసీని తీసుకున్నాం. రాష్ట్రానికి ఒక పాలసీ ఉండాలని తెలంగాణ రైజింగ్ -2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేశామన్నారు. రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. స్పష్టమైన విధి విధానాలతో మేము ముందుకు వెళ్తున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని శాఖల ఉన్నతాధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఆయా శాఖల్లో పనులు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. శాఖల మధ్య సమన్వయంపై కీలక సూచనలు చేశారు. ప్రతీ సెక్రటరీ వారి వారి శాఖల్లో ఉన్న రెగ్యులర్, ఔట్ సోర్సింగ్,

మిగతా 3 లో





## 5 జిల్లాల్లో ప్రయోగాత్మకంగా యూరియా యాప్

యాప్ పనితీరు పట్ల రైతులు సంతృప్తి

యాప్ ద్వారా 60,510 బస్తాలు కొనుగోలు

త్వరలో అన్ని జిల్లాల్లో అమలుకు సన్నాహాలు

03

## దమ్ముంటే సహకార ఎన్నికలు నిర్వహించండి

నామినేటెడ్ పద్ధతిలో భర్తీకి సర్కార్ యత్నం

నదీ జలాలపై మంత్రులకు జీరో నాలెడ్జ్

నల్లగొండ సర్పంచ్‌ల సమావేశంలో కేటీఆర్



2

## 22మంది మావోయిస్టుల లొంగుబాటు

లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్ కమిటీ సభ్యులు, ఆరుగురు ఏరియా కమిటీ సభ్యులు

3

## గడువులోనే మేడారం పనులు

- 200 ఏండ్లు నిలిచే శాశ్వత నిర్మాణాలు
- సంప్రదాయాలకు భంగం లేకుండా ఆలయ పునరుద్ధరణ
- డిసెంబర్ 31, జనవరి 5లోపు కీలక పనుల పూర్తి లక్ష్యం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం

3



## కేసీఆర్ ధోరణి మార్చుకో..



- తోలు వలుస్తామంటే ఎవ్వరూ భయపడరు
- అలాంటి వారికి ప్రజలే బుద్ధి చెబుతారు
- ఘాటుగా స్పందించిన డిప్యూటీ సీఎం భట్టి

3

## అక్రమవసలదారులకు ట్రంప్ గాలం

స్వచ్ఛందంగా అమెరికా వీడే వారికి 3వేల డాలర్ల తోఫా


విమాన ప్రయాణం కూడా ఉచితమే



.. వివరాలు 4లో

## బంగ్లాదేశ్‌లో అల్లర్లు.. హిందువుల ఊచకోత

బంగ్లా హైకమిషన్ ముందు వీహెచ్‌పీ ఆందోళన



.. వివరాలు 4లో




## యువతలో నైపుణ్యం పెంచేలా క్వాంటమ్ కోర్సులు

పాఠశాలల్లో దశలవారీగా కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటుకు ఆదేశం

ఐఐటీ మద్రాస్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

జనవరిలో స్టూడెంట్స్ పార్టనర్‌షిప్ సమ్మిట్ నిర్వహణకు నిర్ణయం

టెక్ విద్యార్థులతో క్వాంటమ్ టాక్' నిర్వహించిన చంద్రబాబు



**అమరావతి :** ప్రస్తుతం అందరూ క్వాంటమ్ టెక్నాలజీ గురించే ఆలోచిస్తున్నారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఆధునిక పరిశోధల కేంద్రంగా అమరావతి క్వాంటమ్ వ్యాలీ ఉంటుందని చెప్పారు. వేలాది టెక్ విద్యార్థులతో ఆన్‌లైన్‌లో 'క్వాంటమ్ టాక్' నిర్వహించిన సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. అన్ని రంగాల్లోనూ క్వాంటమ్ కంప్యూటింగ్ పనిచేయబోతోందన్నారు. క్యూబిట్, వైసర్ సంస్థలతో

మిగతా 5 లో

# రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ కిషన్ అరెస్ట్




## రూ.12కోట్లకు పైగా విలువైన ఆస్తుల గుర్తింపు

**హైదరాబాద్, డిసెంబర్ 23:** రవాణాశాఖ మహబూబ్‌నగర్ డిప్యూటీ కమిషనర్ కిషన్ నాయక్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఉదయం 5గంటల నుంచి సోదాలు నిర్వహించిన అధికారులు రూ.12కోట్లకు పైగా విలువైన ఆస్తులకు సంబంధించిన ధ్రువపత్రాలు, డాక్యుమెంట్స్, బంగారం స్వాధీనం చేసుకున్నట్టు ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. హైదరాబాద్, నిజామాబాద్, కామారెడ్డి ప్రాంతాల్లో అక్రమ ఆస్తులను గుర్తించామన్నారు. హైదరాబాద్‌లో ఆరు చోట్ల, నిజామాబాద్‌లో మూడు చోట్ల, నారాయణఖేడ్‌లో 3 చోట్ల సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. నారాయణఖేడ్‌లో 30 ఎకరాలు, నిజామాబాద్‌లో 10 ఎకరాల భూమికి సంబంధించి అక్రమ ఆస్తులను గుర్తించినట్లు వెల్లడించారు. పాట్ మార్కెట్ లోని అజిత్ గోల్డ్ దుకాణంలో కిషన్ నాయక్ పేరిట ఉన్న బంగారాన్ని తీసుకువచ్చి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఒక కిలో బంగారంతో పాటు, నిజామాబాద్‌లో లహరి అంతర్జాతీయ హోటల్, అపార్ట్‌మెంట్లకు సంబంధించిన పత్రాలను గుర్తించారు. డాక్యుమెంట్ విలువ ప్రకారం రూ.12 కోట్ల పైగా అక్రమ ఆస్తులు గుర్తించామని, బహిరంగ మార్కెట్లో వాటి విలువ రెండింతలు ఉండవచ్చని ప్రాథమికంగా అంచనాకు వచ్చామన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని అతని బంధువు విజయ్ ఇంట్లో పలు డాక్యుమెంట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. కిషన్ నాయక్ కస్టడీలోకి తీసుకొని మరిన్ని వివరాలు తెలుసుకుంటామని ఏసీబీ అధికారులు చెబుతున్నారు.

# మాట తూలిన నటుడు శివాజీ

## విమర్శలు రావడంతో క్షమాపణలు



**హైదరాబాద్, డిసెంబర్ 23:** స్త్రీల వస్త్రధారణపై నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు దుమారం చెలరేగడంతో క్షమాపణలు చెప్పారు. మంచి మాటలు చెప్పే ఉద్దేశంలో రెండు అసభ్య పదాలు దొర్లాయని, వాటి వల్ల ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే క్షమించాలని కోరారు. హీరోయిన్‌ల అందం వాళ్లు వేసుకునే డ్రెస్‌లోనే ఉంటుందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల వేదికగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఎక్స్ వేదిక వీడియో విడుదల చేశారు. ఇటీవల పలువురు హీరోయిన్స్ ఇబ్బంది పడిన సందర్భాన్ని ఉద్దేశిస్తూ 'దండోరా' ప్రీరిలీజ్ ఈవెంట్‌లో మాట్లాడాను. నాలుగు మంచి మాటలు చెబుతూనే రెండు అసభ్య పదాలను ఉపయోగించా. వాటి వల్ల ఎవరికైనా మనోభావాలు దెబ్బ తింటాయి. నేను మాట్లాడింది అమ్మాయిలందరినీ ఉద్దేశించి కాదు. 'బయటకు వెళ్లినప్పుడు మంచి దుస్తులు వేసుకుని ఉంటే మీకు ఈ ఇబ్బంది ఉండేది కాదేమోనమ్మా' అనే ఉద్దేశం తప్ప, ఎవరినీ అవమాన పరచాలని కాదు. ఏదైనా రెండు అసభ్య పదాలు దొర్లాయి. అందుకు మనస్ఫూర్తిగా క్షమాపణలు చెబుతున్నా. స్త్రీ అంటే శక్తి. నేను అమ్మవారిగా భావిస్తా. ప్రస్తుత సమాజంలో మహిళను తక్కువగా చూస్తున్నారు. అటువంటి అవకాశం ఇవ్వవద్దని చెప్పే ఉద్దేశంతో ఊరి భాష మాట్లాడా. ఆ పదాలు దొర్లకుండా ఉంటే బాగుండేది. ఒకటి మాత్రం చెబుతున్నా, మంచి చెప్పాలనే ఉద్దేశం తప్ప, ఇందులో ఎవరినీ అవమానపరచాలని, కించపరచాలని ఉద్దేశం నాకు లేదు. ఇండస్ట్రీలో మహిళల మనోభావాలు దెబ్బతిని ఉంటే మీ అందరికీ మరోసారి క్షమాపణలు అంటూ ఎక్స్‌వేదికగా నటుడు శివాజీ తెలిపారు.

# దమ్ముంటే సహకార ఎన్నికలు నిర్వహించండి

- నామినేటెడ్ పద్దతిలో భర్తీకి సర్కార్ యత్నం
- ఓటు వేసే సమయమొస్తే రైతులు కర్రుకాల్చి వాతలకు సిద్ధం
- కృష్ణా నదీ జలాలపై మంత్రులకు జీరో నాలెడ్జ్
- నల్లగొండలో సర్పంచ్‌లతో సమావేశంలో కేటీఆర్



**నల్లగొండ, డిసెంబర్ 23:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన '420' హామీలను అమలు చేయలేక, ప్రజలకు ముఖం చూపించలేక సహకార ఎన్నికల నిర్వహణ నుంచి తప్పించుకుంటోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ సర్కారు నామినేటెడ్ పద్ధతిలో 'సహకార' పదవులు నింపుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రైతులకు ఓటేసే అవకాశం ఇస్తే కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయయని అన్నారు. జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలను కూడా ప్రభుత్వం భయంతోనే వాయిదా వేస్తోందని విమర్శించారు. నల్లగొండ జిల్లాలో సర్పంచులు, వార్డు మెంబర్ల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. కార్యకర్తలకు దిశానిర్దేశంచేస్తూ.. అర్జునుడు చిలుక కన్నును లక్ష్యంగా చేసుకున్నట్టు.. మన దృష్టి కూడా కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల అమలుపైనే ఉండాలని కేటీఆర్ సూచించారు. ఎన్ని కేసులు పెట్టినా, జైలుకు పంపినా భయపడేది లేదని, నల్లగొండ, మహబూబ్‌నగర్ రైతాంగానికి న్యాయం జరిగే వరకు మన పోరాటం ఆగవద్దని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా మంత్రులకు సాగునీటిపై కనీస అవగాహన లేదని, అబద్దాలతో ప్రజలను మోసం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో కేసీఆర్ లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పే సత్తా ప్రభుత్వానికి లేదని కేటీఆర్ మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం 90 శాతం పూర్తిచేస్తే.. మిగిలిన 10 శాతం పనులను కూడా ఈ ప్రభుత్వం పూర్తిచేయలేదని విమర్శించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే కేసీఆర్ గర్జిస్తున్నారని, ఆయన గర్జనకు సమాధానం చెప్పలేక, ప్రజల దృష్టిని మళ్లించడానికి కేసుల పేరుతో నిరాధారమైన లీకులు ఇస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు నిజంగానే మేలుచేసి ఉంటే సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించేదని, కానీ ఓటమి భయంతో ప్రభుత్వం వెనకడుగు వేస్తోందని విమర్శించారు. ఎన్నికలు పెడితే రైతులు తగిన బుద్ధి చెబుతారనే భయం ముఖ్యమంత్రిలో ఉందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయదారులు, కూలీలు ప్రభుత్వంపై తీవ్ర కోపంతో ఉన్నారని, ఆ ప్రభావం ఇప్పటికే సర్పంచ్ ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. రైతుబంధు, కౌలు రైతులకు ఆర్థిక సాయం, రైతు కూలీలకు నెలకు వెయ్యి రూపాయల భరోసా వంటి హామీలను ప్రభుత్వం విస్మరించిందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే కేసీఆర్‌పై నిరాధారమైన కేసుల లీకులు ఇస్తున్నారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రికి దమ్ముంటే, కేసుల గురించి వెనుక నుండి లీకులు ఇవ్వడం మానేసి, నేరుగా కెమెరా ముందుకు రావాలని, ఏ కేసు పెడుతున్నారో చెప్పాలని సవాల్ విసిరారు. హోంమంత్రి కూడా ఆయనే కాబట్టి ధైర్యంగా ముందుకు వచ్చి మాట్లాడాలని, శిఖండి రాజకీయాలు చేయడం తగదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి, ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్ కుమార్, భూపాల్ రెడ్డి, రవీంద్ర కుమార్ నాయక్, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. వీరితోపాటు మాజీ ఎంపీ లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్సీ కర్నే ప్రభాకర్, నాయకులు చెరుకు సుధాకర్, ఒంటెద్దు నరసింహారెడ్డి, ఇతర ముఖ్య నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు.

### కాంగ్రెస్‌ది పక్కా మాఫియా పాలన

తెలంగాణలో నడుస్తోంది ప్రజా పాలన కాదు.. పక్కా మాఫియా పాలన అని కేటీఆర్ విమర్శించారు. నాడు ఎన్నికల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు మీద బాంబులు వేశారని.. నేడు ఇసుక మాఫియా కోసం ఏకంగా చెక్ డ్యామ్‌ల మీద జెలటిన్ స్టిక్స్‌తో బాంబులు వేస్తున్నారని మండిపడ్డారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వాటర్ మ్యాన్ రాజేంద్ర సింగ్ ఇది మానవ నిర్మిత విధ్వంసం అని మొత్తుకుంటున్నా, ఈ 'చిట్టి నాయుడి' ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదని అన్నారు. ఇది ప్రభుత్వమా లేక గ్యాంగ్ స్టర్ల అడ్డాయా అని నిలదీశారు. ప్రకృతి వైపరీత్యం వల్ల కూలిపోయాయని కట్టుకథలు అల్లిన కాంగ్రెస్ మంత్రులకు రాజేంద్ర సింగ్ రిపోర్ట్ చెంపపెట్టు అని కేటీఆర్ అన్నారు. ఇప్పుడు మీ సమాధానం ఏంటి రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు.

# కేసీఆర్ రాకతో సర్కార్‌లో వణుకు

- అర్ధరాత్రి వరకు మీటింగ్‌లు.. సమీక్షలు
- సీఎం రేవంత్‌కు సచివాలయ వాస్తు భయం
- అందుకే సచివాలయానికి రావడం లేదు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శలు



**హైదరాబాద్, డిసెంబర్ 23:** కేసీఆర్ మీడియా ముందుకు వచ్చిన తర్వాత రేవంత్ సర్కార్ డిఫెన్స్‌లో పడిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. తాను 25 ఏళ్ళుగా రాజకీయాల్లో ఉన్నానని, రాత్రి 9.30 గంటలకు ముఖ్యమంత్రి చిట్‌చాట్ పెట్టడం చూడలేదని చెప్పారు. మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడిన ఆయన.. అందాల పోటీలు, ఫుట్‌బాల్ షోకులు, గ్లోబల్ సమ్మిట్‌లు అన్నం పెడతాయా? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌కు వాస్తు భయం పట్టుకుందని, అందుకే సచివాలయానికి పోవటం లేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాలుగు వేల మంది సర్పంచ్‌లుగా గెలిచారని, బీఆర్ఎస్ దెబ్బకు డీసీసీబీలకు ఎన్నికలు పెట్టడం లేదని, కాంగ్రెస్ కార్యకర్తలను నామినేట్ చేయాలని చూస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. రేవంత్‌రెడ్డి పోలీసులు లేకుండా ఓయూకు వస్తానని చెప్పారని, కానీ పోలీస్ పహారా మధ్య వచ్చారని అన్నారు. ఇరిగేషన్‌పై పీపీటీని స్వాగతిస్తున్నా మని, పీపీటీపై అసెంబ్లీలో తమకూ సరిపడా అవకాశం ఇవ్వాలని కోరారు. అసెంబ్లీలో తమ గొంతు నొక్కడం, మైక్ కట్ చేయడం లాంటివి చేయవద్దని అన్నారు. ఎవరి వాదన నిజమో ప్రజలు తేలుస్తారని చెప్పారు. సీపీఐ, ఎంఐఎం, బీజేపీ కంటే తక్కువ సమయం బీఆర్ఎస్‌కు ఇస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్‌కు ప్రభుత్వం భయపడుతుందని, అవకాశం ఇస్తే అసెంబ్లీలో కాంగ్రెస్ సర్కార్ బట్టలు విప్పుతామని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం దాచిపెట్టిన అన్ని జీవోలను నాలుగు వారాలలోపు బహిర్గతం చేయాలని, పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు సోకాల్డ్ ప్రజా ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. రేవంత్‌రెడ్డి తనది ప్రజా ప్రభుత్వం అని చెప్పుకోవడం కాదని, చీకటి జీవోల మాటున దొంగచాటుగా ఏం చేస్తున్నాడో బహిర్గతం చెయాలని ఆయన ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. ప్రజాపాలన అని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ జీవోలు దాస్తూ డ్రామాలు చేస్తున్నదని హరీశ్‌రావు విమర్శించారు. ఆర్టీఐ సమాధానం ఆధారంగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్ హైకోర్టులో వేసిన పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ తో ఆ డ్రామాలు బయటపడబోతున్నాయని అన్నారు. 2023 డిసెంబర్ 7 నుంచి 2025 జనవరి 1 వరకు అంటే మొత్తం 13 నెలల్లో ప్రభుత్వం 19,064 జీవోలు జారీ చేసిందని, వాటిలో కేవలం 3,290 జీవోలు మాత్రమే పబ్లిక్ డొమైన్‌లో ఉంచడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఒక్క ఏడాదిలో 15,774 జీవోలు అంటే 82 శాతం జీవోలను దాచిపెట్టి ప్రభుత్వం ఏం చేస్తున్నట్లని హరీశ్‌రావు నిలదీశారు. 'రేవంత్ రెడ్డీ ఇదేనా మీరు చెప్పుకుంటున్న ప్రజా ప్రభుత్వం అని ప్రశ్నించారు.

# గడువులోనే మేడారం పనులు

- 200 ఏండ్లు నిలిచే శాశ్వత నిర్మాణాలు
- జనవరి 5లోపు కీలక పనుల పూర్తి లక్ష్యం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం



**తద్వాయి, డిసెంబర్ 23 :** దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు తరలివచ్చే మేడారం మహాజాతరను పురస్కరించుకొని చేపట్టిన అభివృద్ధి పనులన్నీ అనుకున్న సమయానికే పూర్తి చేస్తామని, తాత్కాలిక పనులు కాకుండా రెండు వందల సంవత్సరాలు చెక్కుచెదరకుండా ఉండే శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. మేడారం జాతర సందర్భంగా మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు సమ్మక్కఉసారలమ్మలను దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటున్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని అన్నారు. మంగళవారం మంత్రి ధనుసరి అనసూయ సీతక్క, ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్., జిల్లా పోలీస్ అధికారి సుధీర్ రామనాథ్ కేకన్, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి చిత్ర మిశ్రా, అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్‌తో కలిసి మేడారంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. సమ్మక్కఉసారలమ్మ ఆలయ అభివృద్ధి పనులు, శిలా శిల్పాల తయారీ, క్యూలైన్ నిర్మాణం, గోవిందరాజుఉపగిడిద్దరాజుల గద్దెల పనులు, ఆలయ నేల పనులు, ప్రహరీ స్తంభాల నిర్మాణం, చిలుకలగుట్ట రహదారి, జంపన్నవాగు, కన్నెపల్లి, బస్సు నిలయం పరిసరాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం మేడారంలోని హరిత హోటల్‌లో సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, గుత్తేదారులతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సమ్మక్కఉసారలమ్మ జాతర సమీపిస్తున్న నేపథ్యంలో ఆలయ ప్రాంగణ పనులు, సివిల్ పనులు, గద్దెల చుట్టూ రక్షణ ఏర్పాట్లు, బయటి వైపు రహదారుల నిర్మాణాన్ని డిసెంబర్ 31లోపు, మిగిలిన పనులను జనవరి 5లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రధాన ద్వారం పనులు కూడా అదే గడువులోపు పూర్తిచేయాలని సూచించారు. మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ, ఆదివాసీ గిరిజనుల అస్తిత్వాన్ని కాపాడుతూ పనులు చేపట్టామని, సంప్రదాయాలకు విరుద్ధంగా ఏ పని చేయడం లేదని స్పష్టం చేశారు. రాబోయే తరాలకు అమ్మవార్ల చరిత్ర తెలియాలనే ఉద్దేశంతో శిల్పాలను రూపొందిస్తున్నామని తెలిపారు. పార్లమెంట్ సభ్యుడు బలరాం నాయక్ మాట్లాడుతూ, మేడారం మహాజాతరపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి భారీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమన్నారు. మేడారం మహాజాతరను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని, భక్తుల భద్రత, సౌకర్యాలే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అధికారులు తెలిపారు.

# కేసీఆర్ ధోరణి మార్చుకో

- తోలు వలుస్తామంటే ఎవ్వరూ భయపడరు
- అలాంటి వారికి ప్రజలే బుద్ధి చెబుతారు
- ఘాటుగా స్పందించిన డిప్యూటీ సీఎం భట్టి



**ఖమ్మం, డిసెంబర్ 23:** తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం ముదిరింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రంగా స్పందించారు. శాసనసభకు వచ్చే ధైర్యం లేని వారు, బయట ఉండి అడ్డగోలుగా మాట్లాడటం తగదని ఆయన హెచ్చరించారు. ప్రజా ప్రభుత్వంపై భారత రాష్ట్ర సమితి నేతలు విషం కక్కుతున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం పినపాక గ్రామంలో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఉపముఖ్యమంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు పెడుతున్నామని, ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం చేయట్లేదని వివరించారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కోసం ఏడా రూ.12,500 కోట్లు విద్యుత్‌శాఖకు ప్రభుత్వం చెల్లిస్తోందని చెప్పారు. తోలు తీస్తామని బీఆర్ఎస్ నేతల మాదిరిగా దిగజారి మాట్లాడలేమన్నారు. అలాంటి వ్యాఖ్యలు చేసిన వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. రెండేళ్లుగా అసెంబ్లీకి రాని కేసీఆర్.. మీడియా సమావేశంలో ఇష్టారీతిన మాట్లాడుతున్నారని విమర్శించారు. శాసనసభకు రావడానికి కేసీఆర్ భయపడుతున్నారన్నారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన గొప్ప తీర్పు అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలోని 85 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ భారీ ఆధిక్యతతో ఉంది. గతంలో ఏ రాజకీయ పార్టీని కూడా ప్రజలు ఇంత పెద్ద ఎత్తున దీవించలేదు. ఇందిరమ్మ రాజ్యం ప్రజల పక్షాన నిలబడటం వల్లే ప్రజలు స్వచ్ఛందంగా మాకు మద్దతు ఇస్తున్నారు అని ఆయన వివరించారు. ముఖ్యంగా 65 శాతం సర్పంచ్ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. కేసీఆర్ చేసిన 'తోలు వలుస్తాం' అనే వ్యాఖ్యలను భట్టి తీవ్రంగా ఖండించారు. తోలు తీసుకునే ఉద్యోగం నువ్వు ఎప్పుడు తీసుకున్నావు కేసీఆర్? పదిమందిని కూర్చోబెట్టుకొని తోలు వలుస్తానంటే ఇక్కడ ఎవరూ భయపడే వారు లేరు. నువ్వు అడ్డగోలుగా మాట్లాడినా, మేము మాత్రం దిగజారి ప్రవర్తించము. మా అభివృద్ధి చాటల ద్వారానే మీకు సమాధానం చెబుతాం' అని భట్టి వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నాయకుడిగా శాసనసభకు వచ్చి ప్రజల సమస్యలపై మాట్లాడాల్సిన బాధ్యతను కేసీఆర్ విస్మరిస్తున్నారని ఆయన విమర్శించారు. సభకు వచ్చే ధైర్యం లేకనే బయట ఉండి ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. గతంలో జరిగిన ఎన్నికలకు, ఇప్పుడు జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలకు చాలా తేడా ఉందని భట్టి విక్రమార్క అన్నారు. ఎటువంటి ఒత్తిడి లేకుండా, పూర్తి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించామని, అందుకు ప్రజలు ఓటు ద్వారా కాంగ్రెస్ పార్టీకి అద్భుతమైన మద్దతు ఇచ్చారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల కంటే మెరుగైన ఫలితాలను ప్రజలు ఇచ్చారని, ఇప్పటికైనా కేసీఆర్ తన ధోరణి మార్చుకోవాలని ఆయన హితవు పలికారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల తీర్పును గౌరవించాల్సింది పోయి, విమర్శలకే పరిమితం కావడం ప్రతిపక్షాలకు తగదని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు

# 5 జిల్లాల్లో ప్రయోగాత్మకంగా యూరియా యాప్

- యాప్ పనితీరు పట్ల రైతులు సంతృప్తి
- రెండురోజుల్లో యాప్ ద్వారా 60,510 బస్తాలు కొనుగోలు
- త్వరలో అన్ని జిల్లాల్లో అమలుకు సన్నాహాలు



**హైదరాబాద్, డిసెంబర్ 23 :** వ్యవసాయశాఖ ద్వారా ప్రవేశపెట్టిన యూరియా యాప్ 5 జిల్లాలలో ప్రయోగాత్మకంగా రెండ్రోజుల నుండి పరిశీలించడం జరిగిందని, 5 జిల్లాలలో దాదాపు లక్ష మందికి పైగా డౌన్ లోడ్ చేసుకోవడం జరిగిందని మంత్రి తుమ్మలనాగేశ్వర రావు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో 897, జనగామ జిల్లాలో 5150, మహబూబ్ నగర్ 3741, నల్లగొండ 3618 మరియు పెద్దపల్లి జిల్లాలోని 6289 మొత్తం 19695 మంది రైతులు ఈ యాప్ ద్వారా యూరియాను తమ సమీప డీలర్ దగ్గర 60,510 యూరియా బస్తాలు బుక్ చేసుకోవడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా 217 మంది కౌలు రైతులు కూడా 678 యూరియా బస్తాలు ఈ యాప్ ద్వారా బుక్ చేసుకోవడం జరిగిందని, మొదటి రోజు అక్కడక్కడ తలెత్తిన సాంకేతిక సమస్యలను కూడా వెంటనే పరిష్కరించడం జరిగిందని తెలిపారు. రైతులు కూడా ఈ యాప్ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారని, వారికి వారి ఊరిలో ఏ డీలర్ దగ్గర ఎంత స్టాక్ ఉందో తెలుస్తుందని, తద్వారా వారు బుక్ చేసుకొని, వారికి నచ్చిన సమయంలో షాప్ వద్దకు వెళ్లి ఓటిపి చూపించి కొనుగోలు చేసారని తెలిపారు. ఈ రెండు రోజుల్లో యాప్ విజయవంతం కావడంతో, ఈ యాప్ ను మరికొన్ని రోజులు పరిశీలించి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడానికి సిద్ధం కావాల్సిందిగా అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు. ఈ రోజు రైతునేస్తం కార్యక్రమంలో కూడా రైతులకు యాప్ పై గల సందేహాలను నివృత్తి చేయడం జరిగిందని తెలిపారు. ఈ రబీ సీజన్ కు గాను రాష్ట్రానికి ఇప్పటికే 5.30 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావడం జరిగిందని, యూరియా వినియోగం అధికంగా ఉండే జనవరి, ఫిబ్రవరి నెలలకు గాను సరిపడ యూరియాను ముందస్తుగానే తెప్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

# ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్

## వరదలు, పారిశ్రామిక ప్రమాదాల నివారణపై దృష్టి

## సమన్వయంతో ముందుకు సాగిన వివిధ శాఖలు





**హైదరాబాద్, డిసెంబర్ 23 :** ప్రభుత్వం, జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ సహకారంతో, వరదలు, పారిశ్రామిక ప్రమాదాల ప్రతిస్పందన అంశాలపై 22 డిసెంబర్ న తొలిసారిగా రాష్ట్ర స్థాయి మాక్ ఎక్సర్‌సైజ్‌ను నిర్వహించింది. ఇటీవలి సంవత్సరాల్లో తెలంగాణ రాష్ట్రంలో అనూహ్యమైన ,వివరణలేని వాతావరణ మార్పులు చోటుచేసుకుంటూ, రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో అకస్మాత్తుగా భారీ వర్షాలు ,ఆకస్మిక వరదలు సంభవిస్తున్నాయి. అదేవిధంగా, ఇటీవల కాలంలో రాష్ట్రం కొన్ని ప్రధాన పారిశ్రామిక ప్రమాదాలకు కూడా సాక్ష్యంగా నిలిచింది. వరదలకు గురయ్యే ప్రాంతాల ఆధారంగా ఈ మాక్ ఎక్సర్‌సైజ్‌ను 12 జిల్లాల్లో ఖమ్మం, వరంగల్, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, హైదరాబాద్, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, నిర్మల్, జయశంకర్ భూపాలపల్లి మరియు హనుమకొండలో నిర్వహించారు. ప్రధాన పారిశ్రామిక ప్రాంతాల ఆధారంగా ఈ మాక్ ఎక్సర్‌సైజ్‌ను 5 జిల్లాల్లో సంగారెడ్డి, మెడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, నల్గొండ అలాగే హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో నిర్వహించారు. మాక్ ఎక్సర్‌సైజ్‌ల ప్రధాన లక్ష్యాలు రాష్ట్రం, జిల్లాలు మరియు వివిధ శాఖల సన్నద్ధతను పరీక్షించి మరింత బలోపేతం చేయడం, ఇన్సిడెంట్ రెస్పాన్స్ సిస్టమ్స్‌ను కార్యరూపంలోకి తేవడం, శాఖల మధ్య సమన్వయం మరియు అత్యవసర మద్దతు విధుల ప్రభావాన్ని అంచనా వేయడం, అలాగే జిల్లా కలెక్టర్లు, ఇతర ఏజెన్సీల పాత్రలపై స్పష్టత కల్పించడం జరిగింది. మాక్ ఎక్సర్‌సైజ్‌లు వరద ప్రమాద హెచ్చరిక సంకేతాలు అత్యవసర విధానాలపై మెరుగైన అవగాహనను కల్పించాయి. ముందస్తు హెచ్చరిక,సమాచార వ్యవస్థల ప్రభావాన్ని పరీక్షించి లోపాలను గుర్తించారు. శాఖలు,స్పందన బృందాల పాత్రలు, బాధ్యతలు మరింత స్పష్టంగా అవగాహనకు వచ్చి సమన్వయం మెరుగుపడింది. సకాలంలో ప్రజలను తరలించడం, సురక్షిత తరలింపు మార్గాలు, ఆశ్రయాలను గుర్తించడం ఎంత ముఖ్యమో ఈ వ్యాయామాలు హైలైట్ చేశాయి. అత్యవసర స్పందన బృందాలు, పరికరాలు, రక్షణ వనరుల సన్నద్ధతను అంచనా వేశారు. శాఖల మధ్య మెరుగైన సమన్వయం అవసరమని, వరదల సమయంలో ప్రజల అవగాహన మరియు సహకారం ఎంత ముఖ్యమో స్పష్టం అయింది. మానవ వనరులు, పరికరాలు మరియు లాజిస్టిక్స్‌లో ఉన్న లోపాలను గుర్తించి, మెరుగుదల ప్రణాళికలకు దోహదపడింది. సన్నద్ధత కొనసాగించడానికి క్రమం తప్పని శిక్షణలు మరియు మాక్ డ్రిల్లుల అవసరాన్ని పునరుద్ఘాటించింది. వాస్తవ వరద పరిస్థితులను ఎదుర్కొనేందుకు స్పందన బృందాలు మరియు సంబంధిత వర్గాల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. పారిశ్రామిక ప్రమాదాల మాక్ ఎక్సర్‌సైజ్‌ల నుంచి కూడా అనేక పాఠాలు నేర్చుకున్నారు. ముఖ్యంగా అగ్నిప్రమాదాలు మరియు రసాయన ఘటనల సమయంలో సమీప పరిశ్రమల మధ్య పరస్పర సహాయం అవసరం, మానవ వనరులు, పరికరాలు మరియు నైపుణ్యాలను పంచుకోవడం ద్వారా స్పందన సమయాన్ని, నష్టాలను తగ్గించవచ్చని గుర్తించారు. అగ్నిమాపక శాఖ, పోలీస్ మరియు వైద్య సేవల వంటి బాహ్య ఏజెన్సీలతో మెరుగైన సమన్వయం అవసరమని హైలైట్ చేశారు. శిక్షణ, మానవ వనరులు మరియు అత్యవసర వనరుల్లో ఉన్న లోపాలను గుర్తించారు. మాక్ ఎక్సర్‌సైజ్‌లు తెలంగాణ అగ్నిమాపక, విపత్తు స్పందన, అత్యవసర మరియు పౌర రక్షణ శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మన్ పర్యవేక్షణలో, లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ సుధీర్ బహల్ మార్గదర్శకత్వంలో, వివిధ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ శాఖలు, జిల్లా కలెక్టర్లు, అన్ని లైన్ డిపార్ట్‌మెంట్లు, వాలంటీర్లు ,ఇతర ఏజెన్సీలు పాల్గొన్నాయి.

# కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీలో విషాదం

## సర్పంచ్ కారు కిందపడి బాలిక మృతి

## ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన

**వికారాబాద్, డిసెంబర్ 23:** వికారాబాద్ జిల్లాలో కాంగ్రెస్ సర్పంచ్ విజయోత్సవ ర్యాలీలో విషాదం నెలకొంది. పోదూరు మండలం రాకంచర్ల గ్రామంలో కాంగ్రెస్ సర్పంచ్ కమ్లిబాయ్ నిర్వహించిన ర్యాలీలో ఏడేళ్ల చిన్నారిపై నుంచి కారు వెళ్లింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలిక దుర్మరణం చెందింది. వివరాల్లోకి వెళ్తే.. సర్పంచ్‌ల ప్రమాణస్వీకరం సోమవారం పూర్తి కావడంతో రాకంచర్ల గ్రామంలో కాంగ్రెస్ సర్పంచ్ కమ్లిబాయ్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పర్మిషన్ లేకున్నా డీజేతో ర్యాలీ ఏర్పాటు చేశారు. ఆ ర్యాలీని చూస్తున్న సమయంలోనే ఏడేళ్ల చిన్నారి కుర్వా సౌజన్యపై నుంచి సర్పంచ్ కారు వెళ్లింది. కారు చక్రాల కింద నలిగి తీవ్ర గాయాలు కావడంతో బాలికను హుటాహుటిన పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కానీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. బాలిక మృతితో గ్రామంలో తీవ్ర ఉద్రిక్త నెలకొంది. ర్యాలీలో సర్పంచ్ కారు కింద పడటంతోనే తన కూతురు మరణించిందని బాలిక తండ్రి, గ్రామస్తులు ఆరోపించారు. కానీ బాలిక కారు కింద పడలేదని సర్పంచ్ భర్త పెంటయ్య వాదించారు. దీంతో ఆస్పత్రి ముందు బాధిత కుటుంబసభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అక్కడకు వచ్చిన పోలీసులు ఇరువర్గాలను సముదాయించి పంపించేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.





# ఫోన్ ట్యాపింగ్ కేసులో బిగ్ ట్విస్ట్

## కేసీఆర్, హరీష్ రావు సైతం నోటీసులు?

**హైదరాబాద్, డిసెంబర్23:** తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రి హరీష్‌రావుకు నోటీసులు ఇవ్వాలని సిట్ నిర్ణయించింది. ఫోన్ ట్యాపింగ్ ఎవరి కోసం చేశారన్న విషయంపై సిట్ కూపీ లాగుతోంది. కేసు దర్యాప్తులో వేగాన్ని పెంచింది. ఇప్పటికే రివ్యూ కమిటీలోని వారిని సిట్ విచారించింది. ఈ ట్యాపింగ్ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన ప్రభాకర్ రావు ఎస్ఐబీ చీఫ్‌గా ఉన్న సమయంలో రివ్యూ కమిటీలో ఉన్న జీఏడీ సెక్రటరీ, సీఎస్‌లు, ఇంటెలిజెన్స్ చీఫ్‌ను సిట్ మరోసారి విచారణకు పిలిచింది. కాగా, రాజకీయ నేతలపైన సిట్ ఫోకస్ పెట్టింది. అందులో భాగంగా మాజీ సీఎం కేసీఆర్.. హరీష్ రావుకు సిట్ నోటీసులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ కేసు విచారణ చేస్తున్న సిట్ ఇప్పటికే మాజీ సీఎస్.. ఇంటలిజెన్స్ చీఫ్‌ల నుంచి స్టేట్‌మెంట్లను రికార్డు చేసింది. ఈ కేసులో కీలకంగా ఉన్న ప్రభాకర్ రావు విచారణ సమయంలో అనేక అంశాలను రాబట్టింది. ప్రభాకర్ రావు పదే పదే మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి, మాజీ ఇంటలిజెన్స్ అధికారి అనిల్ కుమార్ పేర్లను ప్రస్తావన చేసినట్లు తెలుస్తోంది.

## అసెంబ్లీ సమావేశాల అనంతరం కీలక పరిణామాలు?

ఒకవేళ, మాజీ సీఎం కేసీఆర్‌కు సిట్ నోటీసులిస్తే.. రాష్ట్రం రాజకీయం మరింతగా వేడెక్కనుంది. ఈ నెల 29వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగనుండటంతో ఆ తరువాత ఆయనకు నోటీసులు ఇచ్చే ఛాన్స్ ఉంది. ఇప్పటికే సిట్ ఈ కేసులో ముగ్గురు మాజీ ఐఏఎస్‌లతో పాటు మాజీ ఐపీఎస్ అధికారులను సిట్ సాక్షులుగా విచారించింది. మాజీ సీఎస్‌లు సోమేష్ కుమార్, శాంతి కుమారిలను విచారించింది. అలాగే సాధారణ పరిపాలన శాఖ మాజీ పొలిటికల్ సెక్రటరీ రఘునందన్ రావుతో పాటు మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ నవీన్ చంద్‌ను కూడా విచారించింది. ఎస్ఐబీ ఓఎస్డీగా ప్రభాకర్ రావును నియమించడంపైనా సిట్ ప్రశ్నల వర్షం కురిపిందింది. కాగా, గత ప్రభుత్వంలో ఈ ముగ్గురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కీలకంగా వ్యవహరించారు. కాగా, ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో ప్రత్యర్థి రాజకీయ నాయకులతో పాటు వ్యాపారవేత్తలు, మీడియా ప్రతినిధుల ఫోన్లను సైతం ప్రభాకర్ రావు ట్యాప్ చేసినట్లు తమ దర్యాప్తులో సిట్ గుర్తించింది. ప్రభాకర్ రావు ఇచ్చిన నెంబర్లను యథావిధిగా హోం శాఖకు ఈ మాజీ ఐపీఎస్ అధికారులు పంపినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనుబంధ చార్జిషీట్ ఫైల్ చేసేందుకు సిట్ ప్రయత్నాలు చేపట్టింది. మరోవైపు, ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో చార్జిషీట్ దాఖలు చేయాలని ఇప్పటికే ఉన్నతాధికారులను సిట్ చీఫ్, హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ ఆదేశించారు.



# ముందుకు వెళ్తున్నాం!

మొదటి పేజీ తరువాయి

కాంట్రాక్ట్ ఉద్యోగులకు సంబంధించి పూర్తి వివరాలు జనవరి 26వ తేదీలోగా సీఎస్‌కు అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అందాల్సిన జీతాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం అందుతున్నాయో లేదో సంబంధిత శాఖల హోచ్‌వోడీలు వెరిఫై చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. పక్రియను జనవరి 26వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండకూడదని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. జనవరి 26వ తేదీలోపు అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను వెంటనే ఖాళీ చేసి ప్రభుత్వ భవనాల్లోకి మారాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. '

# 22మంది మావోల లొంగుబాటు



**భద్రాచలం, డిసెంబర్23:** ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతం (ఏఓబీ)లో మావోయిస్టు పార్టీకి మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లాలో 22 మంది మావోయిస్టులు ఒడిశా డీజీపీ ఎదుట లొంగిపోయారు. వరుస ఆపరేషన్లు, భద్రతా బలగాల ఒత్తిడి నేపథ్యంలో ఈ లొంగుబాటుకు ప్రాధాన్యత సంతరించుకుంది. లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్ కమిటీ సభ్యులు, ఆరుగురు ఏరియా కమిటీ సభ్యులు సహా మొత్తం 15 మంది కీలక మావోయిస్టు సభ్యులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరితో పాటు ఆయుధాలు, పేలుడు సామగ్రిని కూడా పోలీసులకు అప్పగించారు. ఇందులో ఒక ఏకే-47 రైఫిల్, రెండు ఇన్సాస్ రైఫిళ్లు, ఒక ఎస్ఎల్ఆర్ రైఫిల్, మూడు 303 రైఫిళ్లు, రెండు సింగిల్ షాట్ రైఫిళ్లు, అలాగే 14 ల్యాండ్‌మైన్‌లు ఉన్నాయి. పోలీసుల సమాచారం ప్రకారం.. లొంగిపోయిన ఈ 22 మంది మావోయిస్టులపై మొత్తం రూ.2 కోట్ల 18 లక్షల 25 వేల రివార్డు ఉంది. ఈ లొంగుబాటుతో ఏఓబీ ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలకు భారీగా దెబ్బ తగిలిందని అధికారులు పేర్కొన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా మార్చి 2026 నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని ప్రకటించిన నేపథ్యంలో.. భద్రతా బలగాలు ఆపరేషన్ కగార్, ఆపరేషన్ కర్రెగుట్ట వంటి ప్రత్యేక దాడులను ముమ్మరం చేశాయి. ఈ ఆపరేషన్లలో పలువురు మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో హతమవుతుండగా, మరికొందరు పోలీసుల ఎదుట లొంగిపోతున్నారు.



సంపాదకీయం

# పేదరిక నిర్మూలనపై దొంగ లెక్కలు!

భారతదేశంలో పేదరిక నిర్మూలన అన్నది కేవలం కాగితాలకే పరిమితం అవుతోంది. పేదలు ఉంటేనే రాజకీయ నాయకుల మనుగడ సాధ్యం అవుతుంది. పేల పేరుతో దుబారా చేయడం సులువవుతుంది. అనేక పథకాలను ప్రకటిచడం, డబ్బులను దుబారా చేయడం, ఓట్లను దండుకోవడం అన్న ప్రక్రియ నిరంతరంగా సాగాలి. అందుకే పేదల పేరుతో నిత్యం ఏదో ఓ కార్యక్రమం సాగుతూనే ఉంటుంది. ఇటీవల ఉపాధి హామీ పథకం పేరు మారింది. దీంతో అన్నిపార్టీలు గగ్గోలు పెడుతున్నాయి. మహాత్మాగాంధీ పేరు తొలగిండంపై ఆందోళనలకు దిగాయి. లెఫ్ట్ పార్టీలు కూడా ఇందులో పాలుపంచుకోవడం దారుణం. పేరులో ఏముందున్న జ్ఞానం లేకుండా గగ్గోలు పెడుతున్నారు. ఉపాధిహామీతో అసలు కూలీలకు కరువు వచ్చింది. ప్రభుత్వ ధనం వృథా అవుతోంది. వ్యవసాయ పనులు జరగడం లేదన్నది ప్రధాన ఆరోపణ. అయితే ఈ పథకం కింద గ్రామస్థాయిలో నిర్మాణాత్మక పనులేవీ ఇప్పటి వరకు జరగలేదు. కేవలం మట్టి ఎత్తిపోయడం తప్ప. దీనికోసం వేలకోట్లు తగలేశారు. ఇకపోతే కోట్లాదిమందిని పేదరికం నుంచి బయటపడేశామని, కోట్ల మందికి ఇళ్లు కట్టించామని కేంద్రం చెబుతోంది. ఇంత జరిగితే పేదరికం లేకుండా పోవాలి. అలాంటప్పుడు ఉచిత బియ్యం, ఉచిత ఇల్లు, ఉచిత కరెంట్, ఉచిత గ్యాస్ వంటి పథకాలు అవసరం లేదు. ఓ వైపు పేదరిక నిర్మాలన జరిగిందని చెబుతూనే.. మరోవైపు పేదల పేరుతో పథకాల దందా సాగుతోంది. ఇది పాలకుల ద్వంద్వ విధానాలకు నిదర్శనం. పేదలు ఉంటేనే ఓట్లు రాలుతాయని వారికి తెలుసు. భారత్‌లో పేదలు జనాభాలో 5.25 శాతం మాత్రమే ఉన్నారంటూ ప్రపంచబ్యాంక్ ప్రకటించింది. తలసరి రోజు ఖర్చు రూ.62గా నిర్ధారించి అంతకన్నా తక్కువ ఆదాయం వస్తున్నవారు 5.25 శాతం మాత్రమే ఉన్నారని ప్రకటించింది. ఇక నీతి ఆయోగ్ 2022-23 నాటికి దేశంలో 5 శాతం మాత్రమే నిరుపేదలు ఉన్నట్టు ప్రకటించింది. గ్రామాల్లో రూ.57, పట్టణాల్లో రూ.69 చొప్పున రోజుకు తలసరి ఆదాయం గనుక వస్తే వారంతా నిరుపేదలు కానట్టే లెక్కించింది. పేదరిక స్థాయి నిర్ధారించేట ప్పుడు ఆ సొమ్ముతో రోజువారీ ఆహారపు అవసరాలతోబాటు వైద్యానికి, దుస్తులు వగైరాలకు, రవాణాకు, అద్దెకు కూడా చెల్లించగలిగేలా ఉండాలి. ఇప్పుడు నిర్ణయించిన స్థాయిలో బతకాలంటే వాళ్ళు ఇల్లూ వాకిలీ లేని బిచ్చగాళ్ళుగా మాత్రమే మిగులుతారు. ఈ లెక్కన చూస్తే మరో ఏడాది నాటికి ఇండియాలో నిరుపేదలు అనేవారే లేరంటూ ప్రభుత్వం ప్రకటించవచ్చు. పెరుగుతున్న విద్య, వైద్యపు ఖర్చులతో కోట్లాదిమంది అదనంగా పేదరికంలోకి అనునిత్యమూ దిగజారిపోతూ వుంటే, కనీస పౌష్టికాహార లోపం వారిని జీవచ్ఛవాలుగా చేస్తూ వుంటే, మరోపక్క ప్రపంచబ్యాంక్ తన తప్పుడు లెక్కలతో నిరుపేదలు తగ్గిపోయారంటూ ప్రకటిస్తూ వారిని అవహేళన చేస్తూనే వుంది. ఎందుకంటే ఇంత తక్కువ స్థాయిలో బతకలేక ఆ నిరుపేదలంతా అప్పటికి చచ్చిఫూరుకుంటారు. కనీస పౌష్టికాహార స్థాయిని బట్టి పేదరికపు స్థాయిని గనుక నిర్ణయిస్తే అది ప్రభుత్వం నిర్ణయించినదానికి మూడు రెట్లయినా ఉంటుంది. ఆ స్థాయికి దిగువన ఇప్పుడు 65 శాతం ప్రజలు పడిపోయారు. కుటుంబాలను గుర్తించేందుకు గ్రామాల వారీగా లెక్కలు తీయాలిచ ప్రపంచబ్యాంక్ మాత్రం ఇటువంటిదేమీ చేయడం లేదు. నిరుపేదరికపు స్థాయిని అమెరికన్ డాలర్లలో రోజుకు 3 డాలర్లుగా నిర్ధారించింది. ఆ ప్రకారం చూస్తే ఇప్పుడు డాలరు-రూపాయి మారకపు విలువ ప్రకారం పేదరికపు స్థాయి రూ.270గా ఉండాలి. కాని వాస్తవ మారకపు రేటు ప్రకారం కాకుండా అందులో 0.28 శాతం రేటు ప్రకారం మాత్రమే లెక్కిస్తోంది! ఇక్కడి అధికారిక పేదరిక స్థాయికి దగ్గరగా ఉండేట్టు వాస్తవ మారకపు రేటును సవరిస్తోంది! ఇలా వివిధ దేశాల్లో అధికారిక లెక్కల్లో పేదరికపు స్థాయిని హీనమైన స్థాయికి దిగజార్చు తున్నారు. ఆ స్థాయిలో ప్రాణాలను నిలబెట్టుకోవడమే అసాధ్యం అన్న వాస్తవాన్ని తెలిసి కూడా లెక్కల కోసం ఇలా చేస్తున్నారని అనుకోవాల్సిందే. చాలా దశాబ్దాలుగా ప్రభుత్వాలు పేదరికపు స్థాయిని లెక్కించే విధానాన్ని అసమగ్రంగా చేపడుతున్నాయి. ఇది ప్రపంచబ్యాంక్ ఆదేశాల మేరకే జరుగుతోందన్నది స్పష్టం. మొట్టమొదట లెక్కించిన కనీస పేదరిక స్థాయి మాత్రమే సరైన పద్ధతిలో సాగింది. తరవాత ధరల సూచీ ఆధారంగా సవరిస్తూ వచ్చారు. అలా సవరించిన తర్వాత ఆ సొమ్ముతో పౌరుడు లేదా ఓ కుటుంబం కనీస పౌష్టికాహారం పొందగలుగుతున్నారా లేదా అన్నది మాత్రం ఎక్కడా పరిశీలించిన పాపాన పోలేదు. పేరికాన్ని లెక్కించే విషయంలో దేశంలో చదువుకున్న వారికీ ఈ ప్రభుత్వం, ప్రపంబ్యాంక్ అనుసరిస్తున్న పద్ధతి ఎంత అర్ధరహితమో తెలియదు గనుకనే ప్రభుత్వపు ఆటలు సాగుతున్నాయి. ఇలా ప్రతీసారీ అధికారిక లెక్కలు పేదరిక స్థాయిని అంతకంతకూ తగ్గిస్తూనే వస్తున్నాయి. అది కాస్తా ఇప్పుడు అసందర్భమైన, అర్థం లేని స్థాయికి చేరింది. ప్రభుత్వం నిర్ణయించిన పేదరిక స్థాయి కనీసం ప్రాణాలనైనా నిలబెట్టుకోడానికి కూడా పనికిరాదు. అందుచేత మా దేశంలో నిరుపేదలే లేరు అని చెప్పుకోవడం దౌర్భాగ్యం తప్ప మరోటి కాదు. నిజానికి కాలానుగుణంగా కనీస అవసరాలు మారుతూ వుంటాయి. ఆ మార్పును పరిగణనలోకి తీసుకోవాలి. కాని అలా తీసుకోకపోయినప్పటికీ, పాత స్థాయిలోనే అవసరాలు కొనసాగుతున్నాయని అనుకున్నప్పటికీ, వాటిలో వచ్చిన మార్పులనైనా పరిగణనలోకి తీసుకోవాలి. 50 సంవత్సరాల క్రితం విద్య, వైద్యం ప్రభుత్వ వ్యవస్థ ద్వారా అందుతూవుండేవి. అప్పుడు వాటి కోసం చేయవలసిన ఖర్చు నామ మాత్రంగా ఉండేది. ఇప్పుడు ఆ సేవలు ప్రైవేటుపరం అయ్యాయి. వాటి ధరలు శరవేగంగా పెరిగిపోతూ వున్నాయి. ఇటు వైద్యానికి, చదువుకు, అటు ఆహారానికి ఖర్చు సర్దుబాటు చేయడం చాలా కుటుంబాలకు అసాధ్యం అయిపోతోంది. దీని వలన ఎక్కువమంది పేదల పౌష్టికాహార స్థాయి పడిపోతోంది. అంతేగాక, ఇంతవరకూ పేదలుగా పరిగణించబడనివారు కూడా ఇప్పుడు పేదరిక స్థాయికి దిగువకు జారిపోతున్నారు. జాతీయ శాంపిల్ సర్వే గణాంకాల ప్రకారం ఇండియాలో గ్రామాల్లోను, పట్టణాల్లోను తలసరి పౌష్టికాహార లభ్యత చాలా వేగంగా పడిపోయింది. ఇది గమనించకుండా పేదరికం నుంచి విముక్తి పొందారని, పేదరికం తగ్గిందని లెక్కలు వేసుకోవడం ఆత్మహత్యా సదృశ్యం కాగలదు.

# బంగ్లాదేశ్‌లో అల్లర్లు.. హిందువుల ఊచకోత

- బంగ్లా హైకమిషన్ ముందు వీహెచ్‌పీ ఆందోళన



**న్యూఢిల్లీ, డిసెంబర్ 23:** బంగాలో అల్లర్లు, హిందువలుపై ఊచకోతలకు నిరసనగా వీహెచ్‌పీ ఆందోళనకు దిగింది. దేశ రాజధాని ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ వద్ద మంగళవారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. బంగ్లాలో హిందువులపై దాడులను ఖండిస్తూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కార్యకర్తలు పెద్దఎత్తున బంగ్లా హైకమిషన్ కార్యాలయానికి చేరుకున్నారు. దీంతో ముందుజాగ్రత్త చర్యగా ఢిల్లీ పోలీసులు హైకమిషన్ కార్యాలయం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రదర్శకులు బారికేడ్లను నెట్టుకుని లోపలకు దూసుకెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఢాకాలో జరిగిన ఘటనను నిరసిస్తూ ప్రదర్శకులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. వీహెచ్‌పీతో పాటు పలు హిందూ సంస్థలు ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నాయి. బంగ్లాదేశ్‌లోని మయమన్ సింగ్ జిల్లాలో గత వారం దీపు చంద్ర దాస్ అనే 25 ఏళ్ల హిందూ యువకుడిని దుండగులు గతవారంలో దారుణంగా కొట్టిచంపారు. చెట్టుకు వేలాడదీసి ఉరితీశారు. అనంతరం మృతదేహాన్ని రోడ్డుపై పడేసి నిప్పుపెట్టారు. ఈ ఘటనపై భారత్‌లో తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచ దేశాలు సైతం ఈ ఘటనను తీవ్రంగా ఖండించాయి. దీపు చంద్రదాస్ దారుణ హత్యతో ప్రమేయమున్న 12 మందిని బంగ్లా పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. బంగ్లాదేశ్‌లో గత ఏడాది షేక్ హసీనా ప్రభుత్వం గద్దెదిగడానికి దారితీసిన విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహించిన షరీఫ్ ఒస్మాన్ హాదీపై గుర్తుతెలియని వ్యక్తులు ఇటీవల కాల్పులు జరపడం, సింగపూర్‌లో చికిత్స పొందుతూ అతను కన్నుమూయడంతో దేశ వ్యాప్తంగా హింసాకాండ చెలరేగింది. దీనికి కొనసాగింపుగా నేషనల్ సిటిజన్ పార్టీ యువనేత మొతలేబ్ సిక్దార్‌పై సోమవారంనాడు గుర్తుతెలియని సాయుధుడు కాల్పులు జరిపాడు. ఆ కాల్పుల్లో అతని తల ఎడమ వైపు తూటా దూసుకెళ్లింది. ప్రస్తుతం ఆసుపత్రిలో సిక్దార్ చికిత్స పొందుతున్నాడు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 12న బంగ్లాదేశ్‌లో పార్లమెంట్ ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి.

# శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం




**తిరుమల, డిసెంబర్ 23:** తిరుమల శ్రీవారి ఆలయంలో 30 తేదీన వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను పవిత్రమైన పరిమళ జలాన్ని ప్రోక్షణ చేసి, నీటితో శుభ్రం చేశారు. ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల ఈవో అనిల్ కుమార్ సింఘాల్ మీడియాతో మాట్లాడుతూ, సాధారణంగా ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సందర్భంగా వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి టీటీడీ చేసిన ఏర్పాట్ల గురించి ఈవో మాట్లాడుతూ డిసెంబర్ 30 నుండి జనవరి 8వ తేది నిర్వహించనున్న వైకుంఠ ద్వార దర్శనాల కోసం పగడ్బంది ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రెండు నెలలుగా అధికార యంత్రాంగం తనిఖీలు నిర్వహించి ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, భద్రతా ఏర్పాట్లు, అన్న ప్రసాదాలు, వసతి, క్యూ లైన్ల నిర్వహణ, పార్కింగ్ సౌకర్యాలపై ప్రణాళికలు సిద్ధం చేశారని చెప్పారు. చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం మేరకు వైకుంఠ ఏకాదశిపై ప్రత్యేక బోర్డు సమావేశం నిర్వహించి సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ పలు కీలక నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. డిసెంబర్ 30న వైకుంఠ ఏకాదశి, 31న వైకుంఠ ద్వాదశి, జనవరి 1వ తేదీలకు సామాన్య భక్తులకు ఈ-డిప్ విధానం ద్వారా దర్శన టోకెన్లు కేటాయించామన్నారు. భక్తులందరికీ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఐదు రోజుల పాటు ఈ-డిప్ రిజిస్ట్రేషన్ కు అవకాశం కల్పించామన్నారు. దాదాపు 24 లక్షల మంది భక్తులు ఈ-డిప్ కు రిజిస్ట్రేన్ చేసుకోగా మొదటి మూడు రోజులకు 1.89 లక్షల భక్తులను ఈ-డిన్ ద్వారా ఎంపిక చేసి టోకెన్లు కేటాయించామని తెలిపారు. ఈ మూడు రోజులకు టోకెన్లు పొందిన భక్తులకు నిర్దేశిత తేది, సమయాన్ని కేటాయించడం జరిగిందని, ఆ సమయం ప్రకారమే భక్తులు దర్శనానికి వస్తే ఎలాంటి ఇబ్బంది కలగకుండా రెండు గంటల్లోనే దర్శనభాగ్యం కలుగుతుందని అన్నారు. ఈ-డిప్ ద్వారా టోకెన్ పొందలేని భక్తులు జనవరి 2 నుండి 8వ తేది వరకు సర్వ దర్శనం క్యూ లైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. మొదటి మూడు రోజులు మాత్రమే ఈ-డిప్ విధానంలో టోకెన్లు కేటాయించామని, చివరి ఏడు రోజులు భక్తులు నేరుగా తిరుమలకు వచ్చి సర్వ దర్శనం క్యూలైన్ల ద్వారా వైకుంఠ ద్వార దర్శనాలు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. అదేవిధంగా జనవరి 2 నుండి 8వ తేది వరకు రోజుకు 15 వేల రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను, 1500 శ్రీవాణి దర్శన టికెట్లను ఆన్ లైన్ లో విడుదల చేశామని చెప్పారు. తిరుపతి, తిరుమల స్థానికులకు స్థానికుల కోటా కింద జనవరి 6,7,8 తేదీల్లో రోజుకు 5వేల టోకెన్లు జారీ చేయనున్నట్లు తెలియజేశారు. వైకుంఠ ద్వార దర్శనాలకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే కారణంగా చంటి పిల్లల తల్లిదండ్రులు, వృద్ధులు, దివ్యాంగులు, ఎన్ఆర్ఐ, డిఫెన్స్ వంటి ప్రత్యేక దర్శనాలను రద్దు చేశామని చెప్పారు. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్న ప్రసాదాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. భద్రతకు సంబంధించి 3500 మంది పోలీసులు, 1150 మంది టీటీడీ విజిలెన్స్ సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పరిస్థితిని పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకుని భక్తులు వేచి ఉండే సమయాన్ని తగ్గించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడతామన్నారు. భక్తులందరూ టీటీడీ సూచనలు పాటిస్తూ సంయమనంతో స్వామివారిని దర్శించుకుని స్వామివారి కృపా కటాక్షాలకు పాత్రులవ్వాలని ఈవో తెలియజేశారు.

# అక్రమవసలదారులకు ట్రంప్ గాలం

**స్వచ్ఛందంగా అమెరికా వీడే వారికి 3వేల డాలర్ల తోఫా**

**విమాన ప్రయాణం కూడా ఉచితమే**



**వాషింగ్టన్, డిసెంబర్ 23:** అక్రమ వలసదారులను దేశం నుంచి పంపించేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్న ట్రంప్ యంత్రాంగం.. వారికి గతంలో ప్రకటించిన ఓ ఆఫర్‌ను భారీగా పెంచింది. అమెరికా వీడేందుకు అంగీకరించిన వారికి ఇస్తామన్న స్టైఫండ్‌ను మూడు వేల డాలర్లకు పెంచినట్లు పేర్కొంది. స్వదేశానికి వెళ్లిపోయేందుకు ఉచితంగా విమాన ప్రయాణ సదుపాయానికి ఇది అదనమని తెలిపింది. ఈ హాలీడే ఆఫర్ ఈ ఏడాది చివరి వరకు మాత్రమేనని సోషల్ మీడియాలో ఓ ప్రకటన చేసింది. డీహెచ్ఎస్ ప్రకారం ఈ ఏడాది జనవరి నుంచి 19లక్షల మంది అక్రమ వలసదారులు స్వచ్ఛందంగా దేశాన్ని వీడిపోయారని సమాచారం. వీరిలో కొన్ని వేల మంది సీబీపీ హోమ్ యాప్‌ను వినియోగించుకున్నట్లు తెలిసింది. ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టిన తొలి ఆరు నెలల్లోనే 1.5లక్షల మందిని బహిష్కరించగా.. దాదాపు 13వేల మంది స్వచ్ఛందంగా వెళ్లిపోయినట్లు తెలిసింది. అయితే, ఈ గణాంకాలకు సంబంధించి అధికారిక సమాచారం వెలువడలేదు. అక్రమ వలసదారులపై కొరడా ఝుళిపిస్తున్న ట్రంప్ యంత్రాంగం.. వందలాది మందిని అరెస్టు చేస్తోంది. అనంతరం వారిని నిర్బంధ కేంద్రాలకు తరలిస్తోంది. ఈ క్రమంలో స్వచ్ఛందంగా అమెరికా వీడాలనుకునే వారికి ప్రోత్సాహకంగా వెయ్యి డాలర్లు ఇస్తామని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ఈ ఏడాది మేలో ప్రకటించింది. ఇందుకోసం కస్టమ్స్ అండ్ బార్డర్ ప్రొటెక్షన్ హోమ్ యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించింది. అటువంటి వారిని నిర్బంధించాల్సిన అవసరం లేకుండా చూస్తామని, బలవంతంగా స్వదేశానికి తరలించాల్సిన జాబితా నుంచి తొలగిస్తామని పేర్కొంది. అంతేకాదు వారిపై విధించిన జరిమానాలపైనా మినహాయింపు ఇస్తామని చెప్పింది. ప్రభుత్వం అందిస్తోన్న ఈ ప్రత్యేక ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోని అక్రమ వలసదారులకు అరెస్టు, బహిష్కరణ మాత్రమే మార్గమని డీహెచ్ఎస్ అధికారులు హెచ్చరిస్తున్నారు. అంతేకాదు అటువంటి వారికి అమెరికాకు మళ్లీ తిరిగి వచ్చే అవకాశమే ఉండదని స్పష్టం చేస్తున్నారు.

# రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి

**బీహార్ సీఎం నితీశ్‌కు థరూర్ ప్రశంసలు**



**న్యూఢిల్లీ, డిసెంబర్ 23 :** కేంద్రంలోని భాజపాపై ప్రశంసలు కురిపిస్తూ.. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత శశిథరూర్ నిత్యం వార్తల్లో నిలుస్తుంటారు. ఓ సారి మోడీని ప్రశంసిస్తూనే మరోమారు, ఉపాధి చట్టానికి గాంధ్య పేరు తొలగించడంపైనా విమర్శలు గుప్పించారు. తిరువనంతపురంలో బిజెపి గెలుపును స్వాగతించారు. తాజాగా బిహార్‌లోని ఎన్డీయే కూటమి పాలనను అభినందించారు. రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ఎక్కువగా దృష్టి పెట్టిందన్నారు. ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు థరూర్ బిహార్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇంతకుముందు తాను విన్న దానికంటే బిహార్‌లో మౌలిక సదుపాయాలు మెరుగ్గా ఉన్నాయన్నారు. రోడ్లు బాగున్నాయన్నారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా ప్రజలు వీధుల్లోకి వస్తున్నారని.. శాంతి, భద్రతలు మెరుగుపడ్డాయన్నారు. విద్యుత్, నీటి సదుపాయాలు కూడా సరిగ్గా ఉన్నాయని థరూర్ అన్నారు. ఇటీవల సంవత్సరాల్లో చాలా మంచి పనులు జరిగాయన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ గురించి ప్రశ్న అడగ్గా.. తనను ఇక్కడి రాజకీయాల్లోకి లాగొద్దని వ్యాఖ్యానించారు. ఇక్కడ జరిగిన అభివృద్ధి చూసి సంతోషంగా ఉందన్నారు. థరూర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఇక, కాంగ్రెస్ సీనియర్ నేత అయిన థరూర్.. ఇటీవల ప్రధాని మోదీని, అధికార భాజపాపై ప్రశంసలు కురిపిస్తూ పలుమార్లు వ్యాఖ్యలు చేశారు. దీనిపై సొంత పార్టీ నేతల నుంచి తీవ్ర విమర్శలు వెలువడ్డాయి.

## యువతలో నైపుణ్యం పెంచేలా

# క్వాంటమ్ కోర్సులు

మొదటి పేజీ తరువాయి

కలిసి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 1970లో చైనా ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చింది. 1991లో భారత్‌లో ఆ సంస్కరణలు వచ్చాయి. ఆ తర్వాత ఎక్కడా వెనక్కి తిరిగి చూడలేదు. వ్యవసాయ రంగంలో సంస్కరణలతో ఆర్థికాభివృద్ధికి ముందడుగు పడింది. హరిత విప్లవంతో దేశ స్థితిగతులు సమూలంగా మారాయి. ఆహార ధాన్యాల విషయంలో భారత్ స్వయం సమృద్ధి సాధించింది. సామాన్యుల సాధికారతే లక్ష్యంగా మోదీ ప్రభుత్వం సంస్కరణలు తీసుకొస్తోంది. విశాఖకు చాలా ఐటీ కంపెనీలు వస్తున్నాయి. భవిష్యత్తులో నాలెడ్జ్ ఎకానమీ, టెక్నాలజీకి ఆ నగరం చిరునామాగా మారబోతోంది. తిరుపతిలో స్పేస్ సిటీ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాం అని చంద్రబాబు వివరించారు. సక్సెస్ అయిన ఫార్ములానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మళ్లీ తెరపైకి తీసుకువచ్చారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఐటీని ప్రమోట్ చేస్తూ ఎలాంటి ప్రణాళికలు రచించారో... ఇప్పుడు క్వాంటం, ఏఐను ప్రమోట్ చేయడానికి అదే స్ట్రాటజీని అవలంభిస్తున్నారు. అంతర్జాతీయంగా మారుతున్న పరిణామాలు, జాతీయ స్థాయిలో తీసుకున్న పాలసీలను అందిపుచ్చుకునేలా ఏపీ యువతను ముఖ్యమంత్రి సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఐటీ కంపెనీలకు అవసరమైన నిపుణులను, ఉద్యోగులను అందించేందుకు పెద్ద ఎత్తున ఇంజనీరింగ్ కాలేజీలను చంద్రబాబు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు విభజిత ఏపీలో క్వాంటం, ఏఐ, డీప్ టెక్ కంపెనీలకు అవసరమైన నైపుణ్యం ఉన్న హ్యూమన్ రిసోర్సెస్‌ను బిల్డప్ చేస్తున్నారు. ఓవైపు క్వాంటం, ఏఐ, డీప్ టెక్ కంపెనీలను రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానిస్తూనే... మరోవైపు ఏఐ, క్వాంటం నిపుణులుగా యువతను సిద్ధం చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఏపీ నుంచి 50 వేల మంది ఏఐ, క్వాంటం నిపుణలను తీర్చిదిద్దేలా సీఎం ప్రణాళికలు రూపొందిస్తున్నారు. విశాఖను ఏఐ హబ్, అమరావతిని క్వాంటం వ్యాలీగా రూపొందించేందుకు కసరత్తు ముమ్మరం చేశారు. హైదరాబాద్ డెవలప్‌మెంట్ కోసం ఉమ్మడి రాష్ట్రంలో తాను అనుసరించిన పాలసీనే ఏపీ డెవలప్‌మెంట్ కోసం సీబీఎన్ మళ్లీ అమలు చేస్తున్న పరిస్థితి. రాష్ట్రంలోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఏఐ, క్వాంటం నిపుణులను అందించేలా ఏపీలో ఎకో సిస్టంను చంద్రబాబు తయారు చేస్తున్నారు. మరికొన్ని నెలల్లో ఏపీకి క్వాంటం కంప్యూటింగ్ మెషిన్ రానుంది. మరో ఎడెనిమిది నెలల్లో క్వాంటం వ్యాలీలో క్వాంటం టవర్లు సిద్ధం కానున్నాయి. ప్రణాళికల్లో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా టెక్ స్టూడెంట్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్ద ఎత్తున క్వాంటం టాక్ నిర్వహించారు. చంద్రబాబు నిర్వహించిన క్వాంటం టాక్ కార్యక్రమంలో టెక్ స్టూడెంట్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ అభిప్రాయాలను, ఆలోచనలను సీఎం చంద్రబాబుతో పంచుకున్నారు. క్వాంటం, ఏఐ రంగాలను ఏపీలో ఎలా అభివృద్ధి చేయాలనే అంశంపై విద్యార్థులకు సీఎం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న పాలసీలు, అభివృద్ధి కార్యక్రమాలను అందిపుచ్చుకునేలా విద్యార్థులు, యువత ఆలోచన చేయాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సూచించారు.



## నిర్దేశిత గడువులోగా ధాన్యం కొనుగోళ్లు

### ఏపీ వ్యాప్తంగా ఒకే తరహా బ్యాంక్ గ్యారెంటీలు

### అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు

వివిధ జిల్లాల్లో నిర్దేశిత గడువులోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్లతో మాట్లాడి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచనలు ఇచ్చారు. ఏపీ వ్యాప్తంగా ఒకే తరహా బ్యాంక్ గ్యారెంటీలు ఇచ్చేలా చూడాలని దిశానిర్దేశర చేశారు. ధాన్యం కొనుగోళ్లతో సహా వివిధ పంట ఉత్పత్తుల మార్కెటింగ్‌పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై అధికారులతో చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు సీఎం చంద్రబాబు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సు విధానం మేరకు తక్షణమే చర్యలు ఉండాలని నిర్దేశిరచారు. రైతుల దగ్గర ధాన్యం కొనుగోళ్లు చేసే మిల్లర్లు ఎక్కడా అక్రమాలకు పాల్పడకుండా చూడాలని అధికారులకు మార్గనిర్దేశర చేశారు. ఈ సమీక్షకు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఆయా శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. మరోవైపు.. ఐఐటీ మద్రాస్ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు సమావేశం అయ్యారు. యువతలో నైపుణ్యం పెంచేలా క్వాంటం టెక్నాలజీ కోర్సులు ఉండాలని దిశానిర్దేశర చేశారు. పాఠశాలల్లో దశలవారీగా కంప్యూటర్ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశానికి ఐఐటీ మద్రాస్, ఐఐటీ తిరుపతి, ఐబీఎం సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. వచ్చే ఏడాది నుంచి రెండేళ్ల పాటు నాలుగు విడతల్లో విద్యార్థులకు ఏఐపై అవగాహన కల్పించేలా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సూచించారు. 7,8,9 తరగతులు చదివే విద్యార్థులకు క్వాంటంపై అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 2026 జనవరి చివరిలో స్టూడెంట్స్ పార్టనర్ షిప్ సమ్మిట్ నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఆ సమ్మిట్‌లో విద్యార్థులు తమ ఇన్నోవేషన్స్ ప్రదర్శించేలా ఏర్పాట్లు చేద్దామని సీఎం చంద్రబాబు సూచించారు.

## గ్రామాలకు ఇక పల్లెవెలుగు ఎలక్ట్రిక్ బస్సులు

### ఆర్టీసి అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

**అమరావతి :** గ్రామాలకు వెళ్లే పల్లెవెలుగు బస్సులు కూడా ఎసితో కూడా ఇవి బస్సులను సిద్దం చేయాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. ఏపీఎస్ ఆర్టీసీలో ఇకపై కొత్తగా ప్రవేశపెట్టే ఎలక్ట్రిక్ బస్సులు 'ప్లలెవెలుగు'కు చెందినవైనా తప్పనిసరిగా ఏసీవే ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టదలచిన 1,450 బస్సులు కూడా ఈవీనే కొనుగోలు చేయాలని సూచించారు. గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని గోదావరి జిల్లాల్లో ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ముందుగా ఏర్పాటు చేయాలని, వీటికి సంబంధించి త్వరలోనే టెండర్లు పిలవాలని సూచించారు. ఏపీఎస్ ఆర్టీసీలో ప్రవేశపెట్టే ఈ బస్సుల రోడ్ మ్యాప్‌పై సచివాలయంలో అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.

## 2026 సంవత్సర క్యాలెండర్, డైరీ ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు నాయుడు



**అమరావతి :** ఏపీ అసెంబ్లీ సెక్రటేరియట్ రూపొందించిన 2026 సంవత్సర క్యాలెండర్, డైరీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం ఆవిష్కరించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు సమక్షంలో ఉండవల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో 2026 క్యాలెండర్, టేబుల్ క్యాలెండర్, డైరీలను సీఎం ఆవిష్కరించారు. జీవ వైవిద్యం – ఆంధ్రప్రదేశ్ సజీవ వారసత్వం అనే థీమ్‌తో క్యాలెండర్‌ను అసెంబ్లీ సెక్రటేరియట్ రూపొందించింది. ఏపీలోని ప్రకృతి సంపద, కళలు, సంప్రదాయాలు, ఆధునిక సాంకేతికతలకు అద్దం పట్టేలా కొత్త సంవత్సరం క్యాలెండర్‌ను రూపొందించారు. ఏపీలో ఉన్న వివిధ వన్యప్రాణుల గురించి అవగాహన కల్పించేలా నూతన సంవత్సర క్యాలెండర్ రూపకల్పన జరిగింది. సాంప్రదాయ కలంకారీ కళాశైలిలో క్యాలెండర్లోని చిత్రాలు వచ్చేలా శాసన సచివాలయం డిజైన్ చేయించింది. ఆంధ్రప్రదేశ్ జీవ వైవిధ్య వారసత్వాన్ని, సీఎం ఆలోచనలను చాటిచెప్పేలా 2026 క్యాలెండర్ ఆవిష్కృతమైంది. 2026 సంవత్సరానికి చెందిన క్యాలెండర్‌ను చక్కగా డిజైన్ చేశారని సీఎం చంద్రబాబు మెచ్చుకున్నారు. ప్రకృతిని కాపాడుకోవాలనే మంచి సందేశంతో క్యాలెండర్ ఉందని ప్రశంసించారు. క్యాలెండర్ ఆవిష్కరించిన ముఖ్యమంత్రికి స్పీకర్ అయ్యన్న పాత్రుడు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక, శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ రికార్డుల్లో ఖచ్చితంగా నమోదు చేసేలా చూడటం ఈ సర్వే లక్ష్యం. అర్హులైన అన్ని కుటుంబాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు, సేవలను సకాలంలో అందించడానికి ఈ సర్వే చేస్తోంది. అలాగే ఈ సర్వే ద్వారా ప్రజాసేవల పంపిణీ సామర్థ్యాన్ని మెరుగుపరచనుంది. డిసెంబర్ నెల చివరి వారం నుంచి ఏకీకృత కుటుంబ సర్వే ప్రారంభం కానుంది. గ్రామీణ ప్రాంతాల్లోని గ్రామ సచివాలయాలు, పట్టణ ప్రాంతాల్లోని వార్డు సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఈ సర్వే చేయనున్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబ ప్రస్తుత పరిస్థితిని ధ్రువీకరించడానికి, నవీకరించడానికి ప్రభుత్వ సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ సంక్షేమ పథకాల నుంచి అర్హత కలిగిన ఏ కుటుంబం లేదా వ్యక్తి తప్పించుకోకుండా చూడటమే ఈ సర్వే ముఖ్య లక్ష్యం. ఖచ్చితమైన నూతనంగా తీసుకున్న కుటుంబ రికార్డులు ప్రభుత్వ ధ్రువపత్రాలు, ఆమోదాలను జారీ చేయడానికి సమయం ఆదా అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ సర్వే ద్వారా వచ్చిన సమాచారం ఆధారంగా అన్ని విభాగాల్లో అనవసరంగా ఉన్న వాటిని ధ్రువీకరించాల్సిన అవసరం ఉండదు. ప్రభుత్వ సమాచా రం ఖచ్చితత్వం, పరిపూర్ణతను మెరుగుపరచడం ఈ సర్వే ముఖ్య ఉద్దేశ్యం. కుటుంబ వివరాలను నేరుగా ఇంటి దగ్గర నవీకరించడం ద్వారా ప్రభుత్వ విధానాలను, పథకాలను మరింత సమర్థవంతంగా ప్లాన్ చేసి అమలు చేసే అవకాశం ఉందని అనుకుంటుంది. సర్వే నిర్వహించడం ద్వారా భవిష్యత్తు సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనను మెరుగుపరచడానికి అవకాశం ఉంటుందని భావిస్తోంది. ప్రభుత్వ సిబ్బంది ఈ సర్వేను ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ద్వారా నిర్వహించనున్నారు. తద్వారా సమాచారం త్వరగా, ఖచ్చితంగా నమోదు చేయనున్నారు. సాధ్యమైన ప్రాంతాల్లో ఇప్పటికే నమోదైన రికార్డులను, సమాధానాలను ముందస్తుగా పూర్తి చేయడానికి ఉపయోగిస్తారు. తద్వారా ప్రతి కుటుంబానికి పట్టే సమయం తగ్గనుంది. ఆధార్ ప్రామాణీకరణను ఉపయోగించి గుర్తింపు ధ్రువీకరణను సురక్షితంగా నిర్వహిస్తారు. ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని కాపాడుతూ రికార్డులు సరైనవని నిర్ధారించనుంది. ప్రభుత్వ పాలన మరింత పారదర్శకంగా పని చేసేందుకు ఈ సర్వే ఉపయోగపడనుంది. పౌర కేంద్రీకృత పాలన దిశగా ఏకీకృత కుటుంబ సర్వే ఒక ముఖ్యమైన అడుగుగా ప్రభుత్వం అనుకుంటుంది. సర్వేయర్లకు ఖచ్చితమైన సమాచారాన్ని అందించడం ద్వారా, పౌరులు తమ కుటుంబ వివరాలు అలాగే ఉన్నాయని, వారు ప్రభుత్వ సేవలను సజావుగా పొందుతున్నారని నిర్ధారించుకోవడంలో సహాయపడుతుంది. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సేవల పంపిణీని మెరుగుపరచడానికి, జీవన నాణ్యతను పెంచడానికి డిజిటల్ టెక్నాలజీ, ప్రజా – స్నేహపూర్వక విధానాలను ఉపయోగించేందుకు ఈ సర్వే ఉపయోగపడనుంది.

## కూటమి చెప్పేవన్నీ అబద్ధాలే

మొదటి పేజీ తరువాయి



తెలిపారు. 'ఎక్స్' వేదికగా స్పందించిన జగన్, వైసీపీ ప్రభుత్వం 'బ్రాండ్ ఏపీ'ని నాశనం చేసిందని, పెట్టుబడిదారులను తరిమేసిందని టీడీపీ–జనసేన నిరంతరం ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ ఆరోపణల్లో కొంచెమైనా నిజం ఉండి ఉంటే పారిశ్రామిక రంగంలో ఏపీ పనితీరు దారుణంగా ఉండేదని, కానీ వాస్తవాలు భిన్నంగా ఉన్నాయని తెలిపారు. ఆర్బీఐ లెక్కల ప్రకారం 2019–24 మధ్య తయారీ రంగంలో స్థూల విలువ జోడింపు (జీవీఏ)లో ఆంధ్రప్రదేశ్ దక్షిణ భారతదేశంలో ప్రథమ స్థానంలో, దేశంలో ఐదో స్థానంలో నిలిచిందని గుర్తుచేశారు. అలాగే, పారిశ్రామిక వృద్ధిలో కూడా దక్షిణాన మొదటి స్థానంలో, దేశవ్యాప్తంగా 8వ స్థానంలో ఉందని పేర్కొన్నారు. "ఇది బ్రాండ్ ఏపీని నాశనం చేయడమా? లేక పరివర్తనాత్మక నాయకత్వంతో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమా?" అని జగన్ ప్రశ్నించారు.

## పవన్ ఎవరిని బెదిరించలనుకుంటున్నారు?

### మెడికల్ కాలేజీల దోపిడీ కనిపించడం లేదా

### మండిపడ్డ మాజీమంత్రి అంబటి రాంబాబు

**గుంటూరు :** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పవన్ కల్యాణ్ రాజకీయ ప్రవర్తనపై వ్యంగ్యంగా స్పందిస్తూ, ఆయనది ఓపెనింగ్‌లో ఓవర్ యాక్షన్, ఇంటర్వెల్‌లో డల్, చివరిలో కన్ఫ్యూజన్ అంటూ విమర్శించారు. పవన్ కల్యాణ్‌లో ఎవరినో బెదిరించాలనే భావన కనిపిస్తోందని అంబటి ఆరోపించారు. పవన్‌ను ఎవరైనా విమర్శించారా? లేక వైసీపీపై ఎందుకు దూషణలు చేస్తున్నారని ప్రశ్నించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌లపై తీవ్ర ఆరోపణలు చేశారు. మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరంగా మార్చి వారి జేబులు నింపుకుంటున్నారని విమర్శించారు అంబటి. ఈ అంశాన్ని ప్రజలకు తెలియజేయడానికి వైసీపీ కోటి సంతకాలు సేకరించిందని తెలిపారు. మెడికల్ కాలేజీల స్కాంలో బాగస్వామ్యం ఉంటే జైలుకు పంపుతామని వైఎస్ జగన్ ఇప్పటికే స్పష్టం చేశారని అంబటి గుర్తు చేశారు. ఈ స్కాంల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే పవన్ కల్యాణ్ మాట్లాడుతున్నారా? అని అనుమానం వ్యక్తం చేశారు. చంద్రబాబుతో పదిహేను ఏళ్లు కలిసి ఉంటామని పవన్ కల్యాణ్ చెప్పడాన్ని అంబటి తప్పుబట్టారు. ప్రపంచంలో ఇంతకాలం ఒప్పందాలు రాసుకునే రాజకీయ పార్టీలు ఉండవని వ్యాఖ్యానించారు అంబటి రాంబాబు.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా బియ్యం అక్రమ రవాణా ఆగలేదని, అందులో మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వాటాలు వస్తున్నాయంటూ సంచలన ఆరోపణలు చేశారు. పవన్ కల్యాణ్ ప్రాణత్యాగానికి సిద్ధమని చెప్పడాన్ని ఎద్దేవా చేస్తూ, ఆయన్ను అల్లూరి సీతారామ రాజుతో లేదా నక్సలైట్‌తో పోల్చడం సరైంది కాదన్నారు. చంద్రబాబు, లోకేష్ అవినీతిలో భాగస్వాములు కాదని పవన్ స్పష్టం చేయగలరా? అని ప్రశ్నించారు. అమరావతి భూముల స్కాం సహా పలు స్కాంలపై వైసీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత విచారణ జరుపుతామని అంబటి హెచ్చరించారు. లోకేష్ తీసుకొచ్చిన రెడ్ బుక్‌కు పవన్ మద్దతు ఇస్తున్నారని, ఆ రెడ్ బుక్‌కు చివరికి వాళ్లే బలయ్యే ప్రమాదం ఉందని అంబటి రాంబాబు వ్యాఖ్యానించారు.

## శ్రీహరికోటలో బ్లూబర్డ్ బ్లాక్-2 మిషన్

# కౌంట్‌డౌన్ ప్రారంభం




**శ్రీహరికోట :** కొత్త తరం అమెరికా కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూబర్డ్–6ను మోసుకెళ్లే ఎల్‌వీఎం3–ఎం6 రాకెట్ ప్రయోగానికి 24 గంటల కౌంట్‌డౌన్ మంగళవారం శ్రీహరికోటలో ప్రారంభమైనట్లు ఇస్రో ప్రకటించింది. బ్లూబర్డ్ బ్లాక్–2 మిషన్ కౌంట్ డౌన్ ప్రారంభమైందని, ఉదయం 8.54 గంటలకు రాకెట్ నింగిలోకి ఎగరనున్నట్లు వెల్లడించింది. ఈ ఉపగ్రహం బరువు సుమారు 6,100 కిలోలు ఉంటుంది. స్పేస్‌పోర్ట్‌లోని రెండో లాంచ్ ప్యాడ్ నుంచి ఎల్‌వీఎం3–ఎం6 వ్యోమనౌకను ప్రయోగించనున్నట్లు ఇస్రో అధికారులు తెలిపారు. అమెరికాకు చెందిన ఏఎస్టీ స్పేస్ మొబైల్ సంస్థతో కలిసి ఇస్రో వాణిజ్య విభాగం న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ ఈ ప్రయోగాన్ని నిర్వహిస్తోంది. శాటిలైట్ ద్వారా నేరుగా మొబైల్ కనెక్టివిటీ కోసం ఉద్దేశించిన ప్రాజెక్టు ఈ బ్లూబర్డ్ బ్లాక్–2 మిషన్. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ ఉన్నా, ఏ సమయంలోనైనా నేరుగా 4జీ, 5జీ వాయిస్, వీడియో కాల్స్, మెసేజ్‌లు, వీడియో ప్రసారాలు చేసేందుకు వీలుగా ఈ ప్రయోగం చేపట్టారు. వాణిజ్య, ప్రభుత్వ అప్లికేషన్లకు సపోర్ట్ చేసేలా దీనిని రూపొందించారు.

## మరో పదవిని సాధించుకున్న తెలుగుదేశం

### అదనపు సోలిసిటర్ జనరల్‌గా మాజీ ఎంపీ కనకమేడల

**న్యూఢిల్లీ :** తెలుగుదేశం పార్టీ కేంద్రంలో మరో పోస్ట్ కొట్టేసింది. ఎన్‌డిఎ భాగస్వామిగా ఉన్న టిడిపి కేంద్రంపై పట్టు బిగిస్తోంది. ఇప్పటికే అశోకగజపతిని గోవా గవర్నర్‌గా నియమించగా తాజాగా మాజీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్‌కు కేంద్ర ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించింది. సుప్రీంకోర్టు లో భారత ప్రభుత్వాన్ని ప్రాతినిధ్యం వహించే అదనపు సొలిసిటర్ జనరల్‌గా ఆయనను మోదీ సర్కార్ నియమించింది. ఈ పదవిలో ఆయన మూడేళ్ల పాటు కొనసాగనున్నట్లు కేంద్ర ప్రభుత్వం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ పదవికి దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన న్యాయపదవుల్లో ఒక్కటిగా గుర్తింపు ఉంది. కనకమేడల రవీంద్ర కుమార్ నియామకం న్యాయరంగంలో ఆయనకు ఉన్న అనుభవానికి, సామర్థ్యానికి గుర్తింపుగా రాజకీయ, న్యాయ వర్గాలు భావిస్తున్నాయి. రాజకీయ జీవితంతో పాటు న్యాయరంగంలోనూ చురుకైన పాత్ర పోషించిన ఆయనకు ఇప్పుడు దేశస్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించడం ప్రత్యేకంగా నిలుస్తోంది. కేంద్ర ప్రభుత్వ విధానాలకు సంబంధించిన న్యాయ అంశాలపై కనకమేడల రవీంద్ర కుమార్ కీలక పాత్ర పోషించనున్నారు. రాజ్యాంగపరమైన కీలక వివాదాల్లో ప్రభుత్వ వాదనను ఆయన బలంగా వినిపిస్తారని కేంద్రం భావిస్తోంది. కనకమేడల రవీంద్ర కుమార్‌కు ఈ పదవి వరించడంతో తెలుగుదేశం పార్టీ వర్గాల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. పార్టీ నేతలు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అనుభవజ్ఞుడైన న్యాయవాదికి ఈ పదవి రావడం సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వ వాదనకు బలం చేకూరుస్తోందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కనకమేడల రవీంద్ర కుమార్‌ను అదనపు సొలిసిటర్ జనరల్‌గా కేంద్ర ప్రభుత్వం నియమించడం తెలుగు రాష్ట్రాలకు గర్వకారణంగా నిలుస్తోందని టీడీపీ నేతలు ప్రశంసిస్తున్నారు. మూడేళ్ల పాటు సుప్రీంకోర్టులో భారత ప్రభుత్వ తరఫున సేవలందించనున్న ఆయనకు ఈ పదవి న్యాయరంగంలో ఉన్న ప్రతిభకు లభించిన గొప్ప గుర్తింపుగా భావిస్తున్నారు.

## వట్టిపల్లి గ్రామ నివాసి ఎల్లేష్ కు డాక్టరేట్



**రాయపోల్,డిసెంబర్:** 23 సిద్దిపేట జిల్లా జగదేవ్పూర్ మండలం వట్టిపల్లి గ్రామానికి చెందిన ఎల్లేష్ కు రసాయన శాస్త్రంలో అరుదైన గౌరవం దక్కింది. చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ హైదరాబాదులో డిజైన్ అండ్ సింథటిస్ ఆఫ్ సమ్ న్యూ క్వానాక్సలింగ్ లింకుడు హైబ్రిడ్స్ అండ్ దేర్ ఆంటి క్యాన్సర్ ఎవల్యూషన్ అనే అంశంపై ఎల్లేష్ చేసిన పరిశోధనకు గాను అతనికి ఎన్సీఎల్ పూణే రవీందర్ కొంతమ్ డాక్టరేట్ ప్రకటించారు. రసాయన శాస్త్ర ఆచార్యులు డాక్టర్ శ్రీనివాస్ పర్యవేక్షణలో పూర్తి చేశారు. ప్రస్తుతం డాక్టర్ ఎల్లేష్ , షామీర్పేటలోని సాయి లైఫ్ సైన్స్ సంస్థలో అసోసియేషన్ రీసెర్చ్ సైన్స్ సైంటిస్ట్ గా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు పరిశోధకులు అధ్యాపకులు ఎల్లేష్ కు అభినందనలు తెలిపారు.

## జోష్ క్రీడల్లో సత్తా చాటిన రఘునాథపాలెం మైనార్టీ పాఠశాల బాలికలు



**ఖమ్మం డిసెంబర్ 23 : ( సమయం న్యూస్ ) :** ఇంటర్ స్కూల్ జోష్ ఛాంపియన్ ...ఈ నెల 19నుండి 20 వరకు కారేపల్లి లో జరిగిన మైనారిటీ పాఠశాలల బాలికల ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ లో తమ విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబరిచి జోష్-3 ఛాంపియన్షిప్ గెలుచుకోవడం చాలా ఆనందంగా ఉందని మైనారిటీ ఖమ్మం గర్ల్స్ వన్ ప్రిన్సిపల్ శైలజ అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి అనేక పాఠశాలలు ఈ టోర్నమెంట్ లో పాల్గొన్నాయన్నారు. పోటీలు చాలా ఉత్తేజకరంగా జరిగాయని ఖమ్మం గర్ల్స్-1 జట్టు 8 విభాగాల్లో అసాధారణమైన ప్రదర్శన కనబరిచి , ఛాంపియన్ ట్రోఫీ గెలుచుకుందన్నారు. ప్రతి మ్యాచ్ లోను బాలికలు అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, ప్రేక్షకులను ఆకట్టుకున్నారన్నారు. జోష్ బి 3 ఛాంపియన్షిప్ వరుసగా మూడుసార్లు తమ పాఠశాలనే గెలుచుకోవడం చాలా గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన అభినందన సభలో పాఠశాల ప్రిన్సిపాల్ , సిబ్బంది , క్రీడాకారులను పాఠశాల పిఈటి ప్రేమరాణి ని అభినందించారు.

## తాండూరు లో క్రిస్మస్ వేడుకలు

● పాల్గొన్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, డిసెంబర్,23(సమయం న్యూస్) :** క్రిస్మస్ వేడుకలలో భాగంగా వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని మెట్రో ఫంక్షన్ హాల్ లో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ...తెలంగాణ ప్రభుత్వం క్రైస్తవుల అభివృద్ధి కొరకు పాటుపడుతుందని అన్నారు, తాండూర్ లో మిషనరీ స్కూల్ కాంపౌండ్ వాల్ కొరకై నిధులు మంజూరు చేసి నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా డిసిసి అధ్యక్షులు ధారాసింగ్, కాంగ్రెస్ యువ నాయకులు అంకిత్ అనురాగ్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సంపత్, క్రైస్తవ పాస్టర్లు పాల్గొన్నారు

## జర్నలిస్ట్ యూనియన్ ఎంపిక కోసం ఈ నెల 29 తేదివరకు వివరాలను సమర్పించండి.

**హైదరాబాద్ డిసెంబర్23( సమయం న్యూస్).:** రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల అక్రిడేషన్ ల జారీ కోసం నూతన మార్గదర్శకాలతో జి.వో. జారీ చేసింది. రాష్ట్ర స్థాయి కమిటీలో యూనియన్ల ఎంపిక కోరకు నేడు మంగళవారం పత్రిక నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగింది. ఆ నోటిఫికేషన్ ప్రకారం అర్హులైన జర్నలిస్టు యూనియన్లు ఈ నెల 29వ తేదీ లోపు సమాచార శాఖ కమీషనర్ కు తమ ప్రతిపాదనలను అవసరమైన ధ్రువపత్రాలతో పాటు సమర్పించాల్సిందిగా సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమీషనర్ ఒక ప్రకటనలో తెలిపారు..

## రోడ్డుపై అస్వస్థతకు గురైన వృద్ధుడికి తక్షణ సహాయం, మానవత్వం చాటుకున్న జిల్లా ఎస్పీ డాక్టర్వినీత్.ఐపీఎస్



**దామరగిద్ద మండలం,డిసె ంబర్,23(సమయం న్యూస్) :** కోస్గి పట్టణ కేంద్రంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి( పర్యటన నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు మంగళవారం రోజు వెళ్తున్న సందర్భంగా నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మానవత్వాని చాటుకున్నారు. దామరగిద్ద దాటిన అనంతరం రోడ్డుపై వెళ్తున్న ఒక ముసలి (వృద్ధుడు)వ్యక్తి అకస్మాత్తుగా కళ్ళు తిరిగి రోడ్డుపై పడిపోవడం గమనించిన ఎస్పీ వెంటనే తన వాహనాన్ని ఆపించి అక్కడ ఎటువంటి ఆలస్యం చేయకుండా తక్షణమే స్పందించిన ఎస్పీ తమ పోలీసు ఎస్కార్ట్ వాహనంలోనే ఆ వృద్ధుడిని సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రిలో అవసరమైన చికిత్స అందేలా అధికారులకు సూచనలు ఇచ్చిన ఎస్పీ మానవత్వం, బాధ్యతా భావంతో వ్యవహరించి ప్రజల ప్రశంసలు అందుకున్నారు. భద్రతా విధులతో పాటు ప్రజల ప్రాణ రక్షణే పోలీసు శాఖ యొక్క ప్రధాన బాధ్యత అని మరోసారి చాటిచెప్పిన జిల్లా ఎస్పీ చర్యను స్థానికులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

# సిఐటియూ జాతీయ మహాసభలు జయప్రదం చేయండి

● లేబర్ కోడ్ లు, ఉపాధి హామీ, రైతాంగ సమస్యలపై జాతీయ స్థాయిలో ఉద్యమాలు

● సీఐటీయూ రాష్ట్రా ఉపాధ్యక్షులు జె మల్లికార్జున్



**సమయం న్యూస్ గజ్వేల్ డిసెంబర్ 23 :** డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు విశాఖపట్నం లో జరిగే సిఐటియు అఖిల భారత 18వ మహాసభలు జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జొన్నలగడ్డ మల్లికార్జున్ పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణం పరిధిలోని రాణే మద్రాస్ లిమిటెడ్ యూనియన్ ఆఫీస్ బేరర్ సమావేశం పరిశ్రమ ఆవరణలో జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐటియు అఖిలభారత మహాసభల్లో కార్మికులు రైతాంగం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడం జరుగుతుందని అన్నారు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులను, పేదలను, రైతాంగాన్ని రోడ్డుని వేసే చట్టాలు చేసిందని, కనీసం పార్లమెంట్లో చర్చ జరపకుండా, స్థాయి సంఘాలు ఏర్పాటు చేయకుండా ముజవాను ఓటితో చట్టాలను రూపొందిస్తున్నారని అన్నారు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసిందని వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడులను చట్టాలు చేసిందని కార్మికులకు రక్షణ లేకుండా కనీస వేతనాలు అమలు జరపకుండా భద్రతాపరమైన చర్యలు లేకుండా చట్టాల రూపొందించారని అన్నారు గ్రామీణ ప్రాంతాల్లో వలసలు అరికట్టాలని, ప్రజల ఉపాధి లభించాలని వామపక్షాల ఒత్తిడితో మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం 2005 చేస్తే దాన్ని కూడా రద్దు చేశారని పేదలకు ఉపాధి లేకుండా జిరాంజీ చట్టం పేరుతో చేశారని దీనిలో ఏ పనులు చేయాలో కేంద్రం పెత్తనం పెరుగుతుంది 90 శాతం గా ఉన్న కేంద్రం నిధులను 60% తగ్గించారని అన్నారు రాష్ట్రాలను మున్సిపాలిటీ స్థాయి దిగజార్చి కేంద్రం యొక్క నియంతృత్వం పెరుగుతుందని అన్నారు. రైతాంగంకు, ప్రజలకు వచ్చే సబ్సిడీలను నూతన విద్యుత్ చట్టంలో తొలగించడం జరిగిందని అన్నారు. రాష్ట్రాలు ఇచ్చే విద్యుత్ సబ్సిడీలు తొలగించాలని కేంద్రం ఒత్తిడి చేస్తుందని వీటిపై రాబోయే కాలంలో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య,యూనియన్ ప్రధాన కార్యదర్శి నాసగోని వేణుగోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ దువ్వల బిక్షపతి, ఉప ప్రధాన కార్యదర్శి బండ్ల స్వామి, యూనియన్ నాయకులు పి.చంద్రశేఖర్ రెడ్డి, ఎ.శ్రీనివాస్, ఎస్.రంగారెడ్డి, ఎ.స్వామి,వి.వెంకట్ రావు,కె.రాజగోపాల్, ఎ. విమల, ఎస్.రవికుమార్,జి. మల్లయ్య, ఎస్ కె. సాజిద్, అల్వాల్ శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

# కుకునూరు పల్లి మండల బిఆర్ఎస్ సర్పంచులను సన్మానించిన వంటేరు ప్రతాపరెడ్డి



**సమయం న్యూస్ గజ్వేల్ డిసెంబర్ 23 :** గజ్వేల్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కుకునూరు పల్లి మండలానికి చెందిన మంగోల్ బొప్పాయిపల్లి గ్రామాల నూతన బిఆర్ఎస్ సర్పంచులు దమ్మకపల్లి కర్ణాకర్, సంపత్ లు వంటేరు ప్రతాప్ రెడ్డి ని కలవడం జరిగింది

మంగోల్ బొప్పాయిపల్లి గ్రామాల సర్పంచ్లను కర్ణాకర్ సంపత్ లతో పాటు నూతనంగా ఎన్నికైన వార్డు మెంబర్లను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గం లో అత్యధిక స్థాయిలో 92 గ్రామాలలో సర్పంచ్ గా గెలవడం జరిగింది అన్నారు గజ్వేల్ నియోజకవర్గం లో గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలోని అభివృద్ధి సంక్షేమం జరిగిందని తెలిపారు ఈ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి కుంటిపడిందని అభివృద్ధి సంక్షేమం శూన్యమని తెలిపారు కాంగ్రెస్ బిఆర్ఎస్ తోనే గ్రామాల అభివృద్ధి జరిగిందని రాబోయేది కెసిఆర్ ప్రభుత్వమేనని తెలిపారు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కాంగ్రెస్ నాయకులు గెలిచిన సర్పంచులను ప్రలోభాలకు గురి చేస్తున్నారని బ్లాక్మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు ఉద్యమాలకు భయపడని పార్టీ బీఆర్ఎస్ అని టిఆర్ఎస్ సర్పంచులు అధైర్య పడకుండా బిఆర్ఎస్ పార్టీ కెసిఆర్ నాయకత్వం గెలిచిన మీ వెంట ఉంటుందని కాంగ్రెస్ ప్రలోభాలకు తలగొద్దని సర్పంచులను కోరారు కాంగ్రెస్ తో అభివృద్ధి ఎప్పటికీ జరగదని కాంగ్రెస్ అంటేనే స్కాములు స్కీములు బ్లాక్మెయిల్ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ గా కాంగ్రెస్ ఉంటుందని తెలిపారు గడిచిన రెండు సంవత్సరాల కాంగ్రెస్ ప్రభుత్వంలో తట్టెడు మన్ను కూడా ఎత్తలేదని, రోడ్లకు గుంతలు పడితే పూడ్చలేదని, రైతులకు యూరియాను కూడా సరఫరా చేయని అసమర్ధ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని, తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అమలుకాని 420 హామీలు ఇచ్చి , అమలుకాని 6 గ్యారంటీలు ఇచ్చి తెలంగాణ రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా మోసం చేసిందన్నారు తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దిగజార్చిందన్నారు గడిచిన రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో మూడు లక్షల కోట్ల అప్పు చేశారన్నారు ఏ కార్యక్రమానికి చేసిన అప్పు వినియోగించారు ఏ ఒక్క కొత్త ప్రాజెక్టును కట్టారో ఏ అభివృద్ధి సంక్షేమానికి మూడు లక్షల కోట్లు వినియోగించారు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని వంటేరు ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని తీసివేస్తామనడం పేద ప్రజల నడ్డి విర్చడమే అని మండిపడ్డారు ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు లేదంటే పేద ప్రజల ఉసురు తలుగుతుందన్నారు పంచాయతీరాజ్ చట్టం ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతనో గ్రామాలలో గెలిచిన సర్పంచ్ కూడా అంతేగాని తెలిపారు గ్రామాలకు రావాల్సిన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి అడ్డుకునే హక్కు ఎవరికి లేదన్నారు గెలిచిన సర్పంచ్లందరూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను వింటూ సమస్యలను పరిష్కారం చేయాలని గ్రామాలను అభివృద్ధి బాట పట్టించాలని మేం ఎల్లప్పుడూ మీ వెంటే ఉంటామని మీకు ఏమన్నా సమస్య వస్తే మాకు తెలిపితే మేము ఎల్లప్పుడూ మీ వెంటే ఉంటామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు, కోలా సద్గుణ రవి, మాజీ సర్పంచ్ ఆప్షన్ నెంబర్ సలీం, మాజీ సర్పంచ్ కోల శ్రీనివాస్, సీనియర్ నాయకులు కరుణాకర్ రెడ్డి,అహ్మద్, రెడ్డమైన రవి, కనకరాజు,నరసింహారెడ్డి,బాబు,భాను, కర్ణాకర్ గౌడ్ నాగరాజు, సుదర్శన్, బ్రహ్మాచారి, రవి తదితరులున్నారు

## "వేడుకలు సిబ్బందిలో పని ఒత్తిడిని తగ్గించి, ఐక్యతను పెంపొందిస్తాయి.





**వికారాబాద్, డిసెంబర్,23(సమయం న్యూస్) :** జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం క్రిస్మస్ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు క్రైస్తవ మత పెద్దలతో కలిసి ఎస్పీ క్రిస్మస్ కేక్ను కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే ఈ పండుగ ప్రేమకు, శాంతికి మరియు కరుణకు చిహ్నమని కొనియాడారు. అన్నీ మతాలు సమాజంలో సోదరభావాన్ని, ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని తెలిపినారు. పోలీస్ శాఖ అనేది ఒక కుటుంబం వంటిదని, అన్ని మతాల పండుగలను సమానంగా గౌరవిస్తూ ఇలాంటి వేడుకలు జరుపుకోవడం వల్ల సిబ్బందిలో పని ఒత్తిడి తగ్గి, మానసిక ఉల్లాసం మరియు ఐక్యత పెరుగుతుందని ఎస్పీ అభిప్రాయపడ్డారు. జిల్లా ప్రజలందరూ మతసామరస్యాన్ని పాటిస్తూ పండుగలను ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనలలో పాస్టర్లు రెవరెండ్ పవన్,జాన్ పాల్గొని జిల్లా పోలీసుల సంక్షేమం కోసం, శాంతి కోసం ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.రాములు నాయక్, డిటిసి డీఎస్పీ శ్రీనివాసులు,డిటిసి డీఎస్పీ జానయ్య వికారాబాద్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, ఏఓ ఖజామోహినోద్దీన్, సీఐలు, ఆర్.ఐలు మరియు పోలీస్ కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## టొయోటా కార్ల మినీ క్యాంపు ను ప్రారంభించిన తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి



**సమయం న్యూస్ గజ్వేల్ డిసెంబర్ 23 :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఐ ఓ సి కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన టోయోటా కార్ల మినీ క్యాంప్ ను మంగళవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ శరవేగంగా అభివృద్ధి చెందుతుందని,హైదరాబాద్ కు దీటుగా అన్ని వ్యాపార కేంద్రాలు ఇక్కడ నెలకొల్పుతూ ఉన్నారని, కార్ల కంపెనీ యాజమాన్యానికి సిబ్బందికి అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ సీ సంతోష్,వెంకటేష్, హరిచంద్ర ప్రసాద్,బొజ్జ రవి ,సింగం, నరేందర్ రెడ్డి,పాల్గొన్నారు

# మీ సొమ్ము..మీ హక్కు



**నారాయణపేట, డిసెంబర్,23,(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లాక్లైమ్ చేసుకొని ఆస్తుల పరిష్కరం కోసం మూడు నెలల "మీ సొమ్ము. మీ హక్కు "నినాదంతో ఈ రోజు జిల్లా కలెక్టర్ మీటింగ్ హాల్లో లీడ్ బ్యాంక్ ఆఫీసు ఆద్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది.ఈ సమావేశంలో ముఖ్య అతిదిగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్ మరియు ఆర్బిఐ నుండి %జూంర్.స్త్రవఅ%.మేనేజర్ రెహమాన్, ఎస్బిఐ రీజనల్ ఆఫీసు నుండి సిఎం సత్యప్రకాష్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎస్.ఎస్. విజయ్ కుమార్ మాట్లాడుతూ క్లెయిమ్ చెయ్యని పొదుపు ఖాతాలను ఏ విదంగా తిరిగి స్వంత యజమానులు పొందవచ్చో తెలిపారు. జిల్లా ఇన్చార్జి కలెక్టర్ జిల్లా అధికారులను, మరియు పురప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లా శాఖలు, పౌరుల తమ క్లైమ్ చేయని బ్యాంక్ డిపాజిట్లు, సులభంగా పొందేలా ముక్యంగా ఎక్కువ మొత్తంలో గవర్నమెంట్ ఖాతాలు ఉన్నందున వాటిని సెటిల్ చేయడం కొరకు బాంకులు తగు విదంగా పనిచేయాలని కోరారు. అదేవిదంగా జిల్లా అదికారులను తమ ఖాతాలు త్వరగా బాంకుల్లో సంప్రదించి సెటిల్ చేసుకోని నిదులు లబయత చేసుకోవాలని కోరారు.ఈ ప్రచార కార్యక్రమం చాలా ముక్యమైనదని ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగించికోవాలని అన్నారు.రెహమాన్ మాట్లాడుతూ ఎక్కువ సంక్యలో క్లెయిమ్ చేసిన బంకులకు ఆర్బిఐ ప్రత్యక ప్రోత్సాహకాలు ప్రకటించినదని ఈ అవకాశాన్ని బాంకులు సద్వినియోగించికోవాలని కోరారు.నిరర్థిక ఆస్తులకు సంబందించిన అంలైన వారసులు, అవసరమైన పత్రాలతో తమ బ్యాంకులు, ఇతర సంస్థలను సంప్రదించి ఈ ప్రచారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ శిభిరంలో పాల్గొన్న బ్యాంకులు ఎస్బిఐ, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ , యూనియన్ బ్యాంక్ , కనర బ్యాంక్ మరియు బ్యాంక్ ఆఫ్ ఇండియా తమ స్టాళ్లను ఏర్పాటు చేసి వినియోగధరులకు సేవలు అందించారు. అర్హులైన క్లెయిమ్ దారులకు సెటిల్మెంట్ పత్రాలను పంపిణీ చేశారు. సిఎం సత్య ప్రకాశ్ మరియు పంచాయత్ సక్రియటరీస్ ఉద్దేశించి మాట్లాడుతూ అక్కౌంట్స్ సెంటిల్మెంట్ కోసం తమ బ్రాంచ్ లు ప్రేత్యేక శ్రద్ద తీసుకుంటున్నాయని తెలియజేశారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎస్. ఎస్. విజయ్ కుమార్, నాబార్డ్ డిడిఎం షణ్ముఖ చారి,ఎస్బిఐ సివిల్ లైన్స్ చీఫ్ మేనేజర్ జేమ్స్ డేవిడ్ , ఎస్బిఐ నారాయణపేట బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ప్రదీప్ ,ఎస్బిఐ మక్తల్ చీఫ్ మేనేజర్ ప్రసన్న కుమార్, కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ హిమానషు,డీపీఓ సరుద్ధకర్, పాల్గొని విజయవంతం చేశారు.

## సీఎం రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్



**కోస్గి మున్సిపల్, డిసెంబర్,23,(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కోస్గి పట్టణ కేంద్రనికి 24తేది, బుధవారం రోజు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి రానున్న నేపథ్యంలో, ఏ చిన్న లోటు పట్లు లేకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టామని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు.కోస్గిలోని ఓ ఫంక్షన్ హాల్లో ఉమ్మడి జిల్లా, వికారాబాద్, సంగారెడ్డి, సూర్యాపేట, నల్గొండ జిల్లాల నుండి బందోబస్తు కు వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి మె-ంత్తం 800 మంది పోలీసులతో అందులో అదనపు ఎస్పీలు ...02, డీఎస్పీ...06, సిఐ లు...19, ఎస్ ఐ లు...43, ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్స్ లు...93, కానిస్టే బుల్స్, మహిళా పోలీసులు, హెూమ్ గార్డ్స్ , 600 మంది మరియు 02 టిఎస్ఎస్పి ప్లాటున్స్ పోలీసు అధికారులు సిబ్బందితో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు.సీఎం పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా బందోబ స్తును మె-ంత్తం 10 సెక్టార్లుగా విభజించి, ఆయా సెక్టార్లకు అదనపు ఎస్పీలు, డీఎస్పీలు ఇన్చార్జీలుగా నియమిం చామని, భద్రతపై నిశితంగా, సమన్వయంతో పని చేయాలని సీనియర్ అధికారులను బాధ్యతల్లో ఉంచినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక భద్రతా బృందాలు - క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహి స్తాయని అన్నారు. ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని హెలిపాడ్ నుండి కాన్వాయ్ లో పబ్లిక్ మీటింగ్ కి వచ్చే వరకు బందోబస్తును రోడ్ ఓపెనింగ్ పార్టీలు, రోఫ్ పార్టీలు, పెట్రోలింగ్ టీములు, ట్రాఫిక్ డైవర్షన్, రూఫ్ టఫ్ సెంట్రి లు, బాంబ్ స్క్వాడ్ %డ% డాగ్ స్క్వాడ్ టీములు, పార్కింగ్ బందోబస్తును ఏర్పాటు చేశామని ఎవరికి ఎక్కడ డ్యూటీ లు వేస్తే అక్కడ అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులను గమనిస్తే వెంటనే పై అధికారులకు నివేదించాలని ఎస్పీ అన్నారు. పోలీసులకు మంచి నీళ్ళు, బోజన సదుపాయాలు అన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని, బయటి నుండి వచ్చిన పోలీసులకు వసతి సౌకర్యం కల్పించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన అత్యంత ప్రాధాన్యత కలిగినది అని ప్రతి పోలీస్ అధికారి%-%సిబ్బంది తమకు కేటాయించిన బాధ్యతలను పక్కాగా, అప్రమత్తంగా నిర్వర్తించాలి సూచించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, భద్రతా లోపం లేకుండా, రూట్ మానిటరింగ్ అధికారులు చూసుకోవాలని, ట్రాఫిక్ నియంత్రణను సమర్థవంతంగా నిర్వహించాలి అని సూచించారు.అదనపు ఎస్పీలు ఎండీ రియాజ్, డీఎస్పీ ఎన్. లింగయ్య, మహేష్, సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు మరిన్ని చర్యలు చేపట్టాలి

- బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు
- జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు ఘనంగా నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- కలెక్టరేట్ లో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం



**కరీం నగర్ డిసెంబర్23( సమయం న్యూస్). :** రోడ్డు ప్రమాదాల నివారణకు మరిన్ని పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ఆర్ అండ్ బి, పోలీస్, రవాణా, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్టీసీ, ఇతర శాఖల అధికారులతో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో తరచుగా ఎక్కడెక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి, గత సమావేశంలో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టారు, జిల్లాలో ఎన్ని బ్లాక్ స్పాట్స్ ఉన్నాయి, గత కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలు ఏమిటని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు అనంతరం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్ లను గుర్తించి రోడ్డు ప్రమాదాలు, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాద ప్రదేశాలలో సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రమాద అవకాశం ఉన్న స్థలాల్లో వాహనాల వేగ నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. తరచుగా ప్రమాదాలు జరుగుతున్న చోట్ల వాటికి గల కారణాలను విశ్లేషించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. నేషనల్ హైవే అథారిటీ, పంచాయతీరాజ్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు రోడ్ సేఫ్టీ కమిటీ మీటింగ్ లో చర్చించిన అంశాలకు సంబంధించి చర్యలు తీసుకొని నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఆర్టీసీ, ప్రైవేట్ బస్సుల్లో తప్పనిసరిగా ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలని అన్నారు. పాఠశాల బస్సులపై ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబర్ అతికించాలని సూచించారు.జనవరి 1 నుండి 31వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించే జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాలను విజయవంతం చేయాలని అన్నారు. ఉత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించాలని సూచించారు. తిమ్మాపూర్ లోని సారథి ట్రాఫిక్ అవగాహన పార్కును విద్యార్థులు సందర్శించేలా చూడాలని తెలిపారు. విభిన్న కార్యక్రమాల ద్వారా రోడ్డు అవగాహన మాస ఉత్సవాలు ఏర్పాటు చేయాలని అన్నారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గురించి వివరించారు. గత సంవత్సరం కాలంలో ప్రమాదాలు, మరణించిన వారి సంఖ్య తదితర వివరాలు వెల్లడించారు. కరీంనగర్-జగిత్యాల రోడ్డుకు ఇరువైపులా చెట్ల కొమ్మలు ఎక్కువగా ఉన్నందున రాత్రి వేళల్లో దారి కనిపించక చాలా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. సంభవిత అధికారులు ఈ మార్గంలో వాహనదారులకు

## బాల సదనం లో పిల్లల సౌకర్యాలు. ఏర్పాటు పై సంతృప్తి

**కరీంనగర్ డిసెంబర్23( సమయం న్యూస్). :** ఈరోజు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలొ నడుస్తున్న బాలసదనము మరియు శిశుగృహ పిల్లల సంరక్షణ కేంద్రాలను కే రాణి గౌరవనీయులైన ప్రిన్సిపల్ సివిల్ జడ్జిమరియు జిల్లా న్యాయ సేవా సాధికారత జడ్జి ఇంచార్జి గారు ఈ పిల్లల సంరక్షణ కేంద్రాలలో పిల్లలకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకుని సంతృప్తత వ్యక్తం చేశారు. దత్తత మరియు పోస్టర్-కేర్ గురించి వివరాలు అడగడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సాధికారత విభాగం సూపరిండెంట్ సుజాత గారు, బాల సదన్ సూపర్డెంట్ సంతోషిని గారు, శిశు గృహ మేనేజర్ ఇంచార్జ్ డోలి తేజస్విని గారు, కీర్తి, రమ, శిశు- గృహ సోషల్ వర్కర్ ఇంచార్జ్ సాదినేని రమేష్, తదితరులు పాల్గొన్నారు





## జిజ్ఞాస హై స్కూల్లో క్రిస్టమస్ సందడి





**రాయపోల్,డిసెంబర్ 23 :**గజ్వేల్ పట్టణంలోని జిజ్ఞాస హై స్కూల్లో క్రిస్టమస్ వేడుకలు పండుగ వాతావరణంలో మంగళవారం ఘనంగా నిర్వహిం చారు.పాఠశాల ప్రాంగణం క్రిస్మస్ ట్రీలు, నక్షత్రాలు, అలంకరణలతో ప్రత్యేక శోభను సంతరించుకుంది.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ఉత్సాహభరిత నృత్యాలు,కరోల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.శాంతి, ప్రేమ, సౌభ్రాతృత్వం అనే క్రిస్టమస్ సందేశాన్ని ప్రతిబింబించేలా కార్యక్రమాలు సాగాయి. విద్యార్థుల్లో సృజనాత్మకతతో పాటు మానవీయ విలువలను పెంపొందించడమే లక్ష్యంగా ఇలాంటి వేడుకలు నిర్వహిస్తున్నామని పాఠశాల కరస్పాండెంట్ కరుణాకర్ పేర్కొన్నారు. క్రిస్టమస్ వేడుకల సందర్భంగా పాఠశాల కు మూడు రోజులపాటు సెలవులు ప్రకటించారు.పాఠశాల తిరిగి శనివారం పునః ప్రారంభమవుతున్నట్లు తెలిపారు.

## మోటార్లు బిగించి రెండు వార్డులకు ప్రజలకు త్రాగు నీరు అందజేత

- దుద్యాల నూతన సర్పంచ్ తుడుం సంగీత వాణి రమేష్



**దుద్యాల మండలం, డిసెంబర్,23(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా దుద్యాల గ్రామ పంచాయతీలోని 5వ,మరియు 11వ వార్డ్ లో నీటి కొరతా ఉండడంతోకడా నిధుల నుండి బోరు సాంక్షన్ అవ్వడం జరిగింది.నీళ్లు పుష్పలంగా రావడం వల్ల మంగళవారం మోటర్ బిగించి ప్రజలకు నీళ్లు అందించడం జరిగిందని సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తుడుం సంగీత వాణి రమేష్, మరియు కొడంగల్ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ దుద్యాల మండల అధ్యక్షులు ఆవుటి శేఖర్, మరియు గ్రామ వార్డ్ సభ్యులు గొనిగిరి కృష్ణవేణి రాజు, మాసుల బసి రెడ్డి, హాజీ కరీమ్, గ్రామ పెద్దలు ,తదితరులు పాల్గొన్నారు.

## కంది మరియు శనగ పంటలలో తెగుళ్లు మరియు వ్యాధులను ముందస్తుగా గుర్తించడంపై రైతులకు అవగాహన



**కొడంగల్ మండలం, డిసెంబర్,23(సమయం న్యూస్) :** రావులపల్లి గ్రామములో కంది మరియు శనగ పంటలలో తెగుళ్ళు మరియు వ్యాధులను ముందస్తుగా గుర్తించడంపై రైతు క్షేత్ర ప్రదర్శన మరియు అవగాహన కార్యక్రమం ఎస్బిఐఫౌండేషన్ మద్దతుతో స్మార్ట్ క్రాప్ ప్రాజెక్ట్లో భాగంగా, వికారాబాద్ జిల్లాలోని కొండగల్ డివిజన్లోని రావలపల్లి గ్రామంలో రైతు క్షేత్ర ప్రదర్శన మరియు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది.ఈ కార్యక్రమం కంది మరియు శనగ పంటలలో తెగుళ్ళు మరియు వ్యాధులను ముందస్తుగా గుర్తించడం మరియు సమగ్ర పంట ఆరోగ్య నిర్వహణ పద్ధతులను ప్రోత్సహించడంపై దృష్టి సారించింది. నుండి శాస్త్రవేత్తలు మరియు నిపుణులు (డాక్టర్ జబా జగదీష్, సూరజ్ మిశ్రా, బాలకృష్ణ, రాజేంద్ర,రాజు, మరియు గోపాల్) అగ్రిబ్రిడ్జ్%-%కృషివాస్ ప్రతినిధి ( స్వామి), మరియు వ్యవసాయ శాఖ నుండి మండల వ్యవసాయ అధికారి ఎన్. శ్రీలత ,ఎఇఓ సుమ మరియు స్థానిక అధికారులు రైతులతో సంభాషించారు మరియు తెగులు మరియు వ్యాధి లక్షణాలను గుర్తించడం, జీవ విత్తన చికిత్సల వాడకం, అవసరానికి అనుగుణంగా పురుగుమందుల వాడకం మరియు మంచి వ్యవసాయ పద్ధతులు ( స్వీకరించడంపై ఆచరణాత్మక శిక్షణ ఇచ్చారు. సకాలంలో పంట రక్షణ కోసం రైతుల సామర్థ్యాన్ని బలోపేతం చేయడం, ఇన్పుట్ ఖర్చులను తగ్గించడం మరియు స్థిరమైన పద్ధతిలో ఉత్పాదకతను మెరుగుపరచడం ఈ కార్యక్రమం యొక్క లక్ష్యం

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డిఎఫ్ఓ.



**నిర్మల్ డిసెంబర్23( సమయం న్యూస్).:** మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ను, కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో...జిల్లాకు నూతనంగా బదిలీపై వచ్చిన జిల్లా అటవీ శాఖ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, పూల మొక్కను అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాకు వచ్చిన డిఎఫ్ఓ కు కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రమశిక్షణతో తన ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం ఇరువురు సమావేశమై, జిల్లా అటవీ శాఖకు సంబంధించిన పలు అంశాలను చర్చించారు.

## కోస్గిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి.

● వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు.



**కోస్గి మున్సిపల్, డిసెంబర్,23(సమయం న్యూస్) :** మంగళవారం లక్ష్మీనరసింహ గార్డెన్ హాల్లో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై అధికారులతో నారాయణ పేట జిల్లా ఇన్ ఛార్జీ కలెక్టర్ సంచిత్ గంగ్వర్ తో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలని అన్నారు.డబుల్ బారికేడ్లు ఏర్పాటు చేయాలని లైటింగ్ తదితర పనులను , డిఎంహెచ్వో ఆధ్వర్యంలో అంబులెన్స్ ఏర్పాటు చేయాలన్నారు. మెడికల్ క్యాంపు పెట్టాలని తెలిపారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో హెలికాప్టర్ సిబ్బందిని చూడాలన్నారు. ఫైర్ శాఖ ఆధ్వర్యంలో హెలిపాడ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ఎల్ఈడి బల్బులు తదితర పనులను విద్యుత్ శాఖ ఏర్పాటు చేసి జనరేటర్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీ వారు శానిటేషన్ త్రాగునీరు తదితర ఏర్పాట్లు చూడాలన్నారు. హెలికాప్టర్ దగ్గర ఫోటో వీడియో గ్రాఫర్ పెట్టాలన్నారు. సర్పంచుల సన్మాన కార్యక్రమానికి డిపిఓ ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శులు చూడాలని వారిని ముందే కుర్చీలలో కూర్చోబెట్టాలన్నారు.వారికి భోజన సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు. సర్పంచులకు పాసులు ఎంపీడీవో అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను ఏఎస్పీ ప్రకాష్ రావు డీఎస్పీ శ్రీధర్ రెడ్డి, డి . ఎస్.పి.లింగయ్య, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు..

## శ్రామిక మహిళ నెల్లూట్ల పుష్ప మృతి : సీపీఎం సంతాపం



**ఖమ్మం , డిసెంబర్ 23 : ( సమయం న్యూస్ )** శ్రామిక మహిళ నెల్లూట్ల పుష్ప మంగళవారం ఉదయం ఖానాపురం లో మృతి చెందారు. ఆమే మరణ వార్త తెలియ గానే సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు , ఖానాపురం సిపిఎం ప్రధాన కార్యదర్శి డోంగల తిరుపతి రావు , ఆమే భౌతిక కాయాన్నీ సందర్శించి , నివాళులు అర్పించారు. పుష రజక కుటుంబం లో పుట్టి ,అనేక కుల వృత్తి తో జీవనం సాగించారు . కార్మికులు , కర్షకులు ఇలాంటి శ్రామిక మహిళలే సమాజాన్ని నడిపించారని అయన కొనియాడారు. నెలూట్ల పుష్ప కు ఇద్దరు కుమారులు ,ఒక కుమార్తె ఉన్నారు. ఈ కార్యక్రమం లో సిపిఎం నాయకులు నెల్లుట్ల వెంకన్న , న్యూ లక్ష్య ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ గరిడేపల్లి సత్యనారాయణ, నెల్లూట్ల సతీష్, నెల్లూట్ల ఉపేందర్, రమ, యమున, తెలుగుదేశం పార్టీ నాయకులు అంజి, బీ ఆర్ ఎస్ నాయకులు లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు పర్వత శ్రీను,మధు, సంఘాల నాయకులు, బంధుమిత్రులు అధిక సంఖ్య లో పాల్గొని మృతి పట్ల సంతాపం, కుటుంబ సభ్యులకు సాను భూతి ప్రకటించారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ మార్కవట్ నిర్ణిత గడువులోగా పూర్తి చేయండి.

జిల్లా కలెక్టర్ .



**కామారెడ్డి డిసెంబర్23( సమయం న్యూస్).:** ఇందిరమ్మ ఇళ్ల మార్కవుట్ ప్రక్రియతో పాటు పంచాయితీ సెక్రటరీల హాజరు అంశాల పై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మంగళవారం సంబంధిత అధికారులతో కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఎల్పీఓ ఎంపీడీఓ , ఎంపీఓ లు, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన మార్కవుట్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి ఎలాంటి లోపాలకు తావులేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే పంచాయితీ సెక్రటరీల హాజరు వ్యవస్థను కచ్చితంగా అమలు చేయాలని, రోజువారీ హాజరు పర్యవేక్షణను బలోపేతం చేయాలని సూచించారు.ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం వహించరాదని, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అధికారులకు జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మండలాల వారిగా పురోగతిని అడిగి తెలుసుకొని, మార్కవుట్ పనులను వేగవంతం చేయాలని అన్నారు.పంచాయితీ సెక్రటరీలు సమయపాలన పాటించేలా, ఉదయం ఫీల్డ్ కు వెళుతున్నారా లేదా ఆరా తీయాలని, ప్రతీ రోజు సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని అన్నారు.ఈ సమావేశంలో సంబంధిత జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దాతర్ పల్లి గ్రామ పంచాయతీ నూతన పాలకవర్గం సన్మాన కార్యక్రమం



**సమయం న్యూస్ గజ్వేల్ డిసెంబర్ 23 :** గజ్వేల్ మండలం దాతర్ పల్లి గ్రామపంచాయతీ నూతన పాలకవర్గం సన్మాన కార్యక్రమం చేయడం జరిగింది సర్పంచ్ బాసు దివ్య రాజ్ కుమార్ ఉప సర్పంచ్ బారు నాగలక్ష్మి అరవింద్ వార్డు సభ్యులు చీకట్ల యశోద, జూపల్లి తిరుపతి, కంటే యాదగిరి, వనం నాగరాణి, జూపల్లి పెద్దోళ్ల పద్మ, వనం కళ్యాణి, బిడే శివకుమార్ కు సన్మానం చేయడం జరిగింది ముఖ్యంగా గ్రామ యువత గెలుపుకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించారు గ్రామ పెద్దల సమక్షంలో గ్రామ ప్రజల ఆశీర్వాదంతో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి బిజెపి మండల సీనియర్ నాయకులు మహిళా మోర్చా నాయకులు పాల్గొనడం జరిగింది

# భూభారతి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

● కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి
● అర్జీదారులతో ముఖాముఖి భేటీ




**నిజామాబాద్, డిసెంబర్ 23 (సమయం న్యూస్) :**భూభారతి పెండింగ్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన జక్రాన్పల్లి మండలం కేశ్ పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ గ్రామంలో పెండింగ్ లో ఉన్న భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలపై తహసిల్దార్, ఆర్.ఐ, ఇతర అధికారులతో సమీక్షించారు. దరఖాస్తులను పరిష్కరించే విషయమై నెలకొన్న ఇబ్బందులు, సాంకేతిక కారణాల గురించి రెవెన్యూ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని నివృత్తి చేస్తూ దరఖాస్తులను ఎలా పరిష్కరించాలనే విషయాలపై కలెక్టర్ సూచనలు చేశారు. భూ సంబంధిత సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి భూ హక్కులు కల్పించి సాంత్వన చేకూర్చాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం అమలులోకి తెచ్చిన భూభారతి చట్టం లక్ష్యం నెరవేరే విధంగా కృషి చేయాలని కలెక్టర్ హితవు పలికారు. అర్హులైన ప్రతి అర్జీదారుడి దరఖాస్తును పరిశీలిస్తూ, పరిష్కరించేందుకు అవకాశం ఉన్న వాటిని వెంటనే పరిష్కరిస్తూ తగిన న్యాయం జరిగేలా మానవీయ కోణంలో పని చేయాలన్నారు. అర్హులైన వారిని పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా సకాలంలో వారికి భూములపై హక్కులు కల్పించాలన్నారు. అనంతరం దరఖాస్తుదారులైన రైతులతో కూడా కలెక్టర్ ముఖాముఖిగా భేటీ అయి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారందరికీ భూభారతి చట్టంలోని నిబంధనలను అనుసరిస్తూ తప్పనిసరిగా భూములపై హక్కులు కల్పిస్తామని భరోసా కల్పించారు. కలెక్టర్ వెంట గ్రామ సర్పంచ్ రవికుమార్, తహసిల్దార్ కిరణ్మయి, స్థానిక అధికారులు ఉన్నారు.

# '100 వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ' పేరుతో వినూత్న పోటీలు

**నిర్మల్ డిసెంబర్23( సమయం న్యూస్). :** నిర్మల్ జిల్లా యువజన, క్రీడల మరియు టూరిజం శాఖ ఆధ్వర్యంలో, జిల్లా టూరిజం అధికారి బి. శ్రీకాంత్ రెడ్డి సమన్వయంతో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్, ఇతర జిల్లా ఉన్నతాధికారుల చేతుల మీదుగా "100 వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ" కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్న అద్భుతమైన కానీ ప్రజలకు పెద్దగా తెలియని పర్యాటక ప్రాంతాలను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. రాష్ట్ర ప్రజలకు అంకితంగా నిర్వహిస్తున్న ఈ వినూత్న కార్యక్రమంలో పాల్గొనాలని యువతను ఆయన ఆహ్వానించారు.జిల్లాలోని ఆసక్తి గల యువతి-యువకులు, ఆడియో-వీడియో ఫోటోగ్రాఫర్లు, కవులు, రచయితలు నిర్మల్ జిల్లాలో ఉన్న కానీ పెద్దగా గుర్తింపు పొందని పర్యాటక ప్రాంతాలపై ఫోటోలు, వీడియోలు, వివరాలను సిద్ధం చేసి 100 పదాలకు మించకుండా గూగుల్ ఫామ్ లేదా సోషల్ మీడియా ద్వారా రాష్ట్ర టూరిజం శాఖ అకౌంట్‌ను ట్యాగ్ చేస్తూ పంపవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు www.tourism.telangana. gov.inవెబ్‌సైట్‌ను సందర్శించవచ్చన్నారు.ప్రజలకు పెద్దగా తెలియని జలపాతాలు, పురాతన దేవాలయాలు, ట్రెక్కింగ్ పాయింట్లు వంటి 100 కొత్త పర్యాటక గమ్యస్థానాలను గుర్తించి, వాటి వివరాలతో ఒక కాఫీ టేబుల్ బుక్ రూపొందించడమే ఈ పోటీ లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ పోటీకి కింది 10 విభాగాలలో ఎంట్రీలు పంపవచ్చని తెలిపారు:

1. ప్రకృతి
2. వన్యప్రాణులు
3. కళ %డ% సంస్కృతి
4. హెరిటేజ్
5. జల వనరులు
6. వంటకాలు
7. ఫామ్ స్టేస్
8. రిసార్ట్స్
9. ఆధ్యాత్మిక
10. అడ్వెంచర్

ఎంట్రీలో భాగంగా ఎంచుకున్న ప్రదేశానికి సంబంధించిన మూడు ఉత్తమ ఫోటోలు, 60 సెకన్ల నిడివి గల వీడియో, ఆ ప్రాంతానికి సంబంధించిన రవాణా, బస, బడ్జెట్ వివరాలు తప్పనిసరిగా జతచేయాల్సి ఉంటుందని తెలిపారు.

ఉత్తమ ఎంట్రీలకు
మొదటి బహుమతి: రూ.50,000/-
రెండవ బహుమతి: రూ.30,000/-
మూడవ బహుమతి: రూ.20,000/-

కన్సోలేషన్ బహుమతులు: హరిత హోటల్‌లో ఉచిత బస అందజేస్తామని రాష్ట్ర టూరిజం సంచాలకులు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు జనవరి 5, 2026లోపు తమ ఎంట్రీలను పంపవలసి ఉంటుందని, ఈ సంవత్సరం సంక్రాంతి సందర్భంగా విజేతలను ప్రకటిస్తామని తెలిపారు.

# ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాల లో మెరుగైన పలితాలు సాధించాలి.

● జిల్లా కలెక్టర్ కే హైమావతి.




**సిద్దిపేట డిసెంబర్23( సమయం న్యూస్) :** జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళశాలలో మెరుగైన పలితాలు సాధించాలని ప్రతి ఒక్క విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు.మంగళవారం సమీకృత కార్యాలయ సముదాయం లోని కాన్ఫరెన్స్ హాల్ లో ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలల ప్రిన్సిపల్ మరియు సిబ్బందితో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో ఆయా కళాశాల వారిగా గత ఏడాది మరియు ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన పరీక్షల ఫలితాలపై సమీక్ష నిర్వహించి ఎదురైన సమస్యల గూర్చి ప్రిన్సిపల్ లతో ఆరా తీశారు. ప్రిన్సిపల్ మరియు అధ్యాప కులు విద్యార్థులు అన్ని సబ్జెక్ట్ పైన ఎక్కువ ఏకాగ్రత పెట్టాలని కఠిన సబ్జెక్ట్ మీద ఎక్కువ ఫోకస్ పెట్టి చదివించాలని తెలిపారు. జనవరి, ఫిబ్రవరి నెలలో బోర్డ్ పరీక్షల వరకు 50 రోజుల యాక్షన్ ప్లాన్ తయారు చెయ్యాలని పిల్లలకు ప్రత్యేక తరగతులు పెట్టాలనీ ప్రతి ఒక్కరు ఉత్తీర్ణత కావాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థులనీ ప్రోత్సహించి చదువులో మంచి ఉత్తీర్ణత సాధిస్తే వచ్చే ఏడాదీ ఎక్కువ మొత్తంలో కళాశాలలో అడ్మిషన్లు వస్తా యని ఆది దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరు పనిచేయాలని ఆదేశించారు. ప్రిన్సిపల్ మరియు అధ్యాపకులు మీ యొక్క ధర్మం సక్రమంగా నిర్వహించాలి. విద్యార్థులకు మంచి చదువు క్రమశిక్షణ నేర్పించి వారు ఉన్నత శిఖరాలకు చేరుకునేలా తయారు చెయ్యాలని తెలిపారు. అలాగే జిల్లాలో పలు జూనియర్ కళాశాలలో మేజర్, మైనర్ రిపేర్లు జనవరి 15 లోపు పూర్తి చెయ్యాలి. కళాశాల కావలసిన మౌలిక వసతుల కల్పించడం ప్రాధాన్యత ప్రకారం అందిస్తామని తెలిపారు.జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి రవీందర్ రెడ్డి, ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

# ప్రయారిటీ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలి.

● డిఆర్ఓ పద్మజారాణి
● రుణాల లక్ష్యాల సాధనపై సమీక్ష




**సంగారెడ్డి, డిసెంబర్ 23 (సమయం న్యూస్) :** సంక్షేమ, ప్రయారిటిరంగాలకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను బ్యాంకులు తప్పనిసరిగా సాధించాలని జిల్లా రెవెన్యూ అధికారి పద్మజారాణి బ్యాంకర్లకు సూచించారు. డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ మరియు డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ సమావేశం మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిఆర్ఓ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశంలో ఆర్‌బీఐ ఏజీఎం లక్ష్మీ శ్రావ్య, నాబార్డ్ ఏజీఎం ఎం.వి. కృష్ణ తేజ, డీసీసీబీ బ్యాంక్ సీఈఓ శ్రీనివాస్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ నర్సింగ్ రావు, సంక్షేమ శాఖల అధికారులు, డీఆర్‌డీఏ, డీఐసీ, తదితర శాఖల అధికారులు, అన్ని బ్యాంకుల నియంత్రణాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్డీఎం నర్సింగ్ రావు సాధించిన రుణ లక్ష్యాన్ని వివరించారు.సెప్టెంబర్ 2025 నాటికి పంట రుణాలు రూ.1509.73 కోట్లు (86.29), మొత్తం వ్యవసాయ రుణాలు రూ.2681.34 కోట్లు (78.67%), ప్రయారిటీ రంగ రుణాలు రూ.4715.43 కోట్లు (89.15%), మొత్తం అడ్వాన్సులు రూ.10676.28 కోట్లు (91.09%) అందించినట్టు ఎల్ డీ ఎం.వెల్లడించారు.విద్యా రుణాలు, గృహ రుణాలు, ఎంఎస్ఎంఈ రుణాలు, స్వయం సహాయక సంఘాల రుణాలు తదితర అన్ని రంగాల వారీగా లక్ష్యాలు, సాధించిన పురోగతిని బ్యాంకు నియంత్రణాధికారులతో క్షుప్తంగా చర్చించారు. పద్మజా రాణిమాట్లాడుతూ,ప్రభుత్వ శాఖలు, బ్యాంకులు సమన్వయంతో పనిచేస్తేనే జిల్లాలో ఆర్థిక అభివృద్ధి, సంక్షేమ పథకాల లక్ష్యాల సాధన సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆర్‌బీఐ ఏజీఎం లక్ష్మి శ్రావ్య మాట్లాడుతూ,వ్యవసాయం, ఎంఎస్ఎంఈ (ముద్ర)తో సహా అన్ని ప్రయారిటీ రంగాల్లో రుణాల మంజూరును మరింత పెంచాలని బ్యాంకర్లకు సూచించారు. బ్యాంకులకు కేటాయించిన గ్రామాలలో జనసురక్ష పథకాలైన పిఎంజెడివై పిఎంజేజెబివై పిఎంఎస్‌బివై (%గ్రామీణ్%), అటల్ పింఛన్ యోజన లలో నమోదు ప్రక్రియను నిరంతరం కొనసాగించి, ఎక్కువ మంది లబ్ధిదారులను చేర్చాలని తెలిపారు.అదేవిధంగా రీ-కెవైసీ (%=వ-ఖ్జ%), ఆపరేటివ్ ఖాతాలు అంశాలపై కస్టమర్లకు అవగాహన కల్పించాలని, అలాగే కస్టమర్లు, ప్రభుత్వ శాఖలకు సంబంధించిన పెండింగ్ లో ఉన్న క్లెయిమ్ చేయని ఖాతాలను తక్షణమే క్లియర్ చేయాలని అన్ని బ్యాంకులకు సూచించారు. నాబార్డ్ ఏజీఎం కృష్ణ తేజ మాట్లాడుతూ, వ్యవసాయ మౌలిక వసతుల రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డు పశుపోషణ, మత్స్యకార రుణాలు వంటి రంగాల్లో అర్హులైన లబ్ధిదారులకు రుణాల మంజూరును పెంచాలని బ్యాంకర్లకు సూచించారు.

# అక్రెడిటేషన్స్ కొత్త జీ.ఓను సవరించాలి: TUWJ డిమాండ్




**హైదరాబాద్ డిసెంబర్23( సమయం న్యూస్).:** రెండు సంవత్సరాల తర్వాత తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టులకు కొత్త అక్రెడిటేషన్స్ జారీ చేయడం కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన జీ.ఓ నెంబర్ 252 పూర్తిగా లోపభూయి-ష్టంగా ఉందని టీ యూ డబ్ల్యూ జే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో యూనియన్ కోశాధికారి పి.యోగనంద్, టెంజు ప్రధాన కార్యదర్శి ఎ.రమణ కుమార్, ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు అవ్వారి భాస్కర్ లతో కలిసి ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల కనీస హక్కు, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా, జర్నలిస్టుల మధ్య విభేదాలు తెచ్చే విధంగా కొత్త జీ.ఓ ఉందని ఆయన అభిప్రాయ పడ్డారు. తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు అన్న నినాదంతో పనిచేసిన జర్నలిస్టులకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో 2014 మార్చి నెలలో జరిగిన జర్నలిస్టు జాతరకు వచ్చిన అప్పటి కాబోయే ముఖ్యమంత్రి కేసీఆర్ అందరి జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చుకుందామని ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఆయన సూచన మేరకు పూర్వ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 23 వేల మంది జర్నలిస్టులకు అక్రెడిటే షన్స్ కార్డ్స్ జారీ చేయడం జరిగిందని వారు అన్నారు. ప్రధానంగా డెస్క్ జర్నలిస్టులను కూడా గుర్తించి ఒకే గొడుగు కిందికి తెచ్చి అందరికీ కార్డులివ్వగా 40 ఏళ్ల నుంచి జర్నలిస్టుల సంక్షేమం కోసం పనిచేస్తున్నామని ప్రగల్భాలు పలుకుతూ రెండు రాష్ట్రాల్లో ఉండే ఒక సంఘం అప్పట్లో దీనిని వ్యతిరేకించిందని, నేడు వాళ్ళ యూనియన్ కు చెందిన జాతీయ నాయకుడే మీడియా అకాడమీ చైర్మన్ ఉండటంతో ఇప్పుడు డెస్క్ జర్నలిస్టులను వేరు చేసి వాళ్ళ పంతాన్ని నెగ్గించుకున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని డెస్క్ జర్నలిస్టులు నిశితంగా గమనించాలని కోరారు. మీడియా అక్రిడిటేషన్ కార్డు, మీడియా కార్డు పేరిట రెండు కార్డులు తెచ్చి గందరగోళం సృష్టించారని, ఏ కార్డు వల్ల ఏ ప్రయోజనం జరుగుతుందో జీవోలో విశదీకరించలేదని, జర్నలిస్టులనే వాళ్లకు అందరికీ ఒకే రకమైన ప్రయోజనాలు ఉండాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు ఏళ్ళు పూర్తవుతున్న నేపథ్యంలో కొత్తగా ఇవ్వబోయే కార్డుల కోసం కొత్త నిబంధనలు పెట్టి కార్డులలో 10 వేలకు పైగా కోత పెట్టె విధంగా ప్రస్తుత నిబంధనలు తెచ్చారన్నారు. ఈ నిబంధనలతో జర్నలిస్టులు తమ హక్కుగా పొందే అక్రెడిటేషన్స్ కార్డులను కోల్పోవడం అనివార్యం అన్నారు. రిపోర్టర్స్, డెస్క్ జర్నలిస్టులకు మధ్య విబేధాలు సృష్టించే విధంగా "మీడియా కార్డును" తేవాలని యోచించడం శోచనీయం అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ముఖ్యమంత్రి ఉన్న సమయంలో తీసుకు వచ్చిన జి.ఓ 239 ప్రకారం అప్పటి చైర్మన్ అల్లం నారాయణ కేబుల్ ఛానెల్ లకు రాష్ట్ర స్థాయిలో 12, జిల్లా స్థాయిలో నాలుగు అక్రెడిటేషన్స్ ఇవ్వగా ప్రస్తుత చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి కేబుల్ ఛానల్ పై కక్ష కట్టినట్లు రాష్ట్ర స్థాయిలో ఒక్క కార్డు కూడా ఇవ్వకుండా జీవో తేవడం వెనుక మర్మం ఏమిటో అర్థం కావటం లేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, సమాచార శాఖ మంత్రికి ప్రస్తుతం మీడియా అకాడమీ తో పాటు, ఆయన కొనసాగుతున్న సంఘం వారు తప్పుడు సమాచారం ఇవ్వడం వల్లే ఇలాంటి జీవో వచ్చి ఉంటుందని తాము భావిస్తున్నామని, రాష్ట్రంలోని మెజార్టీ జర్నలిస్టులు వ్యతిరేకించే ఈ జీవో ను వెంటనే పునః పరిశీలించి అర్హులైన అందరి జర్నలిస్టులకు అక్రిడిటేషన్ లు అందేలా నూతన జీఓను సవరించాలని డిమాండ్ చేశారు. తెంజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ కుమార్, కోశాధికారి యోగానంద్ లు మాట్లాడుతూ ఇండిపెండెంట్ జర్నలిస్టుల కనీస అనుభవం 10 సంవత్సరాలనుండి 15 సంవత్సరాల పెంచడం అన్యాయం అన్నారు. 23 వేల అక్రిడేషన్ కార్డులు ఇస్తే ఇక్కడ అర్హులకు కార్డులు ఇవ్వడం లేదని ఢిల్లీకి పోయి ధర్నా చేసిన ఆ ఆంధ్రా సంఘం నాయకులు ఇప్పుడు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. పెద్ద పేపర్లకు, శాటిలైట్ ఛానల్ లకు సైతం భారీ స్థాయిలో కోత విధించారని, అనుభవంలోకి వస్తే కానీ అందరికీ అర్థం కాని విధంగా ఈ జీవో ను తీసుకువచ్చారని అన్నారు. ఐ జేయు నాయకులు భాస్కర్ మాటాడుతూ మీడియా అక్రిడిటేషన్ కమిటీలో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులను ఎందుకు చేర్చారని ప్రశ్నించారు. ఢిల్లీలో ఒకపక్క పిసిఐ కమిటీయే కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని, అసలు ప్రస్తుతం సభ్యులే లేరని అలాంటప్పుడు ఎవరిని ఈ కమిటీలో సభ్యులుగా చేరుస్తారో అర్థం కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ నవీన్ కుమార్ యారా, జిల్లా అధ్యక్షులు రాకేష్ రెడ్డి, జిల్లా కోశాధికారి బాపూరావు తదితరులు పాల్గొన్నారు.

**27 న కలెక్టర్ కార్యాలయాల ముందు ఆందోళనలు...**

ప్రభుత్వం కొత్తగా తెచ్చిన జీ.ఓ 252 ను సవరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 27 అన్ని జిల్లా కేంద్రాల్లో కలెక్టర్ కార్యాలయాల ముందు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. అప్పటిలోపు ప్రభుత్వం జీఓ ను సవరించాలని తాము కోరుకుంటున్నామని, ఒకవేళ తాత్సారం చేస్తే రాజ్యాంగం కల్పించిన హక్కుగా ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ ప్రకటించారు.

## ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం



**మహబూబ్ నగర్ డిసెంబర్23( సమయం న్యూస్) :**అంతర్జాతీయ దివ్యాగుల దినోత్సవం -2025 ను మంగళవారం స్థానిక శిశుగృహ లో ఘనంగా నిర్వహిచారు,. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లలోని దివ్యా%శీ%గుల సమస్యలను చాలా వరకు పరిష్కరించినట్లు ,ఇంకా మిగిలిన వాటిని కూడా త్వరలో పరిష్కరిస్తామని అన్నారు.అనంతరం దివ్యాగుల క్రీడా పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు, సమాజానికి సేవ చేసిన దివ్యాగుల కు సన్మానం జరిగింది . ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి,, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని జరీనా, దివ్యా%శీ%గుల సంఘ నాయకులు , జిల్లాలోని దివ్యా%శీ%గులు పాల్గొన్నారు .

# విభాగాల మధ్య పరస్పర సమన్వయం ఉన్నప్పుడే మెరుగైన ఫలితాలు.

- సహోద్యోగులందరూ ఒకే కుటుంబంలా కలిసి పనిచేయాలి.
- విధి నిర్వహణలో క్రమశిక్షణ, సమన్వయం ముఖ్యం
- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా.



**వికారాబాద్, డిసెంబర్,23(సమయం న్యూస్) :** జిల్లా పోలీస్ కార్యాలయంలో పనిచేస్తున్న వివిధ విభాగాల పోలీస్ అధికారులు మరియు సిబ్బందితో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ప్రత్యేకంగా సమావేశమై 'దిశానిర్దేశం' చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని ప్రతి విభాగం పనితీరును, పెండింగ్‌లో ఉన్న దస్త్రాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సిబ్బంది విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సవాళ్లను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి సంబంధించి పలు కీలక సూచనలు మరియు సలహాలు అందించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో క్రమశిక్షణ అనేది అత్యంత ప్రధానమని, ప్రతి అధికారి సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. కార్యాలయానికి వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తించి, వారి సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విభాగాల మధ్య పరస్పర సమన్వయం ఉన్నప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయని, సహోద్యోగులందరూ ఒకే కుటుంబంలా కలిసి పనిచేయాలని సూచించారు.ముఖ్యంగా, నిరంతరం విధుల్లో ఉండే సిబ్బంది మానసిక ఒత్తిడికి గురి కాకుండా ఉండటానికి పనిని ప్రణాళికాబద్ధంగా విభజించుకోవాలని ఎస్పీ పేర్కొన్నారు. ఆధునిక సాంకేతి కతను అందిపుచ్చుకుంటూ, విధుల్లో పారదర్శకతను పెంచా లని పిలుపునిచ్చారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా, ఉత్సాహవంతమైన వాతావరణంలో పనిచేసినప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమని ఆమె ఈ సందర్భంగా వివరించారు.అనంతరం ఎస్పీ జిల్లా పోలీస్ కార్యలయం లోని వివిధ విభగాలను పరిశీలించడం జరిగింది. జిల్లా అదనపు ఎస్పీ బి.రాములు నాయక్ , డిసిఆర్‌బి డిఎస్‌పి జానయ్య , ఏఓ ఖాజా మోహినోద్దీన్ ,ఆర్ఐ డేవిడ్ విజయ్ కుమార్ ,డిపిఓ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# కొడంగల్ డిగ్రీ కళాశాల లో జాతీయ వినియోగదారుల దినోత్సవం

**ముఖ్య అతిథిగా పాల్గొన్న అడ్వకేట్ రవీంద్ర నాయక్**




**కొడంగల్ మున్సిపల్, డిసెంబర్ 23(సమయం న్యూస్)**

డిగ్రీ కళాశాల, జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్థిక శాస్త్ర విభాగం మరియు వాణిజ్యశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్నిఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొడంగల్ అడ్వకేట్ రవీందర్ నాయక్ హాజరై మాట్లాడుతూ వినియోదారుల చట్టాల గురించి కన్జ్యూమర్ ఫోరం 1986లో ఏర్పాటయిందని ఇది వినియోగదారుల యొక్క హక్కులు, బాధ్యతలు, మోసాల నివారణ, నాణ్యమైన వస్తువుల ఎంపిక వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా వస్తువుల యొక్క నాణ్యత సరిగా లేకపోయినా నాసి రకంగా ఉన్న వినియోగదారుడు కన్జ్యూమర్ ఫోరంను ఆశ్రయించి వినియోగదారుడు తగిన న్యాయం పొందవచ్చు అని పేర్కొన్నాడు.కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రఫియా ఖానం మాట్లాడుతూ ప్రతి వినియోగదారుడు తన హక్కులను తెలుసుకుని జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. వినియోగదారుల చట్టాలు సామాన్య ప్రజలకు రక్షణ కల్పిస్తాయని తెలిపారు. అనంతరం విద్యార్థులతో వినియోగదారుల హక్కులపై నినాదాలు చేయిస్తూ విద్యార్థులు కూడా ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రఫీయాఖానం ఐక్యూఎసి కోఆర్డినేటర్ టి. రాంబాబు అకడమిక్ కోఆర్డినేటర్ ఆర్ .శ్రీనివాస్ ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ హరిప్రియ అర్థశాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ జైపాల్ నాయక్ మరియు అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వంద శాతం గ్రౌండింగ్ లక్ష్యం

- మంజూరు అయిన ప్రతీ ఇల్లు నిర్మాణం
- ఇందిరమ్మ లబ్ధిదారుల ఖాతాలో వారం వారం చెల్లింపులో భాగంగా ఈ వారం రోజుల్లో జమ 6.46 కోట్ల రూపాయలు జమ
- 4,529 మంది లబ్ది దారులకు ఇప్పటికే సుమారుగా
- 90 కోట్ల రూపాయలు చెల్లింపులు హౌసింగ్ పీడీ మాణిక్యం



**మెదక్ డిసెంబర్23( సమయం న్యూస్).:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక పథకమైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో జిల్లాలో వివిధ దశల్లో ఉన్న 509 మంది లబ్ధిదారులకు ఈ వారం రోజులుల్లో 6.46 కోట్ల రూపాయలు లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్లో జమ అయినట్లు హౌసింగ్ పీడీ మాణిక్యం మంగళవారం ప్రకటనలో తెలిపారు.4,529 మంది లబ్ది దారులకు ఇప్పటికే సుమారుగా 90 కోట్ల రూపాయలు చెల్లింపులుజరిగాయన్నారు.

మెదక్ జిల్లా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై హౌసింగ్ పీడీ మాణిక్యం మాట్లాడుతూ గూడు లేని నిరుపేదలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నాణ్యతతో కూడిన ఇందిరమ్మ ఇంటిని లబ్ధిదారులు నాణ్యత తో నిర్మించుకోవాలన్నారు. వివిధ దశలలో నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.నిరుపేదలకు కనీస నివాస గృహం ఉండాలన్న సంకల్పం తో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణలు జిల్లా లో వంద శాతం త్వరగా పూర్తయ్య దిశగా ముందుకు పోతున్నామన్నారు.

# బృందావన్ గార్డెన్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న పరిగి ఎమ్మెల్యే



**పరిగి మున్సిపల్, డిసెంబర్,23(సమయం న్యూస్) :** పరిగి పట్టణంలోని బృందావన్ గార్డెన్‌లో ప్రభుత్వం తరపున నిర్వహించిన క్రిస్మస్ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి హాజరై వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ ప్రేమ, శాంతి, సోదరభావాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. పరిగి నియోజకవర్గంలోని క్రైస్తవ సోదరి-సోదరులకు ముందస్తుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం, ఆరోగ్యం, శాంతి కలగాలని ఆకాంక్షించారు.ప్రభుత్వం అన్ని మతాల పండుగలను సమానంగా గౌరవిస్తూ నిర్వహిస్తోందని, ఇలాంటి వేడుకలు సమాజంలో ఐక్యతను మరింత బలపరుస్తాయని ఆయన తెలిపారు. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రైస్తవ సంఘు నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# షాక్ సర్క్యూట్ తో కిరాణా కొట్టు దగ్ధం

- దాదాపు రూ.6 లక్షల విలువైన సామాగ్రి సరుకులు అగ్నికి ఆహుతి
- యాలాల మండలం ముద్దాయిపేట లో ఘటన



**యాలాల మండలం డిసెంబరు 23, (సమయం న్యూస్ :** షాక్ సర్క్యూట్ కారణంగా ఓ కిరాణా కొట్టు అగ్నికి ఆహుతి అయింది. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా యాలాల మండల పరిధిలోని ముద్దాయి పేట గ్రామంలో సోమవారం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన పోచన్న గారి వెంకటయ్య గౌడ్ మూడేళ్ల క్రితం తాండూరులోని ఎస్బిఐ బ్యాంకులో రూ.10 లక్షల వ్యాపార రుణంతో గ్రామంలో కిరాణా కొట్టు ఏర్పాటు చేసుకున్నాడు. కాగా ఎప్పటిలాగే తన కిరాణా కొట్టును సోమవారం రాత్రి మూసివేసి ఇంట్లో నిద్రించాడు. అర్ధరాత్రి వేళ షాక్ సర్క్యూట్ కారణంగా కిరాణా కొట్టు నుంచి భారీగా మంటలు వ్యాపించాయి.అప్రమత్తమైన వెంకటయ్య గౌడ్ స్థానికుల సహాయంతో మంటలను అదుపు చేశారు. కాగా అప్పటికే విలువైన వస్తువులతో పాటు కిరాణా సరుకులు భారీగా కాలిపోయి అగ్నికి ఆహుతి అయ్యాయి. కాలిపోయిన వంట సరుకులు సామాగ్రి విలువ సుమారు రూ.6 లక్షల వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు.బ్యాంకు రుణంతో జీవనోపాధి పొందుతున్న తరుణంలో ఈ సంఘటన తనను ఆర్థికంగా దెబ్బతీసిందని వాపోయాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

# రహదారి భద్రత పై ప్రజలకు అవగాహన.

**సిద్ధిపేట డిసెంబర్23( సమయం న్యూస్) :**రహదారి భద్రత నియమాలు ప్రజలకు అర్థమయ్యేలా రహదారి భద్రత మాసోత్సవాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో జిల్లాస్థాయి రహదారి భద్రత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రహదారి భద్రత నియమాలను సరిగా పాటించడం మూలంగా ఎక్కువ శాతం రహదారి ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2026 జనవరి 1 నుండి జనవరి 31 వరకు రహదారి భద్రత మాసోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందున జిల్లాలో కూడా ప్రజలకు, విద్యార్థులకు, యువకులకు, వాహనదారులకు, డ్రైవర్లకు రహదారి భద్రత నియమాల పై పూర్తిగా అవగాహన కలిగేలా వివిధ కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. జనవరి మొదటి వారంలో రహదారి భద్రత నియమాలపై అవగాహన, రెండవ వారంలో పాఠశాల మరియు కళాశాలల విద్యార్థుల ర్యాలీలు, మూడో వారంలో విద్యార్థులచే రహదారి భద్రతపై వ్యాసరచన, ఉపన్యాసం, పెయింటింగ్ తదితర పోటీలు, నాలుగో వారంలో డ్రైవర్లకు మెడికల్ క్యాంపు, యువత చే 2కె మరియు వన్ కే రన్, వాట్సాప్ లో స్టేటస్ పెట్టుకోవడం, సోషల్ మీడియాలో అవగాహన లాంటి కార్యక్రమాలను చేపట్టాలని, జిల్లాలోని అన్ని ముఖ్య కూడళ్లలో వివిధ కార్యక్రమాల ద్వారా రహదారి భద్రత అవగాహన కార్యక్రమాలు, బార్కోడ్ ప్రదర్శన తదర కార్యక్రమాలను చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్టిఏ కమిటీ సభ్యుడు సూర్య వర్మ, ఎంవిఐ వెంకటనారాయణ, డీఈఓ శ్రీనివాసరెడ్డి, సీఐ వాసుదేవరావు, ఆర్టీసీ డిపో మేనేజర్, ఆర్ అండ్ బి, వైద్య తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎలికట్ట భవాని మాతకు ప్రత్యేక పూజలు

**-- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**



**పరిగి, డిసెంబర్ 23(సమయం న్యూస్) :** పరిగి మండలం తొండపల్లి గ్రామ సర్పంచ్ గుర్రంపల్లి కృష్ణయ్య ఎలికట్ట భవాని మాత అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పరిగి మాజీ శాసనసభ్యులు కొప్పుల మహేష్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించి గ్రామ ప్రజల సుఖశాంతులు, సమృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమం అనంతరం నాయకులు గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమం పట్ల తమ నిబద్ధతను వ్యక్తం చేశారు. గ్రామంలోని ఆధ్యాత్మిక సంప్రదాయాలను కాపాడుతూ ఇలాంటి కార్యక్రమాలు కొనసాగడం అభినందనీయమని పాల్గొన్న నాయకులు తెలిపారు.

## నిర్మాణ పనులను వేగవంతం చేయాలి



**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**డిసెంబర్ 23,( సమయం న్యూస్).:** ప్రభుత్వ విద్యా సంస్థలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని కాసిపేట మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తుందని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ పోషక విలువలు కలిగిన మెనూ అమలు చేస్తుందని తెలిపారు. ఈ క్రమంలో విద్యాలయంలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం మండలంలోని దేవాపూర్ లో గల ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి రిజిస్టర్లు, తరగతి గదులు, వంటశాల, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడంతో పాటు శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. పాఠశాలలో చేపట్టిన మరమ్మత్తు పనులను వేగవంతం చేయాలని, గుత్తేదారుల సమన్వయంతో త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విధుల్లో అలసత్వం వహించిన వారి పై చర్యలు

● **జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**



**కామారెడ్డి డిసెంబర్23( సమయం న్యూస్).:** ఎం ఈ వో లు, ఉపాధ్యాయులు విధుల్లో అలసత్వాన్ని సహించేది లేదని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం జరిగిన ఎంఈఓ లు కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు రివ్యూ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విధులకు సెలవు పెట్టకుండా సెలవు అప్రూవల్ చేయకుండా గైర్హాజరయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఎఫ్ ఆర్ ఎస్ లో ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరు కచ్చితంగా మెరుగుపడాలని ఆయన ఆదేశించారు 20% కంటే ఎక్కువగా ఒకరోజు లీవ్ లో గాని ఆప్షన్ లో గానీ ఉండకూడదని ఈ విషయంలో మండల విద్యాధికారులు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని ఆయన సూచించారు. పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని అందుకుగాను ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఆయన కోరారు. విద్యార్థుల హాజరుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఏం ఈ వో లను ఆదేశించారు. ముఖ్యంగా జిల్లాలో ఉపాధ్యాయులు విద్యార్థులు హాజరులో, పదవ తరగతి పరీక్షలలో వెనుకబడిన జుక్కల్ పై ప్రత్యేక శ్రద్ధ వహించి, యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని ఆయన సూచించారు. ఇందుకు గాను జుక్కల్ కోసం ఒక విద్యాశాఖ కు చెందిన ప్రత్యేక అధికారిని నియమించాలని ఆయన సూచించారు. ప్రత్యేక తరగతుల ఫోటోలను తనకు షేర్ చేయాలని ఆయన సూచించారు. అదేవిధంగా తరచూ రోడ్ ప్రమాదాలలో విద్యార్థులు గాయపడుతుండడం పై ఆయన ఆందోళన వ్యక్త చేశారు.వ విద్యార్థుల భద్రతకు ప్రాముఖ్యత ఇవ్వాలని ఆయన కోరారు. ఆటో లలో 6 గురు విద్యార్థుల కంటె ఎక్కువ మంది విద్యార్థులను పంపవద్దని , ఈ విషయం లో తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలని ఆయన కోరారు. అవసరమైన చోట బాలికలకు శౌచాలయలను నిర్మాణ చేపట్టాలని, భవిత సెంటర్ ల నిర్మాణ పనులు తొందరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశం లో %నవశీ% రాజు, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలి

- ఆ దిశగా అధికారులు కార్యాచరణ కొనసాగించాలి.
- అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాలి.
- నర్వ యాస్పరేషన్ బ్లాక్ లో విస్తృతంగా పర్యటించిన కేంద్ర ప్రభారీ అధికారి స్వప్నాదేవి రెడ్డి.



**నర్వ మండలం, డిసెంబర్,23(సమయం న్యూస్) :** ప్రజల జీవన ప్రమాణాలను పెంచే దిశగా అధికారులు కార్యచరణను కొనసాగించాలని కేంద్ర ప్రభారీ అధికారి, స్వచ్ఛభారత్ మిషన్ డైరెక్టర్ స్వప్నా దేవి రెడ్డి సూచించారు. నారాయణపేట జిల్లాకు వచ్చిన ఆమె మంగళవారం జిల్లాలోని నర్వ యాస్పరేషన్ (బ్లాక్) మండలంలోని పెద్ద కడుమూరు, నర్వ, రాయికోడ్ గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లో పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాల్లో వసతులు, వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, మహిళల అభ్యున్నతికి చేపడుతున్న కార్యక్రమాలను పర్యవేక్షించారు. ముందుగా పెద్ద కడుమూరు గ్రామానికి చేరుకున్న కేంద్ర ప్రభారీ అధికారి అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించి కేంద్రంలో పిల్లల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. అంగన్ వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సరస్వతీ మాత విగ్రహానికి పూజలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేశారు. అక్కడే గ్రామానికి చెందిన గర్భిణీలకు చీర,గాజులు, పసుపు కుంకుమ పెట్టీ శ్రీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్న ప్రాసన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నర్వ మండలం యాస్పరేషన్ బ్లాక్ కింద 2023 లో ఎంపికైన తర్వాత అభివృద్ధి చెందింది అన్నారు. కానీ ఇంకా చాలా అభివృద్ధి చెందాలని, యాస్పిరేషన్ బ్లాక్ స్టేట్ ర్యాంకింగ్ లో మూడో స్థానం నుంచి మొదటి స్థానం చేరుకోవాలని ఆకాంక్షించారు. అయితే అందుకు ప్రజల సంపూర్ణ సహకారం అవసరం అని అన్నారు. గ్రామంలో వైద్య పరీక్షలు చేస్తున్నారా ?. మీ పిల్లలందరూ చదువుకుంటున్నారా ? ప్రతీ ఇంటికి తాగునీరు సరఫరా అవుతుందా అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత పక్కనే ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లి విద్యార్థుల సంఖ్య, పాఠశాలలో వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. అదే ఆవరణ లోనే ఉన్న ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న డిజిటల్ క్లాస్ ను, ఉన్నత పాఠశాలకు చెందిన సైన్స్ ల్యాబ్ ను, ల్యాబ్ లో ఆధునాతన పరికరాలను, త్రీ డీ ప్రింటర్ ను ఆసక్తిగా పరిశీలించారు. పాఠశాలలో కొనసాగుతున్న బయో సైన్స్ ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని పరిశీలించి, విద్యార్థులు నేర్చుకుంటున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వండుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించా లన్నారు. అదే గ్రామంలోని పల్లె దవాఖాన కు వెళ్లి గ్రామస్థులకు చేసే వివిధ రకాల వైద్య పరీక్షల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం నర్వ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను, రాయికోడ్ లోని మోడల్ అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలో చిన్నారుల ఆట పాటలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రంలో ఆట వస్తువులను, కిచెన్ గార్డెన్ ను చూశారు. చివరగా ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి విద్యార్థుల సంఖ్యా వివరాలు, పాఠశాలకు తాగునీటి సరఫరా అయ్యే ట్యాంక్ ను పరిశీలించారు. ఏమైనా సమస్యలు ఉంటే విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేసుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ మొగులప్ప, డీఈఓ గోవిందరాజులు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ఈశ్వర్ రెడ్డి, హౌసింగ్ పీడీ శంకర్ నాయక్, నర్వ తహసిల్దార్ మల్లారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, పెద్ద కడుమూరు సర్పంచి గోవింద్, యాస్పరేషన్ బ్లాక్ సమన్వయ కర్త బాలాజీ, వ్యవసాయ శాఖ అధికారిని, సీడీపీవో, ఎంపివోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కిన్నెరసాని ప్రకృతి సౌందర్యాన్ని ప్రపంచానికి తెలియజేయాలి

**-జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



**పాల్వంచ డిసెంబర్23( సమయం న్యూస్).:** కిన్నెరసాని ప్రకృతి సౌందర్యాన్ని ప్రపంచానికి తెలియజేయాలి అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు. ఏరు రివర్ ఫెస్టివల్లో భాగంగా మంగళవారం ఆళ్లపల్లి మండలం రాయపాడు గ్రామం నుండి మొతలగూడెం వరకు కిన్నెరసాని రివర్ వాక్ కార్యక్రమాన్ని విజజయవంతంగా నిర్వహించారు. ఉదయం 8.00 గంటలకు ప్రారంభమైన ఈ రివర్ వాక్లో యువత పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొని, కిన్నెరసాని నది పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, నదుల ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్వయంగా, ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, యువతతో కలిసి రివర్ వాక్లో పాల్గొని వారితో మమేకమయ్యారు. నది తీర ప్రాంతాల వెంట సాగిన ఈ వాక్ సందర్భంగా జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి ఉన్న విస్తృత అవకాశాలు, కిన్నెరసాని నది పరిసర ప్రాంతాల సహజ సంపద, అలాగే జిల్లాలోని వివిధ పర్యాటక ప్రాంతాల విశిష్టతను యువతకు కలెక్టర్ వివరించారు. జిల్లాలో ఉన్న అటవీ ప్రాంతాలు, నదులు, జలపాతాలు, ప్రకృతి వనరులు పర్యాటకులను ఆకర్షించే సామర్థ్యం కలిగి ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ విధంగా జిల్లాలోని వివిధ పర్యాటక ప్రాంతాల ప్రత్యేకతలను యువతకు వివరిస్తూ రివర్ వాక్ కార్యక్రమం ముందుకు సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కిన్నెరసాని నది జిల్లా జీవనాధారంగా ఉండటంతో పాటు పర్యావరణ సమతుల్యతకు కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. నది చుట్టూ ఉన్న పచ్చని అడవులు, సహజ వనరులు, జీవ వైవిధ్యం భవిష్యత్ తరాలకు కాపాడాల్సిన అమూల్యమైన సంపద అని తెలిపారు. ఈ ప్రకృతి సౌందర్యాన్ని సంరక్షించుకుంటూనే దేశ విదేశాలకు పరిచయం చేస్తే జిల్లాలో పర్యాటక రంగం మరింతగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఏరు రివర్ ఫెస్టివల్ ప్రధాన లక్ష్యం జిల్లాలోని నదుల, పర్యావరణ పరిరక్షణతో పాటు పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడమేనని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందితే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, రవాణా, స్థానిక ఉత్పత్తుల విక్రయాల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని వివరించారు. యువత సోషల్ మీడియా, డిజిటల్ వేదికల ద్వారా కిన్నెరసాని నది ప్రకృతి అందాలు, జిల్లాలోని పర్యాటక ప్రాంతాల విశిష్టతను ప్రపంచానికి తెలియజేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఫోటోగ్రఫీ, వీడియోలు, డాక్యుమెంటరీలు, రీల్స్, బ్లాగుల ద్వారా ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేలా కృషి చేయాలని సూచించారు. అదే సమయంలో నదులను కాలుష్యరహితంగా ఉంచడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధి దిశగా, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడేలా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు

ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి యం. పరంధామ రెడ్డి, స్థానిక అల్లపల్లి మండల ఎంపీడీవో శ్రీను, తహసిల్దార్ జగదీశ్వర ప్రసాద్, ఎంఈఓ సంతా రావు, కృష్ణయ్య, గ్రామ సర్పంచ్ చిన్న పాపయ్య, పంచాయతే సెక్రెటరీ వరుణ్, టి ఎన్జీవోస్ ఉద్యోగ సంఘాల నాయకులు భార్గవ్ చైతన్య, అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ మహిధర్, నాగేంద్ర, ఆర్చెరీ కోచ్ కల్యాణ్, సైకిలింగ్ నాగేశ్వర రావు, ఉదయ్ కుమార్, టైక్వాండో రమేశ్, ఎన్సిసి, ఎన్ఎస్ఎస్, స్థానిక యువత, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## మాతాశిశు సంరక్షణకు అంకిత భావంతో కృషి చేయాలి

**కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి**



**నిజామాబాద్, డిసెంబర్ 23 ( సమయం న్యూస్).:** మాతా శిశు సంరక్షణే ధ్యేయంగా వైద్యులు, సిబ్బంది అంకిత భావంతో కృషి చేయాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. ప్రసవాల సందర్భంగా మాతాశిశు మరణాలు చోటుచేసుకోకుండా ముందస్తుగానే క్రమం తప్పకుండా వైద్య సేవలు అందిస్తూ, నిశిత పర్యవేక్షణ జరపాలని అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి మాతా శిశు మరణాల నిరోధక కమిటీ సమావేశం జరిగింది. ఇటీవలి కాలంలో జిల్లాలో చోటుచేసుకున్న మాతాశిశు మరణాలపై ఒక్కో సంఘటన వారీగా కలెక్టర్ సవివరంగా విచారణ జరిపారు. ఏ ఆసుపత్రిలో సంఘటన చోటుచేసుకుంది, మరణం సంభవించడానికి దారి తీసిన పరిస్థితులు ఏమిటీ, వైద్య సేవలలో ఏమైనా లోపం జరిగిందా అని వివరాలు ఆరా తీస్తూ, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. మాతాశిశు మరణాలు జరగకుండా ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడ సంఘటన జరిగినా లోతుగా పరిశీలన జరుపుతామని, నిర్లక్ష్యం కారణంగా మరణం సంభవించినట్టు వెల్లడి అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. గర్భిణీలకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరుపుతూ, అవసరమైన వైద్య చికిత్సలు అందించాలని సూచించారు. వారు పుట్టింటికి వెళ్ళిన పక్షంలో వారి హెల్త్ రికార్డును అక్కడి అధికారులకు పంపాలని, క్షేత్రస్థాయిలో ఆశాలు, అంగన్వాడీలు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, నర్సింగ్ హోంలలో తప్పనిసరిగా తగిన పరిజ్ఞానం కలిగిన నిపుణులైన వైద్యులు, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, వైద్య పరీక్షలు, చికిత్సలు అందించే విషయంలో ఎలాంటి లోపం జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా రక్త హీనత, బీ.పీ పరీక్షలు క్రమం తప్పకుండా చేయాలని, అవసరమైన వారికి మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తూ, ఎంతో విలువైన నిండు ప్రాణాలు కాపాడాలని సూచించారు. అంతకుముందు గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టంపై జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని నిబంధనలు పాటిస్తూ, తగిన అర్హతలు ఉన్న స్కానింగ్ కేంద్రాలకు మాత్రమే రిజిస్ట్రేషన్, రెన్యూవల్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. స్కానింగ్ ద్వారా పుట్టబోయే శిశువు ఆడ లేదా మగా అని లింగ నిర్ధారణ చేస్తే, పీసీపీఎన్డీటీ చట్టం ప్రకారం వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లకు అనుమతుల జారీ, రెన్యువల్ చేసే సమయంలో పార్కింగ్, ఫైర్ సేఫ్టీ అనుమతులు ఉన్నాయా లేవా అన్నది పక్కాగా పరిశీలించాలని సూచించారు. సంబంధిత శాఖల నుండి నిరభ్యంతర పత్రాలు తెచ్చిన వారికి మాత్రమే అనుమతులు, రెన్యువల్ చేయాలన్నారు. ఈ సమావేశాలలో అదనపు కలెక్టర్ అంకిత్, అదనపు డీసీపీ బస్వారెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్ బీ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, జిల్లా అగ్ని మాపక శాఖ అధికారి పరమేశ్వర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ రవీందర్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్వేత, కమిటీ సభ్యుడు బుస్స ఆంజనేయులు, సైకియాట్రిస్ట్ డాక్టర్ విశాల్, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, సంబంధిత వైద్యాధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 13 నుంచి టాలీవుడ్ ప్రో లీగ్



తెలుగు సినీ, క్రీడాభిమానులకు ఇదో డబుల్ బొనాంజా న్యూస్. ఒకేసారి ఇటు సినీ అభిమానులను అటు క్రికెట్ ఫ్యాన్స్‌ను అలరించే టీపీఎల్ టాలీవుడ్ ప్రొ లీగ్‌కు సర్వం సిద్ధమైంది. ప్రముఖులు పాల్గొనే ఈ టోర్నీ ఫిబ్రవరి 13 నుంచి హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో జరగనుంది. మాదాపూర్ హెచ్ఐసీసీలో ఆదివారం ఈ లీగ్ ట్రోఫీని, జెర్సీని సినీ, క్రికెట్ ప్రముఖులు ఆవిష్కరించారు. దిగ్గజ క్రికెటర్లు కపిల్ దేవ్, వీరేంద్ర సెహ్వాగ్, సురేశ్ రైనాలతో పాటు సినీ నిర్మాత దిల్ రాజు, నటుడు సోనూ సూద్, సంగీత దర్శకుడు తమన్, నటి రాశీ ఖన్నా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కపిల్ దేవ్, వీరేంద్ర సెహ్వాగ్, దిల్ రాజు, సోనూ సూద్ కలిసి స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్ ఆడారు. టాలీవుడ్.. క్రికెట్ పట్ల ఆసక్తి చూపడం అభినందనీయమన్నారు కపిల్‌దేవ్. హైదరాబాద్ అందమైన నగరమే కాదు, రుచికరమైన వంటకాలకు కేంద్రమని కొనియాడారు. సినీ నటులు, టెక్నీషియన్లు కలిసి క్రికెట్ లీగ్ ఆడటం మంచి పరిణామమన్నారు వీరేంద్ర సెహ్వాగ్. తెర మీద కనిపించే నటులతో పాటు తెర వెనుక ఉండి పని చేసేవారితో కలిసి టీపీఎల్ టోర్నీ జరుగుతుందన్నారు దిల్‌రాజు. ఆరు జట్లతో కూడిన ఈ ఫ్రాంచైజీ ఆధారిత లీగ్‌లో ప్రముఖ నిర్మాతలు జట్లకు యజమానులుగా వ్యవహరిస్తారని తెలిపారు.

# మహిళా క్రికెటర్ల మ్యాచ్ ఫీజులు భారీగా పెంపు




దేశవాళీ క్రికెట్‌లో మహిళా క్రికెటర్లకు బీసీసీఐ గుడ్ న్యూస్ చెప్పింది. మహిళా క్రికెటర్లు, మ్యాచ్ అధికారుల ఫీజులను రెట్టింపుకన్నా ఎక్కువగా పెంచింది. దీంతో క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకున్న అమ్మాయిల ఆర్థిక భద్రత మరింత బలపడనుంది. ఇటీవల భారత్ తొలిసారిగా మహిళల వన్డే ప్రపంచకప్‌ను గెలుచుకోవడం చారిత్రక ఘట్టంగా నిలిచిన నేపథ్యంలో కీలక నిర్ణయాన్ని బీసీసీఐ తీసుకుంది. ఈ పెంపుదలను బోర్డు అపెక్స్ కౌన్సిల్ అధికారికంగా ఆమోదం తెలిపింది. సవరించిన చెల్లింపు విధానం ప్రకారం మహిళల దేశవాళీ టోర్నీల్లో పాల్గొనే ఆటగాళ్లకు భారీగా ఫీజులు పెరిగాయి. సీనియర్ మహిళల దేశవాళీ వన్డే టోర్నమెంట్‌తో పాటు బహుళ రోజుల టోర్నీల్లో తుది జట్టులో చోటు దక్కించుకున్న ప్లేయర్లకు రోజుకు రూ.50 వేల మ్యాచ్ ఫీజు చెల్లించనున్నారు. ఇప్పటివరకు ఈ ఫీజు కేవలం రూ.20 వేలు మాత్రమే ఉండేది. ఇక రిజర్వ్ ఆటగాళ్లకు రోజుకు రూ.25 వేలు అందించనున్నారు. అంటే గతంతో పోలిస్తే రెట్టింపుకు పైగా పెరుగుదల నమోదైంది. అలాగే జాతీయ స్థాయి మహిళల టీ20 టోర్నీల్లోనూ ఫీజులు గణనీయంగా పెరిగాయి. ఈ టోర్నీల్లో తుది జట్టులో ఉన్న ఆటగాళ్లకు రోజుకు రూ.25 వేలు చెల్లిస్తారు. రిజర్వ్‌లకు రోజుకు రూ.12,500 ఇవ్వనున్నారు. ఈ విధంగా అన్ని ఫార్మాట్లలో ఆడే అగ్రశ్రేణి మహిళా క్రికెటర్లు ఒక సీజన్‌లో రూ.12 లక్షల నుంచి రూ.14 లక్షల వరకు సంపాదించే అవకాశం ఉందని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఇది మహిళా క్రికెటర్లకు పెద్ద ఊరటగా మారనుంది. యువ క్రికెటర్లను కూడా బీసీసీఐ మర్చిపోలేదు. అండర్-23, అండర్-19 విభాగాల్లో ఆడే మహిళా క్రికెటర్లకు కూడా మ్యాచ్ ఫీజులు పెంచింది. ఈ విభాగాల్లో తుది జట్టులో ఉన్న ఆటగాళ్లకు రోజుకు రూ.25 వేలు చెల్లించనున్నారు. రిజర్వ్ ఆటగాళ్లకు రోజుకు రూ.12,500 అందిస్తారు. చిన్న వయసులోనే క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకుంటున్న అమ్మాయిలకు ఇది మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుందని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మరోవైపు దేశవాళీ క్రికెట్‌లో కీలక పాత్ర పోషించే మ్యాచ్ అధికారుల ఆదాయాన్ని కూడా బీసీసీఐ పెంచింది. అంపైర్లు, రిఫరీలకు రోజుకు రూ.40 వేల మ్యాచ్ ఫీజు చెల్లించనున్నారు. ఇక నాకౌట్ మ్యాచ్‌లకు అయితే మ్యాచ్ ప్రాధాన్యతను బట్టి రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఫీజు ఉంటుంది. దీని ప్రకారం ఒక అంపైర్ రంజీ ట్రోఫీ లీగ్ మ్యాచ్‌కు సుమారు రూ.1.60 లక్షలు సంపాదిస్తారు. అదే నాకౌట్ మ్యాచ్‌లకు అయితే రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆర్జించే అవకాశం ఉంటుంది. మొత్తంగా చూస్తే మహిళల క్రికెట్‌కు బీసీసీఐ పెద్ద పీట వేస్తున్నట్లు ఈ నిర్ణయం స్పష్టంగా చెబుతోంది. మ్యాచ్ ఫీజుల పెంపుతో మహిళా క్రికెటర్లకు ఆర్థిక భరోసా పెరగడమే కాకుండా, దేశవాళీ స్థాయిలో మరిన్ని యువతులు క్రికెట్ వైపు ఆకర్షితులయ్యే అవకాశముందని విశ్లేషకులు చెబుతున్నారు. మహిళల ప్రపంచకప్ విజయం తర్వాత తీసుకున్న ఈ నిర్ణయం, భారత మహిళల క్రికెట్ భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మరోవైపు, ఇటీవల ముగిసిన అండర్-19 ఆసియా కప్‌లో ఆయుష్ మాత్రే నేతృత్వంలోని భారత జట్టు వరుసగా అన్ని మ్యాచ్‌లు గెలిచి కీలకమైన టైటిల్ పోరులో తడబడింది. పాకిస్థాన్‌తో జరిగిన ఫైనల్‌లో భారత్ 191 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. ఈ విషయాన్ని బీసీసీఐ సీరియస్‌గా తీసుకుంది. ఇటీవల అండర్-19 జట్టు ప్రదర్శనపై సోమవారం ఆన్‌లైన్‌లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో బోర్డు సభ్యులు చర్చించారు. టీమ్ పెర్ఫామెన్స్‌పై సమీక్ష అవసరమని నిర్ణయించారు.

## టీ20ల్లో వరల్డ్ రికార్డు సృష్టించిన ఇండోనేషియా బౌలర్



అంతర్జాతీయ టీ20 క్రికెట్ చరిత్రలో అపూర్వమైన ఘట్టం ఆవిష్కృతమైంది. ఇండోనేషియాకు చెందిన ఫాస్ట్ బౌలర్ గెడె ప్రియాందన ఒకే ఓవర్‌లో ఐదు వికెట్లు పడగొట్టి సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. టీ20 ఫార్మాట్‌లో ఇప్పటివరకు ఎవరికీ సాధ్యం కాని ఈ అద్భుత ఫీట్‌ను సాధించిన తొలి బౌలర్‌గా చరిత్రకెక్కాడు. బాలి వేదికగా కంబోడియాతో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో మంగళవారం ఈ సంచలనం చోటుచేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇండోనేషియా, ధర్మ కేసుమా అజేయ శతకం (110) సాయంతో 167 పరుగులు చేసింది. అనంతరం 168 పరుగుల లక్ష్య ఛేదనలో కంబోడియా 15 ఓవర్లు ముగిసేసరికి 5 వికెట్లకు 106 పరుగులతో ఫర్వాలేదనిపించింది. కానీ, 16వ ఓవర్ బౌలింగ్‌కు వచ్చిన ప్రియాందన మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. ప్రియాందన తన ఓవర్‌లోని తొలి మూడు బంతులకు 3 వికెట్లు తీసి హ్యాట్రిక్ నమోదు చేశాడు. నాలుగో బంతి డాట్ కాగా, చివరి రెండు బంతులకు మరో రెండు వికెట్లు పడగొట్టాడు. చివరి రెండు బంతుల మధ్య ఒక వైడ్ ఉండడంతో ఈ ఓవర్లో ఒక అదనపు పరుగు మాత్రమే వచ్చింది. దీంతో కంబోడియా 107 పరుగులకే ఆలౌట్ కాగా, ఇండోనేషియా 60 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఇంతకుముందు టీ20ల్లో లసిత్ మలింగ, రషీద్ ఖాన్, జేసన్ హెూల్డర్ వంటి దిగ్గజాలు ఒకే ఓవర్‌లో నాలుగు వికెట్లు తీసిన సందర్భాలు ఉన్నప్పటికీ, ఐదు వికెట్లు తీయడం ఇదే తొలిసారి. ప్రియాందన అసాధారణ ప్రదర్శన ప్రస్తుతం క్రికెట్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది.

## చరిత్ర సృష్టించిన దీప్తి శర్మ..




మంగళవారం విడుదలైన ఐసీసీ మహిళల టీ20ఐ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ ఆల్ రౌండర్ దీప్తి శర్మ నంబర్ వన్ బౌలర్‌గా నిలిచింది. ఇదిలా ఉండగా, బ్యాట్స్‌మెన్ వన్డే ర్యాంకింగ్స్‌లో స్మృతి మంధాన నంబర్ వన్ స్థానాన్ని కోల్పోయింది. దీప్తి శర్మ తొలిసారిగా టీ20ఐ అంతర్జాతీయ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ బౌలర్‌గా నిలిచింది.
విశాఖపట్నంలో శ్రీలంకతో జరిగిన టీ20ఐ సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌లో 4 ఓవర్లలో కేవలం 20 పరుగులు మాత్రమే ఇచ్చి 1 వికెట్ తీసిన దీప్తి, ఆస్ట్రేలియాకు చెందిన అన్నాబెల్ సదర్లాండ్‌ను అధిగమించి టాప్ బౌలర్‌గా నిలిచింది. ఇదిలా ఉండగా, దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో తిరిగి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఐర్లాండ్‌తో జరిగిన స్వదేశీ వన్డే సిరీస్‌లో చివరి రెండు మ్యాచ్‌లలో సెంచరీలు చేసిన వోల్వార్ట్‌కు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు కూడా లభించింది. ఈ ప్రదర్శనతో, వోల్వార్ట్ తన కెరీర్‌లో అత్యుత్తమ రేటింగ్‌ను సాధించింది. స్మృతి మంధానను అధిగమించి నంబర్ 1 స్థానాన్ని ఆక్రమించింది. నిజానికి, లారా వోల్వార్ట్ ఇంతకు ముందు కూడా ఈ స్థానాన్ని ఆక్రమించింది. అంతేకాకుండా, శ్రీలంకపై అజేయ అర్ధ సెంచరీ సాధించిన జెమిమా రోడ్రిగ్స్, టీ20 బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో ఐదు స్థానాలు ఎగబాకి టాప్ 10కి చేరుకుంది, తొమ్మిదవ స్థానానికి చేరుకుంది. ఆమెతో పాటు స్మృతి మంధాన మూడవ స్థానంలో, షఫాలి వర్మ పదవ స్థానంలో ఉన్నారు. అదే సమయంలో, బౌలింగ్‌లో, అరుంధతి రెడ్డి కూడా ఐదు స్థానాలు ఎగబాకి 36వ స్థానానికి చేరుకుంది.




# విజయ్ హజారే ట్రోఫీలో కోహ్లీ, రోహిత్..

ప్రతిష్టాత్మక దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీకి రంగం సిద్ధమైంది. బుధవారం నుంచి ఈ టోర్నీకి తెరలేవనుంది. 15 ఏళ్ల సుదీర్ఘ సమయం తర్వాత భారత క్రికెట్ దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఈ టోర్నీ బరిలోకి దిగుతున్నారు. న్యూఢిల్లీ తరపున విరాట్ కోహ్లీ, ముంబై తరపున రోహిత్ ఆడనున్నారు. ఇప్పటికే ఈ ఇద్దరు ఆటగాళ్లు ఆయా జట్లతో కలిసి సన్నాహకాలు మొదలుపెట్టారు. ఈ ఇద్దరూ తమ జట్ల తరపున తొలి రెండు మ్యాచ్‌లు ఆడనున్నారు. కోహ్లీ, రోహిత్ శర్మతో పాటు రిషభ్ పంత్ (ఢిల్లీ కెప్టెన్), శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, అర్ష్‌దీప్ సింగ్ (పంజాబ్), మహమ్మద్ షమీ (బెంగాల్), హార్దిక్ పాండ్యా (బరోడా) వంటి స్టార్ ఆటగాళ్లు కూడా తమ రాష్ట్ర జట్ల తరపున బరిలోకి దిగుతున్నారు. అంతర్జాతీయ మ్యాచ్‌లు లేని సమయంలో సెంట్రల్ కాంట్రాక్ట్ ఉన్న ఆటగాళ్లు తప్పనిసరిగా దేశవాళీ క్రికెట్ ఆడాలని బీసీసీఐ తెచ్చిన కొత్త నిబంధన కారణంగా భారత ఆటగాళ్లు బరిలోకి దిగుతున్నారు. దాంతో ఈ టోర్నీకి క్రేజ్ నెలకొంది. డిసెంబర్ 24 నుంచి జనవరి 18 వరకు ఈ టోర్నీ జరగనుంది. జనవరి 12 నుంచి నాకౌట్ మ్యాచ్‌లు జరగనుండగా.. జనవరి 18న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. మొత్తం 38 జట్లు బరిలోకి దిగుతున్నాయి. బెంగళూరు వేదికగా ఆంధ్ర జట్టుతో ఢిల్లీ తొలి మ్యాచ్ ఆడనుంది. ఆంధ్ర జట్టుకు ఆల్‌రౌండర్‌గా నితీష్ కుమార్ రెడ్డి కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. అయితే ఈ మ్యాచ్‌కు ప్రేక్షకుల అనుమతి లేదు. ఐపీఎల్ 2025 సీజన్ విజయానంతరం చిన్నస్వామి స్టేడియం బయట జరిగిన తొక్కిసలాట నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. కనీసం 2000 నుంచి 3000 మంది అభిమానులను అయినా లోపలికి అనుమతించాలని కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ కోరగా.. రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించింది. క్రిస్మస్ సెలవుల నేపథ్యంలో అభిమానులు భారీగా తరలివచ్చే అవకాశం ఉండటంతో భద్రతా కారణాల రీత్యా అనుమతి నిరాకరించారు. ఈ మ్యాచ్ వేదికను కూడా చిన్నస్వామి నుంచి బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు తరలించారు. విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లు స్టార్ స్పోర్ట్స్‌తో పాటు జియో హాట్ స్టార్ వేదికగా ప్రసారం కానున్నాయి. లీగ్ దశలో అన్ని మ్యాచ్‌లకు ప్రత్యక్ష ప్రసారం లేదు. కేవలం అహ్మదాబాద్, రాజ్‌కోట్ వేదికగా జరిగే మ్యాచ్‌లు మాత్రమే ప్రత్యక్ష ప్రసారం కానున్నాయి. దాంతో కోహ్లీ, రోహిత్ మ్యాచ్‌లను చూసే అవకాశం అభిమానులకు లేకుండా పోయింది. 38 జట్లు ఉండటం.. ఒకే రోజు 19 మ్యాచ్‌లు ఒకే సమయంలో ప్రారంభం కానుండటంతో బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. నాకౌట్ మ్యాచ్‌లు ప్రత్యక్ష ప్రసారం కానున్నాయి.




## భారత ఆటగాళ్లపై ఐసీసీకి ఫిర్యాదు!

అండర్ 19 ఆసియా కప్ ఫైనల్లో భారత కుర్రాళ్లు నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించారని, వారిపై ఐసీసీకి ఫిర్యాదు చేస్తామని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) ఛైర్మన్ మోహ్సిన్ నఖ్వీ తెలిపారు. ఐసీసీ రూల్స్ ప్రకారం రాజకీయాలకు క్రికెటర్లు దూరంగా ఉండాలని, కానీ భారత ఆటగాళ్లు తమ పట్ల అనుచితంగా ప్రవర్తించారని నఖ్వీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మైదానంలో కూడా తమ ఆటగాళ్లను తరుచూ రెచ్చగొట్టారని తెలిపారు. భారత ఆటగాళ్లపై అధికారికంగా ఐసీసీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఆదివారం జరిగిన అండర్ 19 ఆసియాకప్ 2025 ఫైనల్లో పాకిస్థాన్ అండర్ 19 టీమ్ 191 పరుగుల భారీ తేడాతో భారత్‌ను చిత్తు చేసిన సంగతి తెలిసిందే. ఈ విజయం నేపథ్యంలో సోమవారం ఇస్లామాబాద్‌లో ప్రధాని షెహ్‌బాజ్ షరీఫ్‌ను పాకిస్థాన్ అండర్ 19 టీమ్ కలిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మోహ్సిన్ నఖ్వీ అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. భారత ఆటగాళ్ల తీరును తప్పుబట్టాడు. ఫైనల్ అనంతరం మోహ్సిన్ నఖ్వీ చేతుల మీదుగా రన్నరప్ మెడల్స్ స్వీకరించేందుకు భారత అండర్ 19 టీమ్ ఆటగాళ్లు నిరాకరించారు. దాంతో ఐసీసీ అసోసియేట్ డైరెక్టర్ ముబష్శిర్ ఉస్మానీ చేతుల మీదుగా భారత ఆటగాళ్లు మెడల్స్ అందుకున్నారు. ఈ ఘటనపై నఖ్వీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రధానితో సమావేశం అనంతరం నఖ్వీ భారత ఆటగాళ్లపై మండిపడ్డాడు. సీనియర్ ఆటగాళ్ల ఆసియా కప్ సందర్భంగా కూడా నఖ్వీ చేతుల మీదుగా టైటిల్ అందుకునేందుకు భారత ఆటగాళ్లు నిరాకరించారు. దాంతో నఖ్వీ ట్రోఫీని తన వెంట తీసుకెళ్లాడు. ఇప్పటి వరకు భారత్‌కు అందజేయలేదు. ఈ ఘటనపై ఇరు జట్లు ఐసీసీకి ఫిర్యాదు చేశాయి. భారత ఆటగాళ్ల వ్యవహార శైలిని పాకిస్థాన్ అండర్ 19 టీమ్ మెంటార్ సర్ఫరాజ్ అహ్మద్ కూడా తప్పుబట్టాడు. భారత కుర్రాళ్లు క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించారని మండిపడ్డాడు. 'గతంలో మేం క్రికెట్‌ను గౌరవించే భారత జట్టుతో ఆడాం. కానీ ఈ కుర్రాళ్లు ప్రవర్తించిన తీరు అగౌరవంగా ఉంది. గెలుపు సంబరాలు గౌరవప్రదంగా ఉండాలని నేను మా ఆటగాళ్లకు చెప్పాను. మా కుర్రాళ్లు ఈ ఫార్మాట్‌లో తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవాలని నేను ఆశించాను. మా ఆటగాళ్లకు నేను చెప్పింది ఒక్కటే.. మీ మీద మీరు నమ్మకం ఉంచండి, ప్రత్యర్థులు ఏం చేసినా పట్టించుకోవద్దని చెప్పాను. క్రీడల పట్ల భారత్ తీరు సరిగ్గా లేదు. ఈ టోర్నీలో భారత జట్టు ప్రవర్తించిన తీరు అనైతికం. మేం అయితే క్రీడాస్ఫూర్తితోనే విజయ సంబరాలు జరుపుకున్నాం. భారత్ ఏం చేసింది అనేది వారి స్వయంకృతం.' అని సర్ఫరాజ్ అహ్మద్ అన్నాడు.





# శివాజీ వ్యాఖ్యల రచ్చ

## దులిపేసిన సింగర్ చిన్మయి... మా బాడీ..మా ఇష్టం అన్న అనసూయ

## శివాజీ తరపునే నేను క్షమాపణలు చెబుతున్నా: మనోజ్

నటుడు శివాజీ వ్యాఖ్యలపై సింగర్ చిన్మయి సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు. హీరోయిన్లు చీరలు కట్టుకోవాలని, లేదంటే వారి 'సామాన్లు' కనిపిస్తాయని శివాజీ అనడాన్ని చిన్మయి తప్పుబట్టింది. ముఖ్యంగా 'దరిద్రపు ము?' వంటి బూతు పదాలను ప్రొఫెషనల్ వేదికలపై వాడటం ఏంటని శివాజీని ప్రశ్నించింది. సామాన్లు వంటి పదాలను కేవలం 'ఇన్సెల్స్' (స్త్రీ ద్వేషులు) మాత్రమే వాడుతుంటారని ఆమె విమర్శించింది. అంతేగాకుండా హీరోయిన్లు భారతీయ సంప్రదాయం పాటించాలని చెప్పిన శివాజీ.. తాను మాత్రం జీన్స్, హూడీలు ధరిస్తారు. సంప్రదాయం గురించి అంతగా మాట్లాడేటప్పుడు ఆయన కేవలం ధోతీలు మాత్రమే కట్టుకోవాలి కదా? నుదుట బొట్టు పెట్టుకోవాలి, వివాహం అయినట్లు గుర్తుగా కంకణాలు, మెట్టెలు ధరించాలి కదా? అంటూ చిన్మయి ప్రశ్నించింది. ఒక సినిమాలో విలన్‌గా నటించిన శివాజీ.. బయట ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ద్వారా స్త్రీలను ద్వేషించే వ్యక్తులకు హీరోగా మారుతున్నారని ఆమె ఎద్దేవా చేసింది. ఒక బహిరంగ వేదికపై మహిళల పట్ల ఇలాంటి ప్రవర్తన ఉండటం నమ్మశక్యంగా లేదని, అసలు మహిళలను ఇక్కడ ఎలా చూస్తున్నారో అర్థమవుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. చిన్మయి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట చర్చకు దారితీశాయి. నటుడు శివాజీ వ్యాఖ్యలపై ఇప్పటికే సింగర్ చిన్మయి స్పందించగా.. తాజాగా యాంకర్, నటి అనసూయ కూడా శివాజీకి గట్టి కౌంటర్‌ను ఇచ్చింది. అనసూయ ఎక్స్ వేదికగా పోస్ట్ పెడుతూ.. ఇది మా బాడీ.. మీది కాదు. మాకు నచ్చినట్లు మేం ఉంటాం అంటూ శివాజీకి కౌంటర్ ఇచ్చారు. మహిళలకు తమకు నచ్చిన దుస్తులు వేసుకునే స్వేచ్ఛ ఉందని, వారి వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకోవడం తప్పని శివాజీ వ్యాఖ్యలను పలువురు తప్పుపట్టారు. ఈ వ్యాఖ్యలను తప్పుబడుతూ ఇప్పటికే సింగర్ చిన్మయి, అనసూయ శివాజీని విమర్శించగా.. తాజాగా మంచు మనోజ్ కూడా శివాజీ పేరు ఎత్తకుండానే ఆయనకు గట్టి కౌంటర్ ఇచ్చారు. మహిళలను కించపరిచేలా మాట్లాడటం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని మనోజ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా ఒక లేఖ విడుదల చేశాడు. మహిళల దుస్తుల విషయంలో నీతులు చెప్పడం, వారిపై నైతిక బాధ్యత లేదు అని ఆరోపించడం అనేది చాలా పాత కాలపు ఆలోచన. ఇలాంటి వ్యాఖ్యలు తనను తీవ్ర నిరాశను కలిగించాయని మనోజ్ పేర్కొన్నారు. సమానత్వం, గౌరవం, వ్యక్తిగత స్వేచ్ఛ అనేవి చర్చించలేని అంశాలని మహిళల బట్టలపై తీర్పు ఇచ్చే అధికారం ఎవరికీ లేదని ఆయన తేల్చి చెప్పారు. మహిళలను కించపరిచేలా వస్తువులుగా చూస్తూ మాట్లాడిన ఆ సీనియర్ నటుడి తరపున నేను క్షమాపణలు చెబుతున్నాను. పబ్లిక్ ఫిగర్స్‌గా ఉన్నవారు సమాజంపై తమ మాటల ప్రభావం ఉంటుందని గుర్తించి బాధ్యతగా మాట్లాడాలని ఆయన హితవు పలికారు. హిళలకు ఎప్పుడూ గౌరవం, సమానత్వం దక్కాలి. ఇలాంటి విషయాల్లో మౌనంగా ఉండటం సరైన పద్ధతి కాదు. మనోజ్ కుమార్ తన పోస్ట్‌ను ముగించాడు.

# సీఐడీ విచారణకు మంచు లక్ష్మి

## బెట్టింగ్ యాప్‌ల ప్రచార వ్యవహారం



నిషేధిత బెట్టింగ్ యాప్‌ల ప్రచార వ్యవహారానికి సంబంధించి సినీ నటి మంచు లక్ష్మి మంగళవారం హైదరాబాద్‌లోని సీఐడీ విచారణకు హాజరయ్యారు. లక్డీకపూల్‌లోని సీఐడీ కార్యాలయానికి చేరుకున్న ఆమెను ఈ యాప్‌లను ప్రమోట్ చేసినందుకు గానూ అందిన పారితోషికం మరియు కమీషన్ల లావాదేవీలపై అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నిస్తున్నారు. గతంలోనే ఇదే కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా ఆమెను విచారించగా, ఇప్పుడు సీఐడీ అధికారులు మరిన్ని వివరాలను సేకరిస్తున్నారు. కాగా, ఇదే వ్యవహారంలో గతంలో టాలీవుడ్ ప్రముఖ నటులు విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి, ప్రకాశ్‌రాజ్ వంటి వారు కూడా విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. సెలబ్రిటీల ప్రచారం కారణంగా సామాన్యులు ఈ బెట్టింగ్ యాప్‌ల బారిన పడుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో దర్యాప్తు సంస్థలు ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి.



# రష్మికకు మెంటలెక్కిపోయిందా?



రౌడీ హీరో విజయ్‌దేవరకొండ నటిస్తున్న లేటెస్ట్ క్రేజీ మూవీ -రౌడీ జనార్ధన-. రవి కిరణ్ కోలా దర్శకుడు. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు, శిరీష్ ఈమూవీని నిర్మిస్తున్నారు. కెరీర్‌లో తొలిసారి గోదావరి యాసని ఈ సినిమా కోసం విజయ్ దేవరకొండ ట్రై చేస్తున్నాడు. కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీ టైటిల్ గ్లింప్స్‌ని రీసెంట్‌గా మేకర్స్ విడుదల చేయడం తెలిసిందే. 80వ దశకం నేపథ్యంలో సాగే రస్టిక్, అండ్ రూత్‌లెస్ మూవీగా తెలుస్తోంది. రీసెంట్‌గా విడుదల చేసిన గ్లింప్స్‌లో విజయ్ దేవరకొండని చూపించిన తీరు, తను గోదావరి యాసలో డైలాగ్స్ చెప్పిన విధానం ఫ్యాన్స్, సినీ లవర్స్‌తో పాటు ఇండస్ట్రీ వర్గాలని కూడా విశేషంగా ఆకట్టుకుంటూ హాట్ టాపిక్‌గా మారింది. విజయ్ పక్కా మాసీవ్ అవతార్‌లో ఇంటెన్స్ ఉన్న క్యారెక్టర్‌లో కనిపిస్తున్న తీరు సినిమాపైఅంచనాల్ని పెంచేస్తోంది. చాలా రోజుల తరువాత మళ్లీ రౌడీ స్ట్రైక్స్ అగైన్ అని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. తాము ఏదైతే రౌడీ నుంచి ఆశిస్తున్నామో అది మళ్లీ ఇన్నాళ్లకు ఈ సినిమాతో నెరవేరబోతోందని హ్యాపీగా ఫీలవుతున్నారు. ఈ నేపథ్యంలో నేషనల్ క్రష్.. విజయ్ లవ్ ఇంట్రెస్ట్ రష్మిక మందన్న -రౌడీ జనార్ధన- గ్లింప్స్‌పై ఎలా స్పందిస్తుందా అని అంతా ఎదురు చూస్తున్నారు. విజయ్ మాసీవ్ లుక్, డైలాగ్స్‌పై రష్మిక ఎలాంటి పోస్ట్ పెడుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలోనే రష్మిక అంతా ఎదురు చూస్తున్నట్టుగానే %-%రౌడీ జనార్ధన%-% గ్లింప్స్‌పై సోషల్ మీడియా వేదికగా స్పందించింది. విజయ్‌ని, ఇందులోని స్టఫ్‌ని చూసి తనకు మెంటలెక్కిపోయిందట. యూ రౌడీ ఫెల్లో..ఇదొక మెంటల్ స్టఫ్. ఏం విజువల్స్.. ఏం మ్యూజిక్..ఏం వైబ్.. ఏం యాక్టింగ్.. విజయ్‌దేవరకొండ, రవికిరణ్ కోలా మీ ఇద్దరు యమ క్రేజీ.. నేను దీన్ని చాలా ప్రేమిస్తున్నాను.. ఇష్టపడుతున్నాను. కీర్తిసురేష్ క్యూటీ నీకు అల్ ద బెస్ట్- అంటూ రష్మిక స్పందించింది. తను రౌడీ జనార్ధన పిక్‌ని జత చేసి రష్మిక షేర్ చేసిన ఈ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. ఇదిలా ఉంటే త్వరలో రష్మిక మందన్న, విజయ్ దేవరకొండ జంట కాబోతున్న విషయం తెలిసిందే.



# పింక్ డ్రెస్ లో మెరిసిపోతున్న భాగ్యశ్రీ..

టాలీవుడ్ లో ఇప్పుడు యూత్ క్రష్ ఎవరు అంటే ఠక్కున వినిపించే పేరు భాగ్యశ్రీ బోర్సే. తక్కువ టైమ్ లోనే తనకంటూ ఒక ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ను క్రియేట్ చేసుకుంది ఈ భామ. కేవలం సినిమాలతోనే కాకుండా సోషల్ మీడియాలో కూడా అమ్మడు చాలా యాక్టివ్ గా ఉంటుంది. ఎప్పటికప్పుడు తన లేటెస్ట్ ఫొటోషూట్స్ తో నెటిజన్లను కట్టిపడేస్తుంటుంది. సాధారణంగా హీరోయిన్లు గ్లామర్ షోతో ఆకట్టుకోవాలని చూస్తుంటారు. కానీ భాగ్యశ్రీ మాత్రం సంప్రదాయ బద్ధంగా కనిపిస్తూనే మోడర్న్ టచ్ ఇవ్వడంలో దిట్ట. లేటెస్ట్ గా ఆమె తన ఇన్స్టాగ్రామ్ లో షేర్ చేసిన కొన్ని ఫొటోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ ఫొటోల్లో ఆమె అందం చూసి కుర్రకారు ఫిదా అవుతున్నారు. ఈ లేటెస్ట్ ఫొటోల్లో భాగ్యశ్రీ పింక్ కలర్ డిజైనర్ వేర్ లో మెరిసిపోతోంది. "ఒక అమ్మాయి పింక్ తో ప్రేమలో పడితే, ఆమె గుండె నవ్వుతుంది" అనే క్యాప్షన్ తో ఆమె ఈ ఫొటోలను షేర్ చేసింది. ఆ డ్రెస్ కు తగ్గట్టుగా సింపుల్ జ్యువెలరీ, చెవికి చిన్న కమ్మలు పెట్టుకుని చాలా క్లాసీగా కనిపిస్తోంది. ముఖ్యంగా ఆమె తల నిమురుకుంటూ నవ్వుతున్న స్టిల్ అయితే చాలా క్యూట్ గా ఉంది. మరో ఫొటోలో దుపట్టాతో ఆడుకుంటూ, వెనక్కి తిరిగి చూస్తున్న చూపులు ఎవరినైనా కట్టిపడేసేలా ఉన్నాయి. బ్యాక్ గ్రౌండ్ లో బ్లూ లైటింగ్, ఆమె వేసుకున్న పింక్ డ్రెస్ కాంబినేషన్ ఫొటోలకు కొత్త కళను తీసుకొచ్చింది. గ్లామర్ అంటే కేవలం ఎక్స్ పోజింగ్ కాదని, ఇలా నిండుగా ఉంటూనే కిల్లింగ్ లుక్స్ ఇవ్వొచ్చని ఆమె నిరూపిస్తోంది. ఆ నవ్వులోనే ఏదో మ్యాజిక్ ఉందని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ముంబై నుంచి వచ్చినా కూడా అచ్చమైన తెలుగు అమ్మాయిలా కనిపించడం భాగ్యశ్రీ స్పెషాలిటీ. ఈ పింక్ డ్రెస్ లో ఆమెను చూస్తుంటే ఏదో బాపు బొమ్మలా అనిపిస్తోంది. సోషల్ మీడియాలో ఈ పిక్స్ కు లైకుల వర్షం కురుస్తోంది.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**

# ఆర్థిక వ్యవస్థకు, ప్రజల జీవనానికి రైతే వెన్నెముక

### నేడు ఆధునిక సాంకేతికత చేయూతతో వ్యవసాయ రంగం ముందుకెళ్తోంది

### కిసాన్ సువిధ యాప్‌తో అన్నదాతకు బహుళ ప్రయోజనాలు

### జాతీయ రైతు దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ:** దేశ ఆర్థిక వ్యవస్థకు, ప్రజల జీవనానికి రైతే వెన్నెముక అని.. నేడు ఆధునిక సాంకేతికత చేయూతతో వ్యవసాయ రంగం వడివడిగా ముందుకెళ్తోందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. జాతీయ రైతు దినోత్సవం (కిసాన్ దివస్) సందర్భంగా మంగళవారం నగరంలోని శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో వ ృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ తాను కూడా ప్లాంట్ ఫిజియాలజీలో పీహెచ్‌డీ చేశానని.. తానూ రైతుబిడ్డనేని, తల్లిదండ్రులు ఇప్పటికీ వ్యవసాయం చేస్తూ ఉంటారన్నారు. ప్రస్తుతం వ్యవసాయ రంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయని.. కిసాన్ సువిధ యాప్‌తో పంటను ఏ పురుగులు నాశనం చేస్తున్నాయి? ఏ వాతావరణానికి ఏ పంట అనుకూలం? అందుబాటులో ఉన్న వ్యవసాయ యంత్ర పరికరాలు, వ్యవసాయ మార్కెటింగ్, ప్రక ృతి వ్యవసాయం తదితరాలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోవచ్చన్నారు. నేడు కచ్చితమైన వ్యవసాయం దేశవ్యాప్తంగా అమలవుతోందని.. డ్రోన్ సాంకేతికత, జీవన ఎరువులు, నానో ఎరువులు తదితరాలపైనా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడారు. మున్ముందు ఇంకా డ్రోన్‌ల అవసరం ఎక్కువగా ఉందని.. ప్రభుత్వం వ్యవసాయ రంగ అభివ ృద్ధికి, రైతుల క్షేమం, సంక్షేమానికి వినూత్న పథకాలు, కార్యక్రమాలతో క ృషిచేస్తోందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రొఫెసర్ వై.శివశంకర్ మాట్లాడుతూ దైశానికి అన్నదాత రైతు అని, రైతు అహర్నిశలు కష్టపడితే తప్ప మన కంచంలోకి అన్నం రాదని, మనం కడుపునిండా తింటున్నామంటే అది రైతు వల్లేనని పేర్కొన్నారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన, పోస్టర్ ప్రజంటేషన్, వక్త ృత్వ పోటీల్లో విజేతలకు కలెక్టర్ లక్ష్మీశ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అన్నదాతలను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. వీవీఎస్ కుమార్, వ ృక్షశాస్త్ర విభాగం అధ్యాపకులు టి.సలోమి, బి.శైలజ, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు హాజరయ్యారు.

# సినీ, సాహిత్య, సాంస్కృతిక ఆవకాయ

### జనవరి 8 నుంచి 10 వరకు ఘనంగా అమరావతోత్సవాలు

### రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధిలో మరో కీలక అడుగు

### మన సాంస్కృతిక వైభవానికి అంతర్జాతీయ గుర్తింపునకు వీలు

### జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ:** నగరం మరో ఉత్సవ హేళకు వేదిక కానుందని.. జనవరి 8 నుంచి 10వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఆవకాయ పేరుతో సినిమా, సంస్కృతి, సాహిత్యాల అమరావతోత్సవం జరగనుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. మంగళవారం విజయవాడలో కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ.. ఏపీటీఏ డిప్యూటీ సీఈవో ఎ.శ్రీనివాస్, టీమ్‌వర్క్ (సెలబ్రేటింగ్ ది ఆర్ట్స్) సంస్థ ప్రతినిధి సయ్యద్ శామ్స్ తదితరులతో కలిసి ఆవకాయ్ అమరావతోత్సవం వివరాలను మీడియా సమావేశంలో వెల్లడించారు. అమరావతిని సాంస్కృతిక సాహితీ రాజధానిగా తీర్చిదిద్దేందుకు గౌరవ ముఖ్యమంత్రి దిశానిర్దేశానికి అనుగుణంగా ఈ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విజయవాడ పున్నమి ఘాట్, భవానీ ఐల్యాండ్‌లో నిర్వహించే ఉత్సవాలకు ప్రవేశం ఉచితమని.. ముఖ్యమంత్రి ఈ ఉత్సవాలను ప్రారంభిస్తారన్నారు. సినిమా, సంగీతం, సాహిత్యం, సాంస్కృతిక వైభవాన్ని ఒకేవేదికపైకి తెచ్చే గొప్ప ఉత్సవాలు ఇవని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వారసత్వ సంపదకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించేలా ఈ ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరుగుతుం దన్నారు. అమరావతిని సాహితీ, కళల రాజధానిగా మార్చేందుకు తొలిమెట్టుగా ఈ ఫెస్టివల్ ఉండనుందన్నా రు. మూడు రోజుల పాటు జరగనున్న వేడుకల్లో భాగంగా తెలుగు సినిమా మూలాలు, సాహిత్య నేపథ్యం, నేటి మార్పులపై చర్చలు, ప్రదర్శనలు కూడా ఉంటాయన్నారు. సంగీత ప్రదర్శనలు, హెర్ ఫ్రేమ్స్, హెర్ ఫైర్ ప్రదర్శనలు, ది మ్యూజిక్, మస్తీ, మ్యాజిక్, టైమ్ లెస్ టేల్స్ , ముషాయిరా ఎక్స్‌పీరియన్స్ వంటి కార్యక్రమాలుంటా యన్నారు. స్థానిక కళాకారులను కూడా ఈ ఉత్సవాల ద్వారా ప్రోత్సహించనున్నట్లు వివరించారు. వారసత్వ యాత్రలు, ఘాట్ ఫెర్రీ ప్రయాణాలు, రుచికరమైన స్థానిక వంటకాలతో కూడిన ఫుడ్ ఫెస్టివల్‌ను కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. మీడియా సమావేశానికి ముందు కలెక్టర్ లక్ష్మీశ.. వివిధ శాఖల అధికారులతో ఆవకాయ్ ఉత్సవాలపై సమన్వయ సమావేశం నిర్వహించారు. విజయవాడ నగరపాలక సంస్థ, పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్యం తదితర శాఖల అధికారులకు ఉత్సవాల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. విజయవాడ ఉత్సవాలను విజయవంతం చేసినట్లే ఆవకాయ్ సినిమా, సంస్క ృతి, సాహిత్యాల అమరావతోత్సవాన్ని కూడా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇది తొలి అడుగు మాత్రమేనని.. ఏటా ఈ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఏపీటీఏ డిప్యూటీ సీఈవో ఎ.శ్రీనివాస్ తెలిపారు. టీమ్‌వర్క్ సంస్థకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సాంస్కృతిక, సాహిత్య ఉత్సవాలను నిర్వహించి, విజయవంతం చేసిన గుర్తింపు ఉందన్నారు. కలెక్టర్ లక్ష్మీశ.. ఏపీటీఏ అధికారులు, టీమ్‌వర్క్ సంస్థ ప్రతినిధులతో కలిసి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు.

# మహిళా సాధికారతకు ప్రత్యేక కార్యక్రమాలు

### వినూత్న చొరవ, పథకాలతో ప్రభుత్వ చేయూత

### గ్రామస్థాయి నుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహించండి

### వన్ స్టాప్ సెంటర్, ఉమెన్ హెల్ప్ లైన్ (181) సేవలపై అవగాహన కల్పించండి

### జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ:** ఆపదలో ఉన్న మహిళలకు ఆపన్న హస్తం అందించి సమాజంలో ఎదిగేలా చేసేందుకు, మహిళల సాధికారత లక్ష్యంగా ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు, పథకాలు అమలుచేస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకునేలా గ్రామస్థాయి నుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన మంగళవారం కలెక్టరేట్ ఏపీఎస్ రెడ్డి హాల్‌లో మిషన్ శక్తి జిల్లాస్థాయి కమిటీ సమావేశంతో పాటు వరకట్న నిషేధ చట్టం - 1961 అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళా, శిశు సంక్షేమం, వైద్య ఆరోగ్యం, పోలీస్, విద్య తదితర సమన్వయ శాఖల అధికారులు హాజరైన ఈ సమావేశంలో బేటీ బచావో బేటీ పఢావో, వన్ స్టాప్ సెంటర్, నారీ అదాలత్, ఉమెన్ హెల్ప్ లైన్ (181), ప్రధానమంత్రి మాత ృ వందన యోజన, శక్తి సదన్, శక్తి నివాస్ తదితరాల అమలుపై సమీక్షించి.. మరింత సమర్థవంత అమలుకు సూచనలు చేశారు. భర్తను కోల్పోయిన, బంధువులతో నిరాదరణకు గురైన స్త్రీలు, లైంగిక వేధింపులకు గురైన స్త్రీలు వంటివారికి ఆపన్న హస్తం అందించి, సమాజంలో ఉన్నతంగా ఎదిగేందుకు చేయూతనిచ్చేందుకు ఉన్న కార్యక్రమాలను పటిష్టంగా అమలుచేయాలని సూచించారు. శక్తి సదన్‌ల ద్వారా అందుతున్న ఉచిత వసతి, ఆహారం, వైద్య సదుపాయాలు, వ ృత్తి, నైపుణ్య శిక్షణ, న్యాయపరమైన సలహాలు, సామాజిక ఆర్థిక భద్రత, సోషల్ కౌన్సెలింగ్ తదితరాలపై అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు వాసవ్య మహిళా మండలి, గ్రామ వికాస్ వంటి స్వచ్ఛంద సంస్థలతో కలిసి అవగాహన శిబిరాలు నిర్వహించాలన్నారు. ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వన్‌స్టాప్ సెంటర్ ప్రతినిధులు అందుబాటులో ఉండాలన్నారు. ఆపదలో ఉన్న మహిళలకు మేమున్నామంటూ సమష్టిగా భరోసా కల్పించాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. సమావేశంలో వరకట్న నిషేధ చట్టం-1961 అమలుపైనా చర్చించారు. చట్ట పటిష్ట అమలుకు సమన్వయ శాఖలు క ృషిచేస్తూ చట్ట సూర్తిపై అవగాహన కల్పించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ రుక్సానా సుల్తానా బేగం, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, జి.రేష్మి (వాసవ్య మహిళా మండలి), వీడీ సత్యనారాయణరెడ్డి (గ్రామ వికాస్), డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, సమన్వయ శాఖల అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సమాచార శాఖ కార్యాలయంలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు





**విజయవాడ:** సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని సెమీ క్రిస్మస్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ ఎల్. స్వరలత, జాయింట్ డైరెక్టర్ పి. కిరణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అడిషనల్ డైరెక్టర్ ఎల్. స్వరలత మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే పండుగ క్రిస్మస్ అని అన్నారు. క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికీ అనుసరణీయం తెలిపారు. ఉద్యోగులకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రేమ, శాంతి, సౌభ్రాత ృత్వం వంటి విలువలను క్రిస్మస్ సందేశం ప్రతి ఒక్కరికీ గుర్తుచేస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగుల మధ్య ఐక్యత, పరస్పర గౌరవం మరింత బలపడేలా ఇటువంటి వేడుకలు దోహదపడతాయని తెలిపారు. జాయింట్ డైరెక్టర్ పి. కిరణ్ కుమార్ మాట్లాడుతూ, క్రిస్మస్ అంటేనే శాంతి, సమాధానాలకు నిదర్శనం అని అన్నారు. ప్రపంచ ఐకమత్యానికి క్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. క్రిస్మస్ పండుగ అంటేనే ప్రేమ, శాంతి, సౌభ్రాత ృత్వం, మానవత్వానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో శాఖ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని క్రిస్మస్ సందేశాలు, శుభాకాంక్షలు పరస్పరం పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు బి. పూరచంద్రరావు, పి. వెంకట్రాజు గౌడ్, డి. రమేష్, అసిస్టెంట్ డైరెక్టర్లు పి. రాజశేఖర్, ఏఎస్ వీరభద్రరావు, తిరుపాలయ్య, ఎస్ వీ మోహనరావు, ఏవో పి. సుదర్శనరావు, జేఈవో నాగరాజు, పీఆర్వోలు, సూపరిండెంట్లు, ఉద్యోగులు తదితరలు పాల్గొన్నారు.

# ఈనెల 20 నుండి వచ్చే నెల 19 వరకు ఆర్టీసీ డోర్ డెలివరీ మాసోత్సవాలు

### రాష్ట్రంలోని 84 ముఖ్య పట్టణాల్లో డోర్ డెలివరీ సేవలు

### ప్రజా రవాణా శాఖ అధికారిణి వి.ప్రవీణ




**నర్సీపట్నం:** రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఏపీఎస్ఆర్టీసీ డోర్ డెలివరీ మాసోత్సవాలు పురస్కరించుకుని అధికారులు, ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. దీనిలో భాగంగా అనకాపల్లి ప్రజా రవాణా శాఖ అధికారిణి వి.ప్రవీణ.. స్థానిక బస్ స్టేషన్ లో నిర్వహిస్తున్న పార్సిల్ రవాణా కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈనెల 20 నుండి వచ్చే నెల 19 వరకు డోర్ డెలివరీ మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. డోర్ డెలివరీ సౌకర్యం రాష్ట్రంలోని 84 ముఖ్యమైన పట్టణాలలో ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. ఒక కేజీ నుండి 50 కేజీల వరకు బరువున్న పార్సిళ్లను డోర్ డెలివరీ చేయబడునని తెలిపారు. అతి తక్కువ చార్జీలతో, అతివేగంగా, అతి భద్రంగా డోర్ డెలివరీ చేయబడునని ఆమె చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. అదే విధంగా సిబ్బంది కూడా ఈ విషయాన్ని ప్రయాణీకులకు, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు తెలియజేసి కార్గో ఆదాయాన్ని అభివ ృద్ధి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజనీర్ ఎ.గంగాధర్, నర్సీపట్నం డిపో మేనేజర్ ఎం.ఎస్.ఎస్.ధీరజ్, ఆర్టీసీ అసోసియేషన్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రోన్ కెమెరా నిఘాలో పట్టుబడితే చర్యలు తప్పవు

### రూరల్ సీఐ రేవతమ్మ



**నర్సీపట్నం:** డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, రూరల్ సీఐ రేవతమ్మ, రూరల్ పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో గబ్బాడ, రావణాపల్లి, ఏటి గైరంపేట, సాధుపాకల ప్రాంతాల్లో డ్రోన్ కెమెరా ద్వారా మంగళవారం నిఘా చర్యలు చేపట్టారు. ఈ సమయంలో సాధుపాకల శివారు ప్రాంతంలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ రేవతమ్మ మాట్లాడుతూ, ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే, డ్రోన్ కెమెరా సహాయంతో నిఘా ఉంచి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని ఆమె కోరారు.

# అనధికార కట్టడాలపై ఉక్కుపాదం

**అనుమతులు లేని నిర్మాణాల కూల్చివేత**



**సూళ్లూరుపేట:** మున్సిపల్ అధికారులు అనధికార నిర్మాణాలపై కఠిన చర్యలు చేపట్టారు. పట్టణంలోని గురుకుల పాఠశాల ఎదురుగా ఉన్న కాసారెడ్డి పాలెం ప్రాంతంలోని ఒక అపార్ట్మెంట్ వద్ద మున్సిపల్ అనుమతులు లేకుండా నిర్మించిన కట్టడాలను మంగళవారం టౌన్ ప్లానింగ్ విభాగం కూల్చివేసింది. మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య ఆదేశాల మేరకు చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. సంబంధిత భవన యజమానులకు ముందుగానే నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో నిబంధనల ప్రకారం కూల్చివేత చేపట్టాల్సి వచ్చిందని తెలిపారు. పట్టణ పరిధిలో అనుమతులు లేకుండా చేపట్టే ఎలాంటి నిర్మాణాలనైనా సహించబోమని మున్సిపల్ అధికారులు స్పష్టం చేశారు. భవన నిర్మాణాలు ప్రారంభించే ముందు తప్పనిసరిగా మున్సిపల్ అనుమతులు పొందాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని ప్రజలకు సూచించారు.

# రైతు అభివృద్ధికి ఎస్‌బీఐ భరోసా

**మా మద్దతు - మీ ప్రగతి నినాదంతో రైతులకు చేయూత**



**సూళ్లూరుపేట:** దేశానికి అన్నం పెట్టే అన్నదాతల ఆర్థిక, సాంకేతిక అభివృద్ధే లక్ష్యంగా పట్టణంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 'అన్నదాత ఉత్సవ్ %--% మా మద్దతు, మీ ప్రగతి' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ గిరిధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడారు. రైతుల సంక్షేమానికి ఎస్‌బీఐ ఎల్లప్పుడూ అండగా నిలుస్తోందని, రైతులు ఆర్థికంగా బలపడితేనే దేశం సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని బ్యాంకు అందిస్తున్న వివిధ రకాల రుణాలు, సేవల గురించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ సత్యనారాయణ స్వామి మాట్లాడుతూ, పంట రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డు, పంట బీమా పథకాలు, వ్యవసాయ యంత్రాల రుణాలు, డ్రిప్ ఇరిగేషన్ వంటి ఆధునిక సాగు విధానాలకు ఎస్‌బీఐ ఆర్థిక సహకారం అందిస్తోందని తెలిపారు. అలాగే రైతులు డిజిటల్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకుని లావాదేవీలను సులభంగా, సురక్షితంగా నిర్వహించుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యల పరిష్కారానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్లప్పుడూ ముందుంటుందని బ్యాంకు ప్రతినిధులు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమం రైతుల్లో విశేష స్పందనను రాబట్టింది. రైతు సంక్షేమానికి ఎస్‌బీఐ ఎంతటి ప్రాధాన్యత ఇస్తోందో అన్నదాత ఉత్సవ్ కార్యక్రమం మరోసారి నిరూపించింది.

# ఫ్లెమింగో ఫెస్టివల్‌కు సన్నాహాలు ముమ్మరం

**సూళ్లూరుపేట, తడ మండలాల్లో ఉన్నతాధికారుల విస్తృత పరిశీలన**



**సూళ్లూరుపేట/తడ:** ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ముందస్తు ఏర్పాట్లను ముమ్మరం చేసింది. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మంగళవారం సూళ్లూరుపేట పట్టణం, తడ మండలంలోని పలు ప్రాంతాల్లో ఉన్నతాధికారులు విస్తృతంగా పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. సూళ్లూరుపేటలోని జూనియర్ కాలేజ్ గ్రౌండ్, చెంగాళమ్మ గుడి వెనుక ఉన్న గ్రౌండ్‌తో పాటు తడ మండలంలోని బీవీ పాలెం, ఇరకం దీవిని సందర్శించిన అధికారులు, ఫెస్టివల్ నిర్వహణకు అవసరమైన మౌలిక సదు-పాయాలు, భద్రతా చర్యలు, పర్యాటక సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ, పరిశుభ్రత తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ పరిశీలనలో రెవెన్యూ డివిజనల్ అధికారి కిరణ్మయి, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ (వైల్డ్ లైఫ్) ఈ. హారిక, ఏపీ టూరిజం రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, తిరుపతి జిల్లా టూరిజం అధికారి జనార్ధన్, నాయుడుపేట డివిజన్ డీఎస్పీ చెంచు బాబు పాల్గొన్నారు. ఫ్లెమింగో ఫెస్టివల్‌ను పర్యాటకులను ఆకర్షించే విధంగా, పర్యావరణ పరిరక్షణకు భంగం కలగకుండా నిర్వహించాలని అధికారులు సూచించారు. అలాగే సూళ్లూరుపేట తహసిల్దార్ పి. గోపీనాథ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె. చిన్నయ్య, ఎంపీడీవో మురళీకృష, ఈవెంట్ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన విబ్రి మీడియా హైదరాబాద్ ప్రతినిధులు కిరణ్ కుమార్ (ఆపరేషన్స్ హెడ్), వెంకట్ (ప్రొడక్షన్ హెడ్) తదితరులు పాల్గొని తమ సూచనలు, ప్రణాళికలను వివరించారు. ఫెస్టివల్ నిర్వహణకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమర్థవంతమైన ఏర్పాట్లు చేయాలని అధికారులు స్పష్టం చేశారు. ఫ్లెమింగో ఫెస్టివల్ ద్వారా సూళ్లూరుపేట, తడ మండల ప్రాంతాలకు పర్యాటక ప్రాధాన్యత మరింత పెరగనుందని పేర్కొన్నారు.

# మద్యం మత్తుకు చెక్.. ప్రాణాలకు రక్షణ

**జిల్లాలో రోడ్ సేఫ్టీకి బలమైన అడుగు**

**హైవే వాహనాలకు బ్రీత్ అనలైజర్లు.. కఠిన చర్యలు అమలు**



**తిరుపతి:** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మద్యం సేవించి వాహనం నడిపే వారిపై విస్తృత తనిఖీలు, కఠిన చర్యలకు శ్రీకారం చుట్టారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడితే కేసు నమోదు చేయడమే కాకుండా, డ్రైవింగ్ లైసెన్స్‌ను ఆరు నెలల పాటు సస్పెండ్ చేయనున్నట్లు పోలీసులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం తిరుపతి జిల్లా రేణిగుంట ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలో హైవే రోడ్ సేఫ్టీ మొబైల్ వాహనాలకు బ్రీత్ అనలైజర్ పరికరాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎండోమెంట్ శాఖ మంత్రి అనం రాంనారాయణ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి మరియు తిరుపతి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 10 హైవే రోడ్ సేఫ్టీ వాహనాలకు ఒక్కో బ్రీత్ అనలైజర్‌ను పోలీస్ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, చంద్రగిరి ఎమ్మెల్యే పులిపర్తి నాని, టుడా చైర్మన్ డాలర్ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోమ్ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ,

రోడ్డు ప్రమాదాల నివారణ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్య అంశం. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల అనేక కుటుంబాలు దుఃఖంలో మునిగిపోతున్నాయి. ఈ ప్రమాదాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలు అభినందనీయం అని అన్నారు.

జాతీయ, రాష్ట్ర రహదారులు విస్తారంగా ఉన్న తిరుపతి జిల్లాలో హైవే రోడ్ సేఫ్టీపై ప్రత్యేక దృష్టి అవసరమని, బ్రీత్ అనలైజర్‌ల ద్వారా మద్యం సేవించి వాహనం నడిపే వారిని తక్షణమే గుర్తించి చర్యలు తీసుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. హెల్మెట్ వినియోగం, వేగ నియంత్రణ, ట్రాఫిక్ నియమాల పాటనలో ప్రజలు స్వఛ్ఛందంగా బాధ్యత వహించాలని పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు మాట్లాడుతూ, తిరుపతి జిల్లాలో 10 జాతీయ రహదారులు, 13 రాష్ట్ర రహదారులు ఉన్నాయని తెలిపారు. గత ఏడాది జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో సుమారు 500 మంది మృతి చెందగా, 1300 మందికి పైగా గాయాల పాలయ్యారని వెల్లడించారు. హెల్మెట్ ధరించకపోవడం, రాంగ్ రూట్ ప్రయాణం, మద్యం సేవించి వాహనం నడపడం ప్రధాన కారణాలుగా గుర్తించామని చెప్పారు. నాలుగు అంచెల రోడ్డు భద్రతా ప్రణాళికలో భాగంగా అవగాహన, ఇంజినీరింగ్ చర్యలు, కఠిన అమలు, అత్యవసర స్పందన కార్యక్రమాలను సమర్థంగా అమలు చేస్తున్నామని వివరించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే 40 బ్లాక్ స్పాట్లను గుర్తించి బ్యారికేడ్లు, సైన్‌బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ ఏడాది మద్యం సేవించి వాహనం నడిపిన 3,300 మందిపై కేసులు నమోదు చేసి, కోర్టుల ద్వారా జరిమానాలు, కొందరికి జైలు శిక్షలు అమలు చేశామని చెప్పారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపిన 44 వేల మందిపై చర్యలు తీసుకున్నామని, డిసెంబర్ 15 నుంచి 'నో హెల్మెట్ --నో పెట్రోల్' నిబంధనను జిల్లా వ్యాప్తంగా కఠినంగా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. జిల్లా కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా హైవే రోడ్ సేఫ్టీ వాహనాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ జామ్‌లకు తక్షణ స్పందన ఇస్తున్నామని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో కూడా బ్రీత్ అనలైజర్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. రోడ్డు భద్రత పోలీసుల బాధ్యత మాత్రమే కాదు ప్రతి పౌరుడి బాధ్యత. మీ కోసం మీ కుటుంబ సభ్యులు ఎదురు చూస్తున్నారు. చిన్న జాగ్రత్త -- పెద్ద ప్రమాదాన్ని నివారిస్తుంది అని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహర చారి, నాగభూషణం, శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు పాల్గొన్నారు.



# గంజాయి తరలిస్తున్న ఇద్దరు ముద్దాయిలు అరెస్ట్

**పట్టణ సీఐ షేక్ గఫూర్**



**నర్సీపట్నం:** అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు ముద్దాయిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పట్టణ సిఐ షేక్ గఫూర్ మంగళవారం మీడియాకు తెలిపిన వివరాలు ప్రకారం, ముందస్తు సమాచారం మేరకు టౌన్ ఎస్.ఐ రమేష్,పోలీస్ సిబ్బంది సహాయంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద మంగళవారం మధ్యాహ్నం తనిఖీలు చేపట్టారని తెలిపారు. చిత్తూరు జిల్లాకు చెందిన షేక్ అబిద్, షేక్ మహమ్మద్ ఇరాన్ అను ఇద్దరు వ్యక్తులు సీలేరు నుండి చిత్తూరుకు గంజాయిని తరలిస్తుండగా అదుపులోకి తీసున్నారని పేర్కొన్నారు. వారి వద్ద నుండి 6.4 కేజీల గంజాయిని, రెండు స్మార్ట్ ఫోన్ లను సీజ్ చేసామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ముద్దాయిలను రిమాండ్ కు తరలించామని పట్టణ సిఐ గఫూర్ తెలిపారు.

# బీద రవిచంద్రను కలిసిన నాయుడుపేట టీడీపీ నేతలు



**నాయుడుపేట:** తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడిగా నియమితులైన ఎమ్మెల్సీ బీద రవిచంద్రను మంగళవారం నాయుడుపేట తెలుగుదేశం పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీద రవిచంద్రకు నాయుడుపేట పట్టణ టిడిపి అధ్యక్షులు కందల కృష్ణారెడ్డి, నాయుడుపేట మాజీ జడ్పిటిసి సభ్యులు పేరంశెట్టి శ్రీరామ్ ప్రసాద్, నాయుడుపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అత్తికాయల సుబ్రహ్మణ్యం, జిల్లా టిడిపి కార్యదర్శి బిరదవాడ నారాయణ ఆళ్ళ రాజారెడ్డి, నాయుడుపేట పట్టణ టిడిపి కార్యదర్శి మల్లాం రవి కుమార్, తెలుగు యువత నాయకులు మిడత సూరిబాబు, షేక్ సిరాజ్, రెహమాన్, నైనప్పగారి భానుతేజ, ఇమ్మడిచెట్టి వెంకటేశ్వర్లు, కందుకూరి కిషోర్, షేక్ కరిముల్లా, తుపాకుల చెంగయ్య తదితరులు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సన్మానించారు.

# అతి వేగంగా గోడను ఢీకొన్న బైక్

**ముగ్గురు యువకులు దుర్మరణం**

**ఏలూరు :** అతివేగం ముగ్గురు యువకుల ప్రాణాలను తీసింది. బైక్ అదుపుతప్పి గోడను ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు మృతి చెందిన ఘటన సోమవారం అర్థరాత్రి పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర మండలంలోని పోలమూరు గ్రామంలో జరిగింది. ఒకే గ్రామానికి చెందిన యువకులు కావడంతో పోలమూరులో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికుల సమాచారం మేరకు అర్ధరాత్రి 12 గంటల 30 నిముషాల సమయంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని ఇంటికి వెళుతుండగా బైక్ అతి వేగంతో వెళ్లి అదుపుతప్పింది. రోడ్డు ఖాళీగా ఉండటంతో వాహనంపై నియంత్రణ కోల్పోయి షాప్ గోడను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాద స్థలంలోనే ఇద్దరు యువకులు మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన మరో యువకుడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతులు కొల్లు సత్యనారాయణ (28), యేలేటి అంజిబాబు (25), యేలేటి రాజు (19) గా గుర్తించారు. మృతదేహాలను పంచనామా నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పెనుమంట్ర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ అతి వేగం ప్రమాదాలకు ప్రధాన కారణమని అన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. యువతకు శక్తివంతమైన బైకులు ఇచ్చేముందు తల్లిదండ్రులు మరింత జాగ్రత్తలు తీసుకొని సరైన పర్యవేక్షణ కల్పించాలని హితవు పలికారు.